తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



ఫిబ్రవరి 16-28, 2021

సంపుటి 01, సంచిక 09

*Complimentary Copy - 9*



జనం మెచ్చిన నాయకుడు

**శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు** గారికి

జన్మదిన శుభాకాంక్షలు

---


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***

Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.

Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.

Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక



గుహలో కాంతి చూసి గొల్లడుగా
మారినప్పటి సన్నివేశం
ద్విపదలో **నాటి కవిత.** 08

తెలంగాణ సామాజిక స్థితిని
అన్యాపదేశంగా చెప్పే వ్యాసం
39 **నాటి కథలలో తెలంగాణ**



23

కరోనా కష్టాలలో కవిత్వం
ఉబికించిన యువతి
**కె.వి. నరేందర్ నిర్బంధం** కథ



09

తెలంగాణ ఉద్యమానికి ఊతంగా
నిలిచిన **ధూంధాం**ని విశ్లేషించిన
**రసమయి** వ్యాసం



33

సదాశివ యాదిని తడుముతున్న
**ఉదారి నారాయణ** వ్యాసం **తెలుగు
సాహిత్య సంపద**



05

మధురమైన దాంపత్యం సామాజిక
అరాచకానికి నీరుగారిపోయిన కథనం
నాటి కథ **వెల్దుర్తి మాణిక్యరావు
ఎయిర్ మెయిల్.**



19

ఘనమైన గద్వాల్ స్త్రీల గౌరవాన్ని
చాతుర్యాన్ని కళ్ళ ముందు నిలిపిన
**సంగిశెట్టి** వ్యాసం **అతివలను
అందలం ఎక్కించిన గద్వాల**



29

మనిషికి చెట్టుకి ఉన్న అనుబంధం
తెలియ జేసే కథ **రూప్ కుమార్
వేపచెట్లు.**



13

ఒక అతివ సాహసాన్ని, పగను
చిత్రించిన **వెల్దండి శ్రీధర్ అంగడి**

తెలంగాణ భాషా సంపన్నత
గురించి **నలిమెల**తో
43 **అన్నవరం** ముఖాముఖి.


ఇంకా...
**'పల్లె తల్లి వొల్లెడ' కూకట్ల తిరుపతి** కవిత... **07**లో
**'కాలం మాట్లాడుతే' వల్లభాపురం జనార్థన్** కవిత... **17**లో
**'ఆశ్రమం మంచిదే' దాసరి మోహన్** కవిత... **04**లో
**'వేల గొంతుకలైన అక్షరం' జయంతి వాసర చెట్ల** కవిత... **26**లో
**'గడెం నొగలు నా శ్వాసలు' వనపట్ల** కవిత... **28**లో
**'ఒంటరి ఎడారి'**లో పప్పుల **రాజిరెడ్డి** కవిత... **36**లో
**'మన సెట్లా వచ్చింది తల్లీ' చిత్రలూరి** కవిత... **28**లో
ఇంకా, కొత్త పుస్తకం, పుస్తక సమీక్ష, సాహితీ శిఖరం, స్వీకారం, మరెన్నో..

# తంగేడు సంచికకు స్పందన...

మీరు శ్రద్ధతో ప్రతీ
పక్షం తీసుకువస్తున్న
తంగేడు బాగుంది.
సమాజం వ్యాసం లఘు
చిత్రంలా ఉంది.
**- రఘుశ్రీ,**
సాహితీవేత్త

శ్రీమతి కల్వకుంట్ల కవిత గారికి
ఇప్పుడే 'తంగేడు' పుష్పం
అందింది. ఆనందంగా ఉంది.
చరిత్రకు అందినంత వరకు
తెలంగాణకు 2000 సంవత్సరాల
సాహిత్య సౌరభం ఉంది. శాసన
పాఠం వేస్తే ఈ తరం వారికి
కొంత తెలుస్తుంది.
శుభాకాంక్షలు!!
**- ప్రొ॥ ముదిగొండ శివప్రసాద్**

తంగేడు చాలా బాగుంది.
భారతి లాంటి పత్రిక
తెలిసిన పాత తరం వారికి
ఆ స్థాయిలో ఈ తరానికి
అందిస్తున్నారు. సబ్బండ
వర్ణాలకు స్థానం ఇవ్వండి.
**- జూలూరి గౌరీ శంకర్,**
బి.సి. కమీషన్ మాజీ
సభ్యులు

సాహిత్యం, చరిత్ర,
సంస్కృతి రెండూ మన
రెండు కళ్ళతో సమానం...
దయచేసి రెండూ
కొనసాగించండి.
**- కందుకూర్తి యాదవరావ్,**
**కె.ఆనంద్**
చరిత్ర పరిశోధకులు

'తంగేడు' పువ్వు మా
ఇంట్లోకి వచ్చింది.
బంగారు కాంతుల్తో పోటీ
పడి కాంతులు
వెదజల్లింది.
**- ఎన్నవెల్లి రాజమౌళి**
'కథల తాతయ్య'

లేతగా మొలకెత్తిన
తంగేడుకు చిగురించి,
వికసించి కవితల
కుసుమాలై నిరంతరం
తంగేడు సాహిత్య పత్రిక
విరాజిల్లాలి.
**- పురం శంకర్ ముదిరాజ్**

సాహితీ మూర్తుల
సాహిత్య వ్యాసాలు, కవిత
గారి సంపాదకీయాలు
బాగున్నాయి..
కొనసాగించండి.
**- మాదల**
**రాజేంద్రప్రసాద్,**
జర్నలిస్టు

తంగేడు బహిరంతశ్శుద్ధి
కలిగి ఆకర్షిస్తున్నది. ఒక
సాహిత్య పత్రిక అందునా
పక్షపత్రిక ఇదే రూపంలో
కొనసాగితే ఒక చరిత్ర
సృష్టించినట్లే...
**- డా॥ శ్రీరంగాచార్య**
సాహితీవేత్త

తంగేడు పరిమళం
నన్ను తాకింది.
పులకరించాను..
**- కాలువ మల్లయ్య,**
కథకుడు

తంగేడు సాహిత్య పత్రికలో
పటిమగల సాహితీవేత్తల
అక్షరాలను తీసుకువచ్చి
జాగృతం చేస్తున్న సంపాదక
వర్గానికి అభినందనలు...
**- కొండూరి కాశీవిశ్వేశ్వర**
**రావు,** సాహితీవేత్త

సంపాదకీయాలు,
శీర్షికలు, వ్యాసాలు
బాగున్నాయి.
అభినందనలు...
**- డా॥ టి. రంగస్వామి,**
కథకుడు

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-28 ఫిబ్రవరి, 2021

సంపుటి 01 సంచిక 09



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

# రచనలో నిర్మాణ దృక్పథం

చాలామందికి రచనలో వస్తువే ప్రధానం అని ఒక అభిప్రాయం ఉంటుంది. వస్తువే సామాజిక చలన శీలతకు ప్రాతినిధ్యం వహిస్తుందని కొండొకచో బాధ్యత కూడా వహిస్తుందని చెబుతుంటారు. నిర్మాణ శిల్పాన్ని లేక వ్యూహాన్ని గురించి మాట్లాడేవాళ్ళని రూపవాదులని విమర్శిస్తుంటారు.

నిజమే... వస్తునిర్భరత లేనిదే రచనలో పుష్టి ఉండదు. రచనా క్రమాన్ని నిర్దేశించేది వస్తువే. వస్తు పరిణామమే రూపాన్ని నిర్ణయిస్తుంది. వస్తు సారమంతా కచ్చితంగా రూపంలో నిర్దిష్టమౌతుంది.

ప్రాచీన సాహిత్యాలంకారికుల మతాలు ధ్వని - రసము, చర్చ అంతా రూప నిర్దిష్టతకు పర్యవసానమే. ఒక రచన ధ్వనివంతం కావాలంటే, తద్వారా రసం చిప్పిల్లాలంటే నిర్మాణంలోని మెలకువ వల్లనే సాధ్యమౌతుంది.

అరిస్టాటిల్ కెథారిసిస్, జాన్ లాక్ ఎంపిరిసిజం, ప్రాచ్యులు చెప్పే ఔచిత్యం లేక పాశ్చాత్యులు చెప్పే decorum లాంటి సిద్ధాంతాలన్నీ రూపవాదాన్ని అంతర్లీనంగా అంగీకరించేవే.

క్లాసికల్ - నియో క్లాసికల్, రోమంటిసిజం, నియో - రోమంటిసిజం నుండి ఇది కొనసాగుతున్నదే. ఆధునిక తెలుగు కవిత్వంలో విప్లవ దిగంబర కవిత్వాలు రూపానికి పెద్ద ప్రాధాన్యత ఇవ్వలేదు. కాని తరువాత వచ్చిన తెలుగు కవిత్వమంతా రూప ప్రాధాన్యంతోనే కొనసాగింది. సంక్లిష్ట కవుల దగ్గర రూప ప్రాధాన్యం పెచ్చరిల్లింది. నవల, కథ, వ్యాసం మొదలైన వచన సాహిత్యంలో పేరులోనే రూపవాదం ఉంది.

కేవలం వస్తువు మాత్రమే ప్రధానంగా ఉన్న సాహిత్యం కళాహీనమౌతుంది. కళాహీనమైన సృజనకు కాలగర్భమే చిరునామా అవుతుంది.

నిర్మాణ గాఢత సాధించడానికి సృజన కారునికి ఇతోధిక అభ్యాసం కావాలి. ఈ తపస్సు ఎంత గాఢమైనదైతే రచన కూడా అంత గాఢతతో ఉంటుంది. కీర్తిని తన వెంట నడిపించగలిగే సృజన అతనికి సాధ్యమౌతుంది.

కళానైపుణ్యం లేని రచన చవుకబారు సంపాదకుల, పాఠకులవల్ల గొప్పగా అనిపించవచ్చు. సభలలో కరతాళధ్వనులకు ఆస్కారం కూడా కావచ్చు. కాని కాలక్రమంలో ఎంత తొందరగా ప్రాచుర్యానికి వచ్చిందో అంత తొందరగా నిష్క్రమించే అవకాశం ఉంటుంది.

కేవల రూపవాదం కూడా రచనలో అభిలషణీయం కాదు. విపరీతమైన భావచిత్రాలను గుప్పించి వస్తువును చిన్న బుచ్చడం కూడా అప్రతిభుల పనే అనిపించుకుంటుంది. ఏదో ఒకటి రెండు రచనలు సందర్భాన్ని బట్టి చేస్తే సరే కాని అన్ని రచనలు ఇదే ధోరణితో ఉంటే సాహిత్యం యొక్క మౌలిక ప్రయోజనం దెబ్బ తింటుంది.

కాబట్టి ఉత్తమ రచయిత వస్తురూపాలకు సమ ప్రాధాన్యం ఇస్తాడు. అతని వల్లనే వస్తు రూపాల అభేదం వస్తుంది.

ఇటువంటి సౌదర్య మీమాంస తెలంగాణ రచనలలో మరింత పెరుగాలని ఆశిద్దాం.

జై తెలంగాణ, జై జాగృతి.

కవిత
కల్వకుంట్ల

క
వి
త

# ఆశ్రమం మంచిదే...

- దాసరి మోహన్



పిల్లలు పెరిగే వరకే మురిపెం
పద్దెనిమిది తొడిగి పౌరులు అయ్యారా
పరాయి వారౌతారు పరాచికాలు ఆడతారు

ముద్దుల వరకే కన్నా మున్నా
మీసం మొలిచి మగాడు అయ్యాడా
మనుగడలో పడి మలినం అయి పోతాడు

తాళ మేళాలతో వాకిలి దాటాక
తనయ వేరు తన తోట వదలి రాలేదు
పలకరింపులు పెట్టుబోతలను బట్టి పెరుగు తరుగు

ర్యాంకులకు చాక్లెట్ ఆశపెట్టి
రాతల నిండా స్టార్ లు పొడిచి
ఇప్పుడు దూరం కొలవడం ఎందుకు

ఖరీదైన చదువులు ఎగరడానికే
ఖండాలు దాటాక డాలర్ దాహం తీరదాయె
తిరిగి రాలేదని నిందించడం స్వార్థమే

పేగు తెంపి పురుడు పోసావు
ప్రేమతో మరొక్కసారి
అనుబంధాన్ని త్యాగం చేసేయ్

అభివృద్ధి పథంలో బిజీగా ఉన్నారు
ఆనందాలు కొత్త తీరాలు చేరాయి
అడ్డు తప్పు కోండి పెద్ద మనసుతో

సిటీలోనే వున్నారని చిన్న బుచ్చుకోవద్దు
పెద్దగా మిగిలింది ఏమి
వుందని పంచుకోవడానికి ఇంకా

తప్పు ఒప్పులు ఆపాదించలేం
తరాల అంతరాల తమాషా
తడితో మరిన్ని కవితలు రాసుకోవచ్చు

ఆశ్రమం మంచిదే
అందరం ఒక్క చోటికి విసిరేయ బడతాం
రండి ఒకరి ధారకు మరొకరం ఆనకట్ట అవుదాం ...

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# ఎయిర్ మేల్

నాటి అకాల సంఘటనల
ఫలితాన్ని చిత్రించిన కథ...

వెల్దుర్తి మాణిక్యరావు

"పూర్ణిమా! లే, తెల్లవారొచ్చింది... టాంగా, రిక్షాల సందడిగూడా మొదలైంది. పాపను తర్వాత లేపుదాంగాని."

రామం భార్యను మేల్కొలుపుతున్నాడు. అత్తవారు బొంబాయిలో ఉద్యోగరీత్యా ఉంటున్నారు. రాత్రి మూడు ఝాములు మెలకువతో ఉండటం వల్ల పూర్ణిమకు నిద్రమబ్బు వీడలేదు.

"అబ్బా. ఏమి తొందరండి. ఏది చేయి చూతాం.... కుడిచెయ్యి ఎవరిమ్మన్నారు?"

పూర్ణిమ, రామం ఎడమచెయ్యి పట్టి లాగి కూర్చోబెట్టి ఎడమ ముంజేతిని ఎడమచెవి దగ్గరికి పోనిచ్చి, "టక్ టక్ టక్ టక్, అన్నది కొంటెగా.

పెదవులు నవ్వుల పువ్వులు విసరుతున్నట్లు కండ్లు వలపు జల్లులు చల్లుతున్నట్లు రామం కనిపెట్టాడు.

"అట్లంటే ఏమన్నట్టు." అని ప్రశ్నించింది.

"ఏమైనట్లో నీవే మొదలు చెప్పు. మీరు నీ కనుచూపు మేరలో లేనంత సేపు నా గుండె యిట్లా కొట్టుకుంటుంది అన్న మాట. జీవామృతపు ఒక్కొక్క చుక్క ఆవిరై అదృశ్యమవుతున్నదన్నట్టు?"

"ఎప్పుడు వేదాంతమే నీకు" ఇప్పుడే కదూ పున్నమ తెల్లవారింది. రాత్రి తొమ్మిది నుండి నాలుగు వరకు గడియారపు ప్రతిగంట మోతలో హెచ్చరికను గమనిస్తున్నాను. పైన చూదామా చందమామ నిండు వెలుగుతో పరుగెత్తుతున్నాడు. ఓ కళ తగ్గించు కోటానికి ఎంత తొందరపడుతున్నాడో అతను. ఇటు పక్కలో చూతామా పూర్ణిమ ప్రయాణపు గడియలు సమీపిస్తున్నవి నా హృదయాన్ని".

"ఔను పాపం కలతజెందిస్తున్నవి కదూ?" అని పూర్ణిమ అందుకొన్నది. ఇద్దరు తమ్ముతాము మరచిపోయినారు. ఒక అరగంట సేపు.

"నా స్నానం అయింది. ఉపాహారం గిన్నెల్లో సిద్ధంగా వున్నది ఇదిగో. ఈ డబ్బాలో యాభై రవ్వావుండలు. ఈ బుట్టలో తయ్యారుగ కల్పి పెట్టిన అటుకులు, టిఫిన్ క్యారియర్‌లో వరుసగా బజ్జీలు, పూరీలు, చేగోడీలు ఇవి ముగిసేవరకు వుండలకు చేయిపెట్టవద్దు. హొటల్ ఫలహారం తింటే ఒట్టు. చీరకట్టు కుంటూనే ఒట్టుపెట్టుతూవున్న పూర్ణిమను రామం కండ్లనిండ చూసుకున్నాడు. అట్లనే చూస్తూ చిత్తరువువలె నిలిచాడు.

"అయ్యో! మిమ్మల అడుగకుండానే.." అని గునుగుకుంటూ రామాన్ని పూర్ణిమ సామానుగదిలోకి తీసికొని వెళ్ళింది. పెట్టె విప్పింది. "చెప్పండి ఏది కట్టుకోవాలో" అన్నది. ఒకటొకటి మడతలు విప్పుతున్నది, రామం చూస్తూ వున్నాడు.

ఆకుపచ్చని చీర, ప్రకృతికన్య కోయిల కూతలలో కట్టుకునేది. వెన్నెలకన్న చల్లనిదేమో అనిపించింది. ఎంచి యాభై దుకాణాలు తిరిగి ఉభయులు మెచ్చి తెచ్చికొన్నచీర, అది సీమంతంనాడు జరిగింది. ఆనాటి దినచర్య జ్ఞాపకం వచ్చింది. తలవూపినాడు రామం. మడత విప్పింది. మొగిలి రేకుల వాసన గుప్పుమన్నది. ఎండివరుగైన రెండు మొగిలి రెక్కలు రామం ముఖం మీద పడ్డవి. ఒళ్ళు జలదరించింది. వాసన మొగిలి రెక్కలు చూచేసరికి ఎందుకో ఏమో గుండె దడదడమన్నది. "పెరిగి పెద్దనయ్యే పచ్చరంగు కావాలంటే. ఈ ఎండిన పూరెక్కలేమిటి?" అనే భావం మెరుపువలె వచ్చింది. పోయింది.

"నాన్న! నాకు పూల అంగి కావాలె" అంటున్న అమ్మాయిని ఎత్తుకొని బనారసీ బూటాల ఆకుపచ్చ ఫ్రాకు వెదికి తొడిగినారు. నవ్వుతున్న అమ్మాయిని చెరోచెంప ముద్దు పెట్టుకున్నారు.

పొద్దున స్నానం చెయ్యగానే కుంకుమ పెట్టుకుంది పూర్ణిమ. సీసాల కుంకుమ, కలర్ కుంకుమ, సీమ కుంకుమలను బదులు సాయంత్రం ముస్తాబయ్యే టప్పుడు కుంకుమ బరిణె పెట్టిన చోట లేదు. విచారాన్ని కనబడనీయకుండ అణచి సీమ కుంకుమతో నుదుట బాలచంద్రుని దిద్దుకొని ఏమంటున్నారు? అన్నట్టు రామంవైపు చూసింది.

ఉపాహారానికి పదమన్నాడు రామం. మామూలు ప్రకారం కాఫీ గిన్నె అమ్మాయి

నాటి కథ

ముందు పెట్టి ఇంట్లో చేసిన బిస్కట్లు అందించింది. తాము బేసిన్ లడ్డూలు వడ్డించుకున్నారు. అది కావాలని పట్టుపట్టింది, మూడేండ్ల సుధ.. "నీకు సరిపడదు. తినగూడదు" అని తల్లి బుజ్జగించింది. కావాలని కాళ్ళు రాసింది సుధ. అంతటితో రెండు కాఫీ కప్పులు పగిలినాయి. రామం ధోవతి చెంగు, పూర్ణిమ చీరె కొంగు తడిసినాయి. ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు. సుధను కోపగించడం కాని తాము కీచులాడటం కాని వారికి తెలియదు. నవ్వు తెచ్చుకొని ఇద్దరు రేగుపండంత లడ్డు యిచ్చి సుధను బుజ్జగించి పాలు త్రాగించినారు. పూర్ణిమ తన కాఫీ రామానికిచ్చింది. రామం తనకు సాయంత్రానికని మిగిల్చిన పాలను పూర్ణిమకు ఇచ్చాడు. పాలు ఫలహారం అయిపోయింది.

"ఇక లే ప్రయాణమన్నావానికి" అన్నాడు రామం.

టాంగావాడు సామాన్నెక్కిస్తున్నాడు. తాళం కోసం వెదుకుతూ పూర్ణిమ గదిలోకి వెళ్ళింది. రామం వెనకాలె వెళ్ళాడు. నిలువుటద్దంలో ఒకరినొకరు చూచుకున్నారు. కడుపులో ఏమిటో ఆవేదన చెప్పుకోరాదు. యంత్రాల మోస్తరు తిరుగుతున్నారేకాని ఎవరి హృదయం వారి అధీనంలో లేదు. అద్దంలో నీడను చూస్తూ ఇద్దరు చేతులు చాచారు. మలిచారు.

వరండాలోకి వస్తున్న పూర్ణిమను, మరోసారి పలుకరిస్తామని "ఇదిగో" అని పిలిచాడు రామం. తమలపాకు విడెం మరింత ఎరుపెక్కిన ఆ నాల్గు పెదిమలు నాలుగు అంగుళాల అంతరంలో ఉన్నవి.

"పోతున్నావా పూర్ణమా" పక్కింటి శేషమ్మ బొంగురు కుతక వినపడ్డది. వణుకుతున్న పెదవులు కలువలేక వెనక్కు కదిలినవి. ఆశ ఉండి పోయింది. ఎవరో అడిగినట్టు "ఏమంత తొందరపని పూర్ణమ్మా! దినాలు చూస్తే బాగులేవు. ఐనా, పంపించి రా నాయనా! రామం!" అంటూ జారుకుంది శేషమ్మ టాంగా ముందు నుంచి ముగ్గురు టాంగా ఎక్కి స్టేషన్ చేరుకున్నారు. పోర్టర్‌కు పావలా ఇచ్చి కంపార్ట్‌మెంటులో చోటు చేయించాడు. రైలు కదలటానికి పది నిమిషాలు మాత్రమే ఉంది.

"చూడండి" అని మొదలు పెట్టింది పూర్ణిమ. సొమ్ముల పెట్టి తాళంచెవి అల్మారిలోని చందనపు డబ్బిలో ఉంది. చంద్రహారం, గుండ్లు, నాను, రెండు జతల గాజులు, నా వెంట ఉన్నవి. వెండికంచం, చెంబు, గ్లాసు, వెంకయ్యగారి కూతురి పెండ్లంటే యిచ్చాను. తెప్పించండి.... అవుసలి కొండయ్య రెండు తులాల వెండిగిన్నెల బాబతుయివ్వాలె. చాకలికి ఈ నెలజీతం నేను ఇవ్వలేదు. మీ ఎర్రంచు ధోతి రావాల్సి వుంది. "ఈ విధంగా చేబదుళ్ళ వరకు సంసారపు లావాదేవీలను అప్పజెప్పింది. ఇప్పుడు రామానికి కావల్సింది సంసారపు గొడవ



**ఆకుపచ్చని చీర, ప్రకృతికన్య కోయిల కూతలలో కట్టుకునేది. వెన్నెలకన్న చల్లనిదేమో అనిపించింది. ఎంచి యాభై దుకాణాలు తిరిగి ఉభయులు మెచ్చి తెచ్చికొన్నచీర, అది సీమంతంనాడు జరిగింది. ఆనాటి దినచర్య జ్ఞాపకం వచ్చింది. తలవూపినాడు రామం. మడత విప్పింది. మొగిలి రేకుల వాసన గుప్పుమన్నది. ఎండివరుగైన రెండు మొగిలి రెక్కలు రామం ముఖం మీద పడ్డవి. ఒళ్ళు జలదరించింది. వాసన మొగిలి రెక్కలు చూచేసరికి ఎందుకో ఏమో గుండె దడదడమన్నది. "పెరిగి పెద్దనయ్యే పచ్చరంగు కావాలంటే. ఈ ఎండిన పూరెక్కలేమిటి?" అనే భావం మెరుపువలె వచ్చింది. పోయింది.**

నాటి కథ

కాదు. హాయి గూర్చు నాలుగు ముక్కలు, గొంతులోని మధురవాణి.

"ఉద్యోగులు బదిలీ అయ్యేటప్పుడు కవిలెకట్టలు అప్ప చెప్పినట్టు ఇవేమిటి?" అన్నాడు రామం నవ్వుతూ.

"ఏదో చెప్పాలనిపించింది. మనసు కుదుటపడుతుందనుకున్నాను. ఐనా మీ కెన్నని జ్ఞాపకముంటాయి లెండి?" అన్నది పూర్ణిమ.

"ఇక నేను చెప్పుతాను విను". అంటూ రామం పర్సుదీసి. "ఇవి ప్రయాణం ఖర్చులకు, ఇవి కట్నాలకు, ఇవి చిల్లర ఖర్చులకు" అంటూ నోట్లు చూపించాడు. "ఫౌంటెన్ పెన్ ఇందులో ఉన్నది ఏయిర్ మేల్ కవరు విలాసం వ్రాసి వుంది. క్షేమంగా చేరినట్టు వెంటనే ఈ కవరు పంపు". అని చేతి కందించాడు. స్పర్శ సుఖం అనుభవించాడు.

రైలు కదలడానికి అరనిముషం మాత్రమే ఆలస్యం ఉంది. హడావుడిగా రైలు ఎక్కుతున్న రామిరెడ్డిని సమీపించి "మా వాళ్ళిదే రైలులో వెళుతున్నారు. నీవు బొంబాయికే వెళతానన్నావుగా!" కామాటిపురాలోదించు. "వెంటనే ఏయిర్ మేల్ కవరు రాయి" అన్నాడు రామం.

"తప్పకుండా, అంతా జాగ్రత్త చేస్తాను. ప్రతి స్టేషన్లో పూర్ణక్కయ్యను చూస్తుంటాను. నీవేమి చింతపడకు."

పచ్చ్రఝుండా ఎగిరింది.

"ఏయిర్ మేల్" అనే రామం కేక పూర్ణిమ చెవిలో మరోసారి ప్రతిధ్వనించింది.

రామం కలం బట్టి రెండు గీట్లు గీయలేదు. కాని - దినం గడిచింది. అరగంటైనా కనుమూయలేదు. కాని - రాత్రి గడిచింది. ఉదయం పదకొండు గంటలు వీధిలో ఏయిర్ మేల్ వార్తాపత్రికల అమ్మడం హడావుడి కేకలు వినవచ్చాయి. రామం పేపరుకొన్నాడు. "యవనపురంలో రైలుపై దాడి. సాయుధ గుండాల ఘోర దౌర్జన్యాలు" అని తాటికాయలంత అక్షరాల శీర్షికలు. రామానికి ముఖంలో నెత్తురు చుక్కలేదు. కత్తులు ఝుళిపిస్తూ గుండాలు ఆడవాండ్ల డబ్బాలో జొరబడ్డారు.

"తొక్కుళ్ళో పదిమంది పిల్లలు నలిగిపోయారు"

"సుమారు యాభైవేల లూటి."

---

కవిత

# పల్లెతల్లి వొల్లెడ



**కూకట్ల తిరుపతి**

నల్సులై మొల్చిన సందీ....
కాల పయ్య గొౌ్రరగొౌ్రర గుంజుడు
కన్నపేగుల నిలువెల్లా యెలుగు కండ్లు
నిగురాను నీడోలె అలుంకుంటయి

ఉశారుగ ఊదరవెడ్తూ
ఉన్క పల్కులు ఉసిగొల్పే పొగ
ఆదర బాదరగ హడలగొడ్తూ
రాయితీ కలల రంగుల వొల
గాడిద బరువు మోపుకుంట
అగడుగ చెమట చుక్కల దోప్కం
గానుగెద్దుల్లా మెదుపుకుంట
గుమ్ములు నింపుకొనే నంబకరం
మోట గిరె మాటల కాన్గిరీ
మోదుగుపువ్వు వాసనల విద్దెలు

తంతే మల్లెపువ్వుల్ల గాదు
ముండ్లకంపల్ల ముక్కు ముడ్సుకపడే తంతులు
ఎవమెత్తిపోయిన ఇత్తునమోలె
ఎల్లీఎల్లక బొత్తిగ ఎల్లెల్కలవడే రంతులు

కూశి పసీతిల కూడుగ్గవడ్తే
ఇజ్జద్దీసిన రొచ్చుల రొక్కం
బెదురు కొయ్యకు యాల్లాడదీసే
అప్పు కొప్పుల ఉక్కు కొక్కెం

ఏటికి యెదురు దోసుకుంట
ఏగిలేత్తే కాటితో కలెవడుకుంట
ఏండ్ల పడంత్రంగ ఎల్లదీసిన లేకి
ఎదిగే కత్తుల్ల పురాగ వొల్లాలనీ
తలాపు నీడల తలగొడుతూ
కాళ్ల కట్ట సున్నా జాడలకు సూటివెడుతూ
పిల్లకాకులకు బులేరు దెబ్బల్తగలొద్దనీ
కన్నపేగులు నికాషర్తుగ తల్లడం మల్లడం

ఉదాత్త జీవన ఉత్తుంగ సొత్తులు
అత్తారు సొత్తుల ఉచిత సొత్తాలు
కలిమిలేముల పెయ్యిలను కప్పుకొనే
నాజూకు సమ బట్టల సింగారం
కండ్ల పండుగోలె
బుల్ బుల్ పిట్టల రెపరెపలు
రామసక్కదనపు సర్కారు సోపాల
సన్నాయి సరాగాల సింగిడి
అమ్మ నుడిలా కమ్మని బువ్వ
తోటమాలుల తోడూనీడా
పుట్టు రతనాల జాగ
మంచి నీటి ఊట చెలిమె
మన పల్లెతల్లి వొల్లెడ.



# గొల్లడు (ద్విపద)

**నవనాథ చరిత్రము గౌరన**

చక్కటింకొక గొల్ల చయ్యన వచ్చె
ఎక్కుపెట్టిన విల్లు నేర్చినయమ్ము
నీలిపాగయు మొల బెట్టిన పిల్ల
గ్రోలుమూపునిడుకొనిన గొడ్డలియు
నొసవుగా మునుగిద్ద నోరగొండియును
గీసిన గుదియము గెంపారు గురిజ
పూసల పేరును బొంగుగోలయును
గాసె దట్టియు మీద గదియ బిగించి
చుట్టిన యఱుత్రాడు సొంపారు చెంప
గట్టిన యెద్దుల కరుచ కొయ్యలును
మెఱుగు పింఛపు దండ మేటి బెబ్బులులు
కఱవక యుండు వాకట్టు బదకెలు
మరువలు దిగకుండ మందులు వాడి
నెరయు చీరణములుంచిన తిత్తి
కుడిరొండి నొరవుగా గ్రుక్కిన చూచు
కొదువును నును జింక కొమ్మును జల్లి
చిక్కంబు దనకొప్ప సింగంబులట్టి
కుక్కలు తనవెంట కూడి యేతేర...

గౌరన నవనాథ చరిత్రములో ఒక ఘట్టములో వర్ణించిన గొల్ల రూపము. సిద్దేంద్రనాథుడు, గోకరనాథుడు వంటి నవనాథుల చరిత్రమును గౌరన ద్విపదలో రాశాడు. శివుడు పరమదైవంగా భావించినా విగ్రహపూజలు కాకుండా యోగమార్గంలో సిద్ధిపొందడమే వీరి తత్త్వము. వీరిని సిద్ధులు అనికూడా అంటారు. అందులో ఒకచోట వర్ణించిన ఒక గొల్లడు పర్వత ప్రాంతంలోకి వెళ్ళినపుడు గుహలో ఒక కాంతి చూసి సిద్ధుడుగా మారిన సందర్భంలో పై వర్ణన. ఈ కవి క్రీ.శ. 1380-1450 ప్రాంతం వాడు. తల్లి పోచాంబ. తండ్రి అయ్యలామాత్యుడు. రాచకొండవాసి. తన పెదతండ్రి పోతరాజు సింగయనాయకుడు అనే రాజువద్ద మంత్రి. గౌరన రాజాశ్రయం పొందలేదు.

నవనాథచరిత్రము, హరిశ్చంద్రోపాఖ్యానము రాశాడు. సంస్కృతంలో లక్షణదీపిక రాశాడు. తన కావ్యాలను శ్రీశైలమల్లికార్జునునికి అంకితం చేశాడు.

తెలుగులో పాల్కురికి సోమన తరువాత ద్విపదరూపంలో మంచి కావ్యాలు రాసిన కవి గౌరన. వర్ణనలు, సంభాషణలు, పద ప్రయోగాలు పలువురు పండితుల ప్రశంసలందుకున్నాయి.

వ్యాసం

# ప్రత్యేక తెలంగాణ ఉద్యమం - ధూంధాం ఆవశ్యకత

ఉద్యమానికి ముందరి తెలంగాణను వివరిస్తున్న వ్యాసం...



రసమయి బాలకిషన్

తెలంగాణ సంస్కృతి ఒకనాడు ప్రపంచాన్ని ఆకట్టుకుంది. కాని, గతపాలకులు ఈ సంస్కృతిని ధ్వంసం చేశారు. తెలంగాణ విలువైన చరిత్రను, సంస్కృతిని అర్థం చేసుకుంటే తప్ప అది అర్థం కాదు. పదిజిల్లాల్లో ఎక్కడ పిడికెడు మట్టిని పట్టుకున్నా అది శతాబ్దాల చరిత్రను ఎలుగెత్తి చాటుతుంది. తెలంగాణ నేల పూర్వ కాలం నుండి అనేకమంది పాలకుల పాలనలో కొనసాగడం మూలంగా, ఇక్కడి సంస్కృతిలో వైవిధ్యం చోటు చేసుకుంది. అందువల్ల తెలంగాణ సంస్కృతి ఉపఖండ లక్షణాలను కలిగినదిగా విశ్లేషకులు భావిస్తారు. అలాగే దేశానికి మధ్యలో ఉండడం కారణంగా ఉత్తర దక్షిణ భారతాలకు కూడలిగా కూడా భావిస్తారు. ప్రాచీన కాలం నుండి తెలంగాణలో శాతవాహనుల పాలన కొనసాగిందని ప్రభుత్వ చరిత్ర పుస్తకాలు తెలుపుతున్నప్పటికీ, తెలంగాణ చరిత్రకారులు ఇటీవల దొరికిన అనేక ఆధారాలతో తెలంగాణలో తెగల జీవనానికి ముందు నుండే, సింధూ నాగరికతతో సమానమైన నాగరికత విలసిల్లినదిగా భావించారు. అలాగే ఇక్కడ దొరికిన ఇనుము, ఉక్కు ఖనిజంతో వ్యవసాయంలో వికసన దశ ఏర్పడిందని, ఇక్కడి అవసరాలకు సరిపోగా మిగిలిన లోహాన్ని ప్రపంచదేశాలకు ఎగుమతి చేసిన చరిత్ర కూడా వెలికితీయడం జరిగింది.

తెగలుగా ఉన్న జాతి ఇక్కడి చరిత్రను ఎలుగెత్తుతుంటే, ఇక్కడి వ్యవసాయ వికాసము, బౌద్ధ ఆరామాలు ప్రజల యొక్క సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తున్నది. నాగరికతలో భాగంగా విద్యా, వైజ్ఞానిక ఆవిష్కరణలు జరిగిన విధానాన్ని ఇక్కడి సాహిత్యం కండ్లముందుంచుతున్నది. తెలుగు సాహిత్యంలో తొలి విప్లవకవి అయిన పాల్కుర్కి సోమనాథుడు, తెలుగు ప్రజలు గర్వపడేలా భాగవతాన్ని తెనిగీకరించిన మహాకవి బమ్మెర పోతన తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే. తన కావ్యాలను పాలకులకు అంకితమివ్వనని శపథం చేసిన పోతన, తన చరమాంక జీవితాన్ని వ్యవసాయం చేయడంలోనే గడిపాడనే చరిత్ర ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని తెలియజేస్తున్నది. ఇదంతా ఒక ఎత్తైతే, ముస్లిం పాలకుల రాకతో తెలంగాణలో మరో నూతనత్వం చోటుచేసుకుంది. ముస్లిమేతరులైన బహుజనులు, ముస్లింలు, పార్సీలు, సిక్కులు తదితర జాతుల ప్రజలు ఇక్కడికి వలస వచ్చి, ఇక్కడి సంస్కృతితో మమేకం కావడంతో పాటు, ఇక్కడి మంచిని స్వీకరించి, వారి వారి సంస్కృతిలోని ఔన్నత్యమైన విషయాలను ఇక్కడి ప్రజలతో కలబోసుకున్నారు. అలా ఇక్కడి సంస్కృతిని "గంగా, జమున తెహజీబ్" అని విదేశీ పర్యాటకులు కొనియాడారు.

ముస్లిం పాలకులు పాలన చేసినప్పటికీ, ఇతర మతస్థుల యొక్క ఆచార వ్యవహారాలను గౌరవించారు. కులీకుతూబ్‌షా తన ప్రేయసి పేరు మీద భాగ్యనగరాన్ని నిర్మించాడు. తన ప్రేమ కోసం ఒక నగరాన్ని నిర్మించిన చరిత్ర ప్రపంచంలోనే చాలా అరుదు. అంతేకాకుండా తన పాలనలో అక్కన్న, మాదన్నలను మంత్రులుగా నియమించుకోవడమే కాకుండా, ప్రతీ శ్రీరామ నవమికి పట్టు వస్త్రాలను కూడా తానే స్వయంగా తీసుకెళ్లి సమర్పించిన మత సామరస్యం కేవలం ఇక్కడ మాత్రమే జరిగింది. అసఫ్ జాహీల పాలనలో కూడా తెలుగు కవులను ఆస్థాన కవులుగా నియమించుకున్న చరిత్ర ఇక్కడి వైవిధ్యాన్ని తెలియజేస్తుంది. పాలకులు మారుతున్నప్పటికీ, ప్రజలు మాత్రం తమ స్థానికత్వాన్ని ఈ నేల స్వభావాన్ని ఏమాత్రం కోల్పోకుండా కాపాడుకున్నారు. గోలుకొండ కేంద్రంగా ఒకప్పుడు కొనసాగిన వజ్రాల వ్యాపారం,

వ్యాసం

హైదరాబాద్‌ను "పెరల్ సిటీ" అని కీర్తించేలా చేసింది. ఆ కాలంలో గోలుకొండ ప్రాంతంలో ముత్యాలను రాసులుగా పోసి అమ్మారని ఇప్పటికీ తెలంగాణ ప్రజలు చెప్పుకుంటుంటారు. వ్యాపార సంబంధమైన జీవనం తెలంగాణ పట్టణాలకే పరిమితమయ్యింది తప్ప విశాల సమూహాలుగా ఉన్న తెలంగాణ ప్రజల్లో ప్రకృతితో కలిసి జీవించేతనమే ఇటీవలి కాలం వరకు సజీవంగా ఉంది. దొరికిన దానితోనే సంతృప్తిగా జీవించడం మినహా, రేపటి గురించి కూడపెట్టుకుని, దాచుకునే లోభి మనసతత్వం తెలంగాణ ప్రజల్లో మచ్చుకు కూడా కనిపించదు. స్వార్థ చింతనలేని జీవనవిధానం తెలంగాణ ప్రజల్లో కనిపించే మరో సాంస్కృతిక ప్రత్యేకత.

**ప్రాచీన కాలం నుండి తెలంగాణలో శాతవాహనుల పాలన కొనసాగిందని ప్రభుత్వ చరిత్ర పుస్తకాలు తెలుపుతున్నప్పటికీ, తెలంగాణ చరిత్రకారులు ఇటీవల దొరికిన అనేక ఆధారాలతో తెలంగాణలో తెగల జీవనానికి ముందు నుండే, సింధూ నాగరికతతో సమానమైన నాగరికత విలసిల్లనదిగా భావించారు. అలాగే ఇక్కడ దొరికిన ఇనుము, ఉక్కు ఖనిజంతో వ్యవసాయంలో వికసన దశ ఏర్పడిందని, ఇక్కడి అవసరాలకు సరిపోగా మిగిలిన లోహాన్ని ప్రపంచదేశాలకు ఎగుమతి చేసిన చరిత్ర కూడా వెలికితీయడం జరిగింది.**

ఉత్పత్తి విధానమే ఉపరితలమైన సంస్కృతిని నిర్ణయిస్తుంది అన్న అవగాహనతో చూసినపుడు తెలంగాణ ప్రజలది ఏ సంస్కృతో అర్థమవుతుంది. తెలంగాణ ప్రాంతాన్ని బ్రిటీషు వలస పాలన ఆక్రమించుకోకపోవడం కారణంగా తెలంగాణ ప్రజలకు వలస వ్యాపార ధోరణులు అలవడలేదు. ఇప్పటికీ "పుట్టినూరే కన్నతల్లి..." అనే భావన, తెలంగాణ ప్రజల్లో సజీవంగా ఉంది. కరువులు జీవితాలను కల్లోల పరిస్తే గ్రామాలను వదిలిపోయిన ప్రజలు, కేవలం వేళ్లమీదికే పరిమితం. తెలంగాణ నైసర్గిక స్వరూపమే భిన్నమైంది. మౌలికంగా కొండలు, గుట్టలు, వంపులు, డొంకలు, ఎత్తైన తోపులు, పర్వతాలు ఇట్లా వాతావరణంలోనే ఒక ప్రత్యేకత ఉంది. కోస్తా ప్రాంతంలో ఎక్కడా అర ఎకరం జాగా గడ్డి ఉన్నది ఉండదు. విపరీతమైన నీటి పారుదల సౌకర్యాల వల్ల గోదావరి జిల్లాల్లో ఎక్కడ కూడా ఖాళీ కనిపించదు. మైదాన ప్రాంతాలల్ల సాగుజేసి, ప్రకృతిపైన మరింత దాడి చేసి, ప్రకృతిని ఒకరకంగా హింసించి, లాభాల కోసం విపరీతమైన వాణిజ్య పంటల్ని పండిస్తూ, లాభ ప్రాధాన్యతగా ఉన్న జీవన విధానం ఉన్నది. తెలంగాణలో మాత్రం మనుగడ కోసం, ఆహారం కోసం, ఆహార పంటలు, పరిమితమైన వనరులు, పరిమిత ప్రశాంత సాధుజీవనం. ఇప్పటికీ తెలంగాణ గ్రామాల్లో గ్లోబలైజేషన్ నేపథ్యంలో కూడా దాని ఛాయలు కనిపిస్తయి.

తెలంగాణ సంస్కృతిలో అంతర్భాగంగా ఉన్న వేలయేండ్ల జానపద కళారూపాలు, శాతవాహన, కాకతీయ శిల్ప సంపద తెలంగాణ విశిష్టతను పరిపూర్ణం చేశాయి. "ఏది సాహిత్యం అన్నప్పుడు అట్టడుగు ప్రజల నోటి సాహిత్యం అనీ, ఏది కళ అన్నప్పుడు అట్టడుగు ప్రజల చిందు, మాలభాగోతుల ప్రదర్శనే కళ...అని చెబుతున్నప్పుడే నిజమైన నిర్వచనం చెప్పినవాళ్లం అవుతాం" (జయధీర్ తిరుమలరావు వ్యాసం)(గౌరీ శంకర్ జూలూరు, శివరామకృష్ణ పెన్నా 2009:31) జానపద కళారూపాలకు ఆధారమైన కులపురాణాలు, ఆశ్రిత కులాలు కళలను పూర్వకాలం నుండి తెలంగాణ గ్రామీణ ప్రజలను అలరిస్తున్నాయి. కేవలం అలరించడమే కాకుండా అనేక చారిత్రక విషయాలను ఈ కథల్లో బోధిస్తున్నాయి. వారే చిందు, బైండ్ల, ఒగ్గు, శారద, మందహెచ్చులు, పటమొల్లు, బుడుబుడుకల, దాసరులు, జంగాలు, బాలసంతులు, ఫకీర్లు తదితరులు. అలాగే తెలంగాణ శ్రమసంస్కృతిలో భాగంగా ఇక్కడ పాట సజీవంగా ఉంది. మౌఖిక సాంప్రదాయంగా వచ్చిన ఈ పాట తెలంగాణ ప్రాంతంలో ఉన్న దళిత, బహుజన కులాల జీవనాన్ని కండ్ల ముందుంచుతుంది. అందుకే పాట ఇక్కడ మనుగడలో ఉంది. అనేక



కళారూపాలు పాశ్చాత్య వలస సంస్కృతి దాడికి కనుమరుగైనా, పాట ఒక్కటే ఉద్యమాల కారణంగా సజీవంగా ఉంది. ఈ కళారూపాలతో పాటు, తెలంగాణ చారిత్రక వైభవానికి అద్దం పట్టే శిల్ప సంపద శతాబ్దాలు గడిచినా చెక్కు చెదరలేదు. శాతవాహన, కాకతీయ రాజుల పాలనలో ఎనలేని కట్టడాలు ఇక్కడి ప్రజల కళాభిరుచికి ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లతో పాటు, ఏ జిల్లా చూసినా, శిల్ప కళలతో ఇక్కడి కళా వైభవానికి ఆనవాళ్లుగా ప్రసిద్ధికెక్కాయి. శిల్ప కళతో పాటు హస్తకళలు కూడా అనేకం తెలంగాణలో ఓ వెలుగు వెలిగాయి. పెంబర్తి నగిషీలు, నిర్మల్ బొమ్మలు, భూదాన్ పోచంపల్లి చేనేత పరిశ్రమ తెలంగాణ కళాత్మకతను మరింత ప్రకాశవంతం చేశాయి. కాకతీయుల కాలంలోనే "పేరిణి శివతాండవ నృత్యం" ఆవిర్భవించి ప్రసిద్ధికెక్కింది. ఇంకా తెలంగాణలో విస్తారంగా ఉన్న అడవుల్లో కోయా, గోండు ప్రజలు తమవైన కళారూపాలను ప్రదర్శించడం తెలంగాణ సాంస్కృతిక చరిత్రకు కొత్త వన్నెను అద్దుతున్నాయి. ఇవే కాకుండా తెలంగాణలో ఉన్న అనేక ప్రదర్శన కళలు, తెలంగాణ సాంస్కృతిక వారసత్వానికి పెట్టని కోటలుగా వర్ధిల్లుతున్నాయి.

తెలంగాణ ప్రజలది మూలవాసి సంస్కృతి. ఆది మానవుడు నడయాడిన దశనుంచి, ఆధునిక నాగరికత వరకు తెలంగాణ ప్రజల మత విశ్వాసాలు, ఆచారవ్యవహారాల్లో వైవిధ్యం, విభిన్నత చోటుచేసుకున్నది. నాగార్జున కొండ, ఏకశిలా నగరాల బౌద్ధ ఆరామాలను బట్టి, ఇక్కడ బౌద్ధమతాన్ని ప్రజలు పెద్దమొత్తంలో ఆదరించారనే విషయం అర్థమవుతుంది. జైన, బౌద్ధాల అవశేషాలెన్నో తెలంగాణలో ఉన్నాయి. నల్లగొండ, కరీంనగర్, మెదక్ జిల్లాల్లో జైన మతానికి సంబంధించిన, అనేక ఆనవాళ్ళు తవ్వకాల్లో బయటపడ్డాయి. భువనగిరి సమీపంలోని రాయగిరిలో (కొలనుపాక) జైన మందిరాన్ని ప్రజలు విస్తృతంగా సందర్శిస్తుంటారు. బౌద్ధ, జైన మతాల తర్వాత, ఉత్తర భారతం నుండి వచ్చిన మతం ముస్లిం మతం. పాలకులుగా ముస్లింలు సుమారు నాలుగువందల యేండ్ల పాటు పాలించడం వల్ల ఇక్కడి సంస్కృతిలో మార్పులు చోటు చేసుకున్నాయి. అలాగే ఉర్దూ పాలన భాష కావడం కారణంగా విద్యా, ఉద్యోగ అవకాశాల కోసం కూడా కొంతమంది ఇస్లాంను స్వీకరించారు. ముస్లిం పాలన కొనసాగుతున్న సమయంలోనే క్రైస్తవ, సిక్కు, పార్సీ తదితర మతాలు కూడా, తెలంగాణ నేల పైన అడుగుపెట్టాయి. ఇలా భిన్నమతాల సంగమంగా తెలంగాణ సంస్కృతి పేరుగాంచింది.

తెలంగాణ అనగానే గుర్తొచ్చే 'బతుకమ్మ', బోనాలు తదితర పండుగలు తెలంగాణ ప్రత్యేకతను నిలబెడుతున్నాయి. ఈ పండుగలను మిగిలిన ఏ ప్రాంతంలోనూ జరుపుకోరు. అలాగే పువ్వులతో పండుగ చేసుకునే చరిత్ర ప్రపంచంలో మరెక్కడా కానరాని విషయం. తెలంగాణ ప్రజలు ఎంతటి ప్రకృతి ఆరాధకులో బతుకమ్మ పండుగను చూస్తే అర్థం చేసుకోవచ్చు. శ్రమలో భాగంగా ప్రకృతిని పూజించే సంస్కృతి తెలంగాణలో ఇప్పటికీ కనిపిస్తుంది. బతుకమ్మ తర్వాత తెలంగాణలో పెద్దపండుగ దసరా. నిజానికి దసరా పండుగ దేశమంతటా జరుపుకునేదే అయినప్పటికీ, తెలంగాణలో జరుపుకునే తీరులో వైవిధ్యమున్నది. పండుగను సద్దులు, దసరా, పిల్ల దసరా పేర్లతో మూడు రోజుల పాటు జరుపుకుంటారు. ఏ పండుగైనా ఒక్కరోజు, రెండురోజులో ఉంటే, దసరా మాత్రం తెలంగాణలో మూడు రోజుల పాటు జరుపుకుంటారు. దసరా రోజు తెలంగాణ ప్రజలు 'పాలపిట్ట'ను చూడడానికి తమ పొలాల్లోకి వెళతారు. తప్పనిసరిగా పాలపిట్టను చూడాలనే ఆచారం ఇక్కడ ఎప్పటినుంచో

**తెలంగాణ అనగానే గుర్తొచ్చే 'బతుకమ్మ', బోనాలు తదితర పండుగలు తెలంగాణ ప్రత్యేకతను నిలబెడుతున్నాయి. ఈ పండుగలను మిగిలిన ఏ ప్రాంతంలోనూ జరుపుకోరు. అలాగే పువ్వులతో పండుగ చేసుకునే చరిత్ర ప్రపంచంలో మరెక్కడా కానరాని విషయం. తెలంగాణ ప్రజలు ఎంతటి ప్రకృతి ఆరాధకులో బతుకమ్మ పండుగను చూస్తే అర్థం చేసుకోవచ్చు.**

ఉంది. అలాగే దసరా నాటి సాయంత్రం, జమ్మి ఆకు పంచుకొని, పెద్దల ఆశీర్వాదాలు అందుకుంటారు. హిందూ-ముస్లిం సోదరత్వానికి చిహ్నం దర్గా సంస్కృతి. ఇందులో భాగంగా పీరీల పండుగను కూడా తెలంగాణలో ఘనంగా జరుపుకుంటారు. అలావ సుట్టూ అడుగులు కదుపు పాటలు పాడుకుంటారు. దసరాతో పాటు ఉత్తర భారతీయుల వలసతో తెలంగాణకు వచ్చిన పండుగ 'హోళీ'. ఇది తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలుకొని ముఖ్యపట్టణాల వరకు అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. బతుకమ్మ, హోళీ పండుగలపై ప్రత్యేకంగా పాటలు కూడా రూపొందించుకున్నారు ఇక్కడి ప్రజలు. ఇక ఆహారం విషయానికొస్తే తెలంగాణ వంటకాలు కూడా మిగిలిన తెలుగు సమాజపు రుచులలో ప్రత్యేకతను కలిగి ఉన్నాయి. సకినాలు, బచ్చాలు, లచ్చించారు, బిర్యానీ తదితర కమ్మటి రుచులు, తెలంగాణ ఆహారపు ప్రత్యేకతలను చాటుతాయి.

ఇంతటి ఘనమైన సంస్కృతి ఉమ్మడి పాలనలో వివక్షకు గురైంది. ఇక్కడి ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు పాలకులు. తమది మాత్రమే గొప్ప భాష, సంస్కృతి, చరిత్ర అయినట్టుగా వ్యవహరించారు. ఈ అన్యాయం దశాబ్దాల పాటు కొనసాగింది. "తెలంగాణలో ఇవాల్టిదాకా

ప్రజలు ఉరికి ఉరికి అలసిపోతున్నారు. కాకపోతే రూపం మారిందంతే. దగాపడ్డ తెలంగాణలో దోపిడి కొత్త కొత్త రూపాల్లో కొనసాగుతూనే ఉన్నది. చారెడు నేలకోసంనిండు ప్రాణాలు బలైపోతూనే ఉన్నాయి. అభివృద్ధిపేరుతో భూముల్ని లాగేసుకొంటున్నారు. ఉన్న ఆసరా కూడా పోయేసరికి ఆత్మహత్యలే శరణ్య మవుతున్నాయి'' (రమేష్, సుంకర 2009:9) మరోవైపు రాజకీయంగా కొనసాగిన ఆధిపత్యం తెలంగాణ ప్రజలను మరింత బానిసత్వంలోకి నెట్టింది. దీంతో అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. ఈ కనిపించని కుట్రలపైన తెలంగాణ ఉద్యమం అగ్గి మండింది. సకల కుట్రలను కుల్లంకుల్లం చేసింది. ఈ అన్యాయాలకు ఊతమిస్తున్న పాలనను మార్చుకుంటే తెలంగాణ బాగుపడదని భావించింది. అలా ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిననాటి నుంచే ఉద్యమం మొదలైంది. లక్షలాదిమంది పోరాటం, వేలాదిమంది త్యాగాల ఫలం, కేసియార్ మహోన్నత నాయకత్వం తెలంగాణ రాష్ట్ర కలను నిజం చేశాయి.

తెలంగాణ ఉద్యమాన్ని గమ్యానికి చేర్చింది పాట. సాంస్కృతిక శక్తుల క్రియాశీలత మీదే ఏ ఉద్యమ గమనాలైనా ఆధారపడి ఉంటాయి. ఆ విధంగా చూసినపుడు తెలంగాణ ఉద్యమానికి ఉన్న సాంస్కృతిక చరిత్ర సుదీర్ఘమైంది. తెలంగాణ నేలకు గల వేల యేండ్ల మౌఖిక సాహిత్య చరిత్ర అత్యంత విలువైంది. ప్రజల జీవితాలు, వారి ఉత్పత్తి విధానం మీద ఆధారపడి ఉంటాయి. అలాగే వారికి గల సహజ వనరులు, భౌగోళిక, శీతోష్ణస్థితుల మీద కూడా ఆధారపడి ఉంటాయి. అడవి ప్రాంతం అధికంగా గల దేశాల జీవన శైలికి, నగరాలు వేగంగా విస్తరిస్తున్న దేశాల స్థితిగతులకు చాలా వైరుధ్యం ఉంటుంది. "తెలంగాణ భౌగోళిక స్వరూపం కూడా మౌఖిక సాహిత్యానికి పెట్టని కోట. అటు గోండ్వాన గిరిజనులు, ఇటు భద్రాచలం, పాపికొండల ప్రాంతంలో కొండరెడ్లు, కోయలు, నల్లమలలో చెంచులు, ఎరుకలు వ్యాపించి ఉన్నారు. నిరంతరం యుద్ధాలలో సతమతమయ్యే ప్రజలు తమ జీవిత యుద్ధాలను పాడుకోవడం వారి అవసరం. పనిలో, పాటలో, వుత్పత్తిలో, పోరులో వారి అండదండడగా పాట పరుగెత్తింది. జైనం, బౌద్ధం, వీరశైవం, క్రైస్తవం వ్యాప్తి చెందాయి. అంతేకాదు నిత్యం అంతర్యుద్ధాలు చేశాయి. మతసాహిత్యం గూడా మౌఖికంగానే ప్రచారం పొందింది. ఇవి కాకుండా జానపద జనజీవిత గాథలు, మాత కథలు, వీరగాథాచక్రాలు ఇక్కడ వ్యాపించి ఉన్నాయి. మాతకథ అయినా వీరగాథ అయినా అనేక చారిత్రికాంశాలు వాటిలో కనిపించడం ఈ కథల ప్రత్యేకత. ఆ భాష చారిత్రికాంశాలు గల గాథలు ఇతర ప్రాంతాల్లో అధికం. కాని తెలంగాణలో మామూలు పాటలలోనూ ఎక్కువ మొత్తంలో చరిత్ర కనిపించడం విశేషం'' (జయధీర్ తిరుమలరావు వ్యాసం)(గౌరీ శంకర్ జూలూరు, శివరామకృష్ణ పెన్నా 2009:90) ఇలాంటి సుదీర్ఘమైన చరిత్ర తెలంగాణ నేలకు ఉందనే విషయాన్ని చారిత్రక ఆధారాలు రుజువు చేస్తున్నాయి.

తెలంగాణ ప్రాంతానికి అనేక సహజ వనరులు ఉన్నాయి. కానీ,ఈ వనరుల మీద ఇక్కడి ప్రజలకు హక్కు లేకుండా పోయింది. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు ఇక్కడ దక్కకుండా పోవడానికి పాలకుల నిర్లక్ష్య ధోరణి కారణంగా కనిపిస్తున్నది. నిజానికి పాలకులే రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించే బాధ్యతను స్వీకరించాలి. కానీ, ఆ బాధ్యత నుండి ప్రభుత్వాలు వైదొలగడం మూలంగా తెలంగాణ ప్రజల జీవితం అభివృద్ధికి ఆమడ దూరం నెట్టివేయబడింది. ఈ పరిస్థితుల మీద ఒక తిరుగుబాటుగా తెలంగాణ ఉద్యమం పురుడు పోసుకుంది. ఆత్మగౌరవం, స్వయంపాలన అనే భావనలకు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో సుదీర్ఘమైన చరిత్ర ఉంది. తెలంగాణ ఉద్యమం కూడా ఈ భావనల పునాదిగానే పురుడు పోసుకుంది.

రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు దక్కక పోవడానికి హక్కుల ఉల్లంఘనే కారణం. తెలంగాణ విషయానికి వస్తే, రాష్ట్ర ఏర్పాటు సమయంలోనే అనేక షరతులు, నియమాలు ఏర్పాటు చేసుకున్నారు. పెద్దమనుషుల ఒప్పందాలు, ఫజల్ అలీ కమీషన్ రిపోర్టులు ఏవి కూడా తెలంగాణ ప్రజల న్యాయమైన హక్కులను కాపాడలేకపోయాయి. అందుకే క్రమంగా తెలంగాణ ప్రజల్లో ఒక అసంతృప్తి ఆవేదన గూడుకట్టుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం వేరైతే తప్ప తమ బ్రతుకులు బాగుపడవు అనే భావన ప్రజల్లో స్థిరపడిపోయింది. దాని భౌతికరూపమే ఉద్యమం. ఊరూర ప్రతీ పౌరునికి ఈ రకమైన స్పృహ అందివచ్చింది. అభివృద్ధికి పాలకుల వైఖరి ఎలా శాపంగా మారిందో గుర్తించారు. తమ విముక్తికి తామే ఉద్యమించాలని బయలుదేరారు. అట్లా మూడు తరాలుగా ఇక్కడి ప్రజలు పోరాడారు. వారి ఉద్యమ ఆకాంక్షల్ని వివిధ రూపాల్లో వ్యక్తం చేశారు. ముఖ్యంగా కవులు, కళాకారులు తమ సాహిత్యం ద్వారా ప్రజల ఆకాంక్షకు పట్టం కట్టారు. ప్రజల ఆలోచనే తమ ఆలోచనగా సాహిత్యాన్ని సృజించారు. తెలంగాణ వెనుకబాటుకు గల కారణాలను చారిత్రికంగా వివరించే ప్రయత్నంచేశారు. అట్లా ఉద్యమం ప్రతీ ఇంటికీ, పోరాటం ప్రతీ కంటికీ చేరింది. ఈ పరిణామం వెనకాల అనేక చారిత్రక మలుపులు ఉన్నాయి. తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ అడుగులు చాలా కీలకమైనవి. వ్యక్తి నుండి వ్యక్తికి తెలంగాణ విముక్తి భావజాలం అందజేయడం వెనుక సాహిత్య, సాంస్కృతిక రంగాల పాత్ర అత్యంత కీలకమైంది. ఆ క్రమంలో వచ్చిందే ధూంధాం. ప్రజలందరినీ తన ఉద్యమ సాహిత్యంతో ఉర్రూతలూగించిన ప్రక్రియ ఇది - ధూంధాం స్వరూపం మరొకసారి....

కథ

# అంగడి

అంగడి - ప్రతీకారం చిత్రించిన కథ....



డా॥ వెల్దండి శ్రీధర్

"ఏమాయెనయ్య సేటూ! పోయినేడాది కాకరకాయ, బీరకాయ ఇత్తునాలిత్తే మంట్లెనే పోయినై. ఈ తాపకన్నా జెర మంచియియ్యి" పంబాల బాలవ్వ యాష్టపడుతూ ఈశ్వరయ్య కిరాణం దుకాణం ముందట నిలవడి అడిగింది.

"నీ కెందుకవ్వ ఈ సారి మొలవకపోతే వాపస్ తేపో" అన్నడు ఈశ్వరయ్య సేటు నవ్వుకుంట.

"పోరికి పోశవ్వ తల్లి అయిందని పోయిన వారం కొబ్బరికాయ తీస్కపోయి కొడితే అంత మురిగిపోయిందిచ్చినవ్? పైసలన్ని ముంచినవ్. గిట్లే సంపాయి త్తున్నవా ఏంది? మందిని ముంచి" సాకలి రాజవ్వ కోపం, విసుగు కలిపి అంది.

"ఏ దేవునికో మంచిగ మొక్కి మా దుకాణం ముంగట్నే కొట్టవ్వ నీ కొబ్బరి కాయ. మురిగిపోతే పైసలు వాపస్" ఈశ్వరయ్య.

"లావు ఇచ్చత్రంగ మాట్లాడుతున్నవు సేటు. ఆమెనేమో ఇత్తునాలు మంట్లె పారవోసినంక మొలవకపోతే వాపస్ తేపో అంటివి. ఏం దెచ్చుడు? చినిగిపోయిన పొట్లాలనా? నన్నేమో కొబ్బరికాయను ఈన్నే కొట్టుమంటున్నవు. ఎందుకిట్ల నేర్సుకున్నవు సేటు. అమ్మేది మాటలనా? సామానా?" రేసుకొచ్చి కోపంగన్నది రాజవ్వ.

"మరేంజెయ్యిమంటవు చెప్పు. ఇత్తునాల లోపటికైనా, కొబ్బరికాయ లోపటికైనా సొచ్చి సూత్తవా? అవ్వి మొలుస్తయో లేదో, ఇది మురిగిందో లేదో తెల్వుటానికి. నీ అదృష్టం గావాలె. మన్ను ముడితె బంగారమైతది గని. నన్నేం జేయిమంటవు?" ఎవరికో చెట్ల మందులకు పాదరసాన్ని జాగ్రత్తగా జోకుతూ, విసురుగా సమాధానమిచ్చిండు ఈశ్వరయ్య సేటు. ఇంతల ఎవరో ఇద్దరు రూపాయి బిళ్ల కోసం గల్లలుగల్లలు పట్టుకొని ఒకరినొకరు నెట్టుకుంటూ వచ్చి ఈశ్వరయ్య దుకాన్ల పడ్డరు. వాళ్ల కాలో, చెయ్యో తాకి తరాజు కిందపడి, పాదరసం సీసా బోర్లవడ్డది. రసమంతా కింద ఒలికి పోయింది. ఈశ్వరయ్య సేటు నెత్తి పట్టుకున్నడు.

"ముండకొడుకులకు కొట్టుకును టానికి నా దుకాణం ముంగట్నే జాగ దొరికిందా? ఇయ్యాల ఈ రసమంతా సీసాలకు ఎత్తే సరికి అంగడి ఇచ్చుల్లారమైతది. ఇగ బ్యారం సాగినట్టే..." తిట్టుకుంటూ పాదరసం సీసాలకు ఎత్తుట్ల మునిగిపోయిండు.

అలాంటి సంభాషణ, ఇలాంటి సంఘటనలు జ్ఞాపకమొచ్చే సరికి నా పెదాల మీద నవ్వుల మొలకలు మొలిచాయి. అన్నిటినీ మించి బాలనాగమ్మ రంగు లంగా, జాకెట్టు, చిలకపచ్చ రంగు ఓణి వేసుకొని వయసొచ్చిన నిండు పున్నమిలాంటి లేలేత పరువాల భాగ్యలక్ష్మి. భాగ్యలక్ష్మి అంగట్లకు వచ్చిందంటే వెయ్యి కండ్లు ఆమె మీదనే. కైలు పోసే గిత్త చుట్టు బేరగాళ్లు తిరిగినట్టు నూనూగు మీసాలు, వడి తిరిగిన మీసాలన్నీ ఆమె చుట్టే తిరుగుతయి.

భాగ్యలక్ష్మి ఎర్ర కొమురని బిడ్డ. ఎర్ర కొమురడు నోరు లేని కొన్ని జీవాలకు యజమాని. నీళ్ల వసతి లేని అయిదెకరాల జమీనుకు ఆసామి. అందరి లాగే ఎవుసాన్ని నమ్ముకొని చేతనైనన్ని బాయిలు, బోర్లు వేయించి నెత్తి నిండా అప్పులు మూటగట్టుకొని బొక్క బోర్ల పడ్డ అమాయక బక్క రైతు. ఎవుసాన్ని నమ్ముకున్నోడెవడూ బాగుపడలేదని తొందరగానే తెలుసుకొని రెండు ఎకరాల భూమి అమ్మి నూరు గొర్ల మందను కొన్నడు.

అది శ్రీరాముని లగ్గం అయినంక చైత్ర మాసం వైశాఖ మాసం సందు. చుట్టు పదూర్లల్ల పడుసు పడుసు పోరగాండ్ల లగ్గాలు జోరందుకుంటున్నయి. గొర్లను అమ్ముటానికి ఇదే సందని ఎర్ర కొమురడు మందకు మందను అంగట్లకు తోలుకచ్చిండు.

"దీని కొమ్ములేమో బాగా వడి తిరిగినయి దీన్నెంతకిత్తవే కొమ్రన్నా?"

మందలకెల్లి బాగా బలిసిన పొటేలునొకదాన్ని గుంజుకచ్చి నవ్వుకుంట అడుగుతుండు ముందటి పండ్లకు బంగారు నీరు పోయించుకున్న బ్రహ్మయ్య.

"ఏ.. అది బాగా ముదిరిపోయింది. గదాన్ని ఏంజేసుకుంటవే బ్రహ్మన్న? లేతయి రొండు తీస్కో కూర మంచిగుంటది" నాలుగేళ్లకు నాలుగు బంగారు భటువులు పెట్టుకున్న కనకయ్య ముందటున్న రెండు లేత పిల్లల్ని నాలుగేళ్లతోని పొడుసుకుంట "గివీటిని ఎంతకిత్తడో అడుగు" అన్నడు.

"ఈ మందల గొర్ల కొనుడే వద్దు. అయితే పెద్దగున్నయి. లేదంటే చిన్నగున్నయి పిల్లలు" అన్నడు తల అడ్డంగా ఊపుతూ చెవులకు బంగారు పోగులు కుట్టిచ్చుకున్న కేశవులు.

వీళ్ల తరీఖ చూస్తే కొనేటట్టు లేరని అర్థమైందేమో కొమురయ్య ముగ్గురి ముచ్చట్లను వినీ విననట్టు చేసి ఇంకెవలో మందకాడికి వస్తే వాళ్లను మందలిచ్చుకుంట ఇంకో దిక్కు కదిలిపోయిండు. వాళ్ల ముగ్గురూ వేరే మందను ఎంకులాడుకుంట పోయింన్రు.

"ఏం రా! కొమ్రా, భూమి అమ్మి మంద కొన్నవట. చెప్పనే లేదేమిరా?" అడుక్కుంట దగ్గరికచ్చి నిలవడ్డడు వైకుంఠం సేటు. ఊళ్లె ఎవుసాన్ని నమ్ముకున్న రైతులందరికీ ఏ ఆపతి వచ్చినా వెంటనే యాదికచ్చే సేటు వైకుంఠం సేటు. ఎందుకంటే ఇత్తునాలు యిప్పిచ్చుడు, మందు బస్తాలిప్పిచ్చుడు, పంట పండి కల్లాలు లేసినంక గోనె సంచులిచ్చుడు దాకా అన్నీ ఆయినే సూసుకుంటడు. మొదటి నుంచి రైతును నమ్మి అన్ని సౌలతులు చేసినందుకు చివరికి రైతులు ధాన్యాన్ని వైకుంఠం సేటుకే అమ్మాలె. అదీ బజారు ధర కంటే నూరు తక్కువకు. ఇది ముందే మాట్లాడుకున్న కట్టు ఊరందరికెరుకే. ఈ కట్టుకు కట్టుబడేటోళ్లే వైకుంఠం సేటు దగ్గర అప్పు తీసుకుంటరు. అన్నీ లెక్క రాసి పెడుతడు. కల్లాలు లేసినంక, గింజ కాంటవెట్టినంక లెక్క ఎవలకు తేలితే వాళ్లకు పైసలు వస్తయి. ఇది మా ఊళ్లె రివాజు.

"ఆ.. సేటు అంత మూడు నాలుగు నెల్లయింది భూమి అమ్మి మంద పెట్టి. ఎప్పటికప్పుడు మీకు చెప్దామనే అనుకున్న కని ఏడ తీరుతుంది? పొద్దుగాల లేత్తె మందను కొట్టుకపోయి అడివిల పడుడేనాయె"

అన్నడు కొమురడు భుజమ్మీది తువ్వాల నెత్తి మీదేసుకుంట.

"అదేరా బాకీ కావాలన్నప్పుడు పొద్దంత వాకిట్ల కూసునుటానికి తీరుతది. ఇప్పుడు భూమి అమ్మి, పండ్లచ్చినంక, మంద పెట్టినంక ఎందుకు తీర్తది. నేనే తిర్వాటం చేసుకొని రావాలె" కోపంగా అన్నడు వైకుంఠం మందను ఆ మూల నుంచి ఈ మూలకు, ఈ మూల నుంచి ఆ మూలకు చూసుకుంట.

"అదేంది సేటు గట్లంటవ్ ఇప్పుడేమైంది?"

"ఏమవుడేందిరా! నువ్వు మందను కొనుక్కుంటేంది? బొంద తోడుకుంటె నాకేంది? నా పైసలు నాకు పారెయ్. నువ్వు బాయి కంటె బాయికి, బోరు కంటె బోరుకు, ఎడ్లకంటె ఎడ్లకు, ఇత్తునాలకంటె ఇత్తునాలకు దేనికంటె దానికి ఇచ్చినయి అన్ని కల్పి లక్ష ఇరవై వేయిల రూపాయలైనయి. ఈడికి మూడేండ్లాయె. మిత్తితోని డబలైనయి. అంటె రెండు లక్షల నలభై వేయిల రూపాయలైనయి. అసలు, మిత్తి కలిసి మొత్తమిప్పుడు కట్టు."

"అయ్యా! సేటు నీ బాంచెను కాల్మొక్కుత. గిప్పుడు ఏకాయేకిన అన్ని రూపాలు కట్టుమంటె యాడికెల్లి కట్టాలె. మందలకెల్లి వారానికిన్ని గొర్లమ్మి కట్టుత. కొద్దిగ తాత్పరం పట్టుండ్రి."

"ఏందిరా! తాత్పరం పట్టేది. మూడేండ్ల సంది పడ్డనే ఉన్న. నువ్వు ఉన్న భూమి అమ్మి గొర్లు కొనుక్కుంట, బర్లు కొనుక్కుంట పో. నేను మందెనుక నీ ముడ్డెనుక ముర్కసూసుకుంట వస్త. నీ కేమన్నా తల్కాయె ఉన్నాదిరా?" వైకుంఠం సేటు కోపంతో ఊగిపోవుకుంటనే "అరేయ్! ఈ మందనంతా తోల్కపోయి మన దొడ్లె పెట్టుండ్రి. వీడెవనికి చెప్పుకుంటడో చూస్త" అన్నడు. కొద్దిగ దూరం నిల్సున్న తన జీతగాళ్లను పిలిచి.

"నీ కాల్మొక్కుత బాంచెన్. అంత పని సెయ్యకుండ్రి. ఒక్క రెన్నెళ్లాగుండ్రి. యాన్నన్న కుదువ వడి మీ బాకీ తెంపుత."

"పైసలు కట్టి నీ మందను నువ్వు తోల్కపో. నేనొక్క గొర్రెను అమ్ముకుంటె పట్టుకో" అనుకుంట వైకుంఠం సేటు మందెంబడి, జీతగాళ్లెంబడి పోతున్నడు.

కొమురడు బతిలాడి బతిలాడి ఆన్నే కూలవడ్డడు.

★ ★ ★

చినుకు పడే కాలం. ఒకటి రెండు వానలు పడ్డయి. అందరు పనులల్ల పడ్డరు. దుక్కులు దున్నుడు మొదలు పెట్టిండ్రు. అంగడి బాగా సాగుత లేదు. అంగడంతా పల్స పల్సగున్నది. ఏ దుకాణం ముందటా గిరాకీ లేక మందే లేరు. అంతా నిదురవోయినట్టుంది. కొనేటోళ్ల కంటె అమ్మెటోళ్లే ఎక్కువున్నరు.

ఎర్ర కొమురడు రెండు కుందేళ్లను భుజానికేసుకొని వచ్చి అంగట్ల కూసున్నడు బిక్కు బిక్కుమనుకుంట.

"ఏమాయెనే బావా! కత్తి పోయి డాలు

**"లావు ఇచ్చత్రంగ మాట్లాడుతున్నవు సేటు. ఆమెనేమో ఇత్తునాలు మంట్లె పారవోసినంక మొలవకపోతే వాపస్ తేపో అంటివి. ఏం దెచ్చుడు? చినిగిపోయిన పొట్లాలనా? నన్నేమో కొబ్బరికాయను ఈన్నే కొట్టుమంటున్నవు. ఎందుకిట్ల నేర్సుకున్నవు సేటు. అమ్మేది మాటలనా? సామానా?" రేసుకొచ్చి కోపంగన్నది రాజవ్వ. "మరేంజెయ్యుమంటవు చెప్పు.**

వచ్చె ఢాం! ఢాం! ఢాం! అన్నట్టు మందకు మంద పోయి రొండు కుందేళ్లను పట్టుకొని కూసున్నవు?" అన్నడు బామ్మర్ది వరుసయ్యే అయిలయ్య దెప్పి పొడుస్తూ.

"ఏం జెయ్యిమంటవోయ్! వాని సేటు మొకంల మన్నువడ. పిడాత మంద మీదికి వచ్చి మందకు మంద కొట్టుకపాయె. ఊళ్లె ఎవనికి పోయి చెప్పుకున్నా వాని దిక్కే మాట్లాడవట్టిరి. పైసలు కట్టి నీ మందను నువ్వు తోల్కపో ఇంకేందని పైసలున్నోని దిక్కే నిలవడవట్టిరి. ఏంజెయ్యాలే. బతుకు బతుకత్తుందా? ఎవుసమంటె ఎవుసం అట్ల కాలిపాయె. గొర్లంటే గొర్లు ఇట్ల కూలిపాయె. ఇంట్ల గింత తిందామంటే నూకలు కూడా లేవు. ఉండీ ఉండీ నిన్ననే షికారికి పోయిన. రొండు కుందేళ్లు పడ్డయి. వాటిని పట్టుకొని గీడ కూసున్న. ఎవలన్న అడుగుతరేమోనని" అన్నడు కొమురయ్య. మొకమంతా దిగులుగా ఉంది.

"రాజ్యమంతా పైసున్నోందేనే బావా! పైస కడుపుల వైకుంఠం అంటే ఏందనుకున్నవు? వాడు రేపెప్పుడన్నా అక్కెరకత్తడని అందరూ వానిదిక్కే మాట్లాడుతరు. నీ దిక్కెవలు మాట్లాడుతరు? గుడ్డోని కన్ను మూత్తెంత? తెరుత్తెంత? అన్నట్టు నువ్వు బతుకుతేంది? సత్తేంది వాళ్లకు? నువ్వు మాత్రం ధైర్నం చెడకే బావా! అన్ని రోజులు వానియేనా మనకో రోజు రాదా? దేవుడెప్పుడూ వాన్నే సూత్తడా?" అని సముదాయించి పోయిండు అయిలయ్య.

* * *

తెల్లారితే దసరా పండుగ. అంగడంతా ఉశికేత్తే రాలకుంట కుత కుత ఉడుకుతుంది. జనం ఎక్కడ్నుంచో విరగబడుతుండ్రు. గొర్లు, మేకలు, కోళ్లు తెగ అమ్ముడు పోతున్నయి. కడక్ కడక్ నోట్లు చేతులు మారుతున్నయి. వచ్చేటోళ్లు వత్తుండ్రు. పోయేటోళ్లు పోతుండ్రు. ఏ దుకాణమైనా నిండుగా గిరాకీతోని కిటకిటలాడుతంది.

ఎర్ర కొమురడు శికారికి పోయి ఒక ఉడుము, మూడు నెమళ్లను పట్టుకొని వచ్చి సంతోషంగా కూసున్నడు అంగట్ల. పండుగ రేపే కాబట్టి అనుకున్న దానికంటే ధర ఎక్కువే వత్తదని లోపల లోపల సంబరపడుతున్నడు. వత్తె వత్తెనే ఉడుమును నాలుగు వందలకు అమ్మేసిండు. ఇగ మూడు నెమళ్లు మిగిలినయి.

"అరె! పండుక్కు నెమళ్లు కూడా వచ్చినయి అంగట్లకు" అనుకుంట ఎవలో తెల్ల బట్టల మనిషి ఆగి "ఎంతకోటిత్తున్నవయా?" అని అడిగిండు.

"ఏడు వందలకొక్కటి సారూ!" అన్నడు కొమురయ్య ఒక నెమలిని చేతుల పట్టుకొని చూపిస్తూ.

"అబ్బా! గంతరేటానయా? నాలుగు వందలిత్త ఇయ్యి"

"నాటు కోడే నాలుగు వందలున్నది సారు. నెమలికి గాయింత ధర పెట్టకుంటే ఎట్లా? బోని నీదే సారు ఆరు వందలియ్యండ్రి.

"నువ్వన్న ఆరు కాదు, నేనన్న నాలుగు కాదు. లాస్ట్ అయిదు వందలిత్త" అనుకుంట జేబులకెల్లి అయిదు వంద నోట్లు తీసిచ్చి నెమలిని చేతిల పట్టుకొని నాలుగడుగులు ముందుకు వేసిండో లేదో ముంగట పోలీసు జీబు వచ్చి ఆగింది.



**"ఏమవుడేందిరా! నువ్వు మందను కొనుక్కుంటేంది? బొంద తోడుకుంటె నాకేంది? నా పైసలు నాకు పారెయ్. నువ్వు బాయి కంటె బాయికి, బోరు కంటే బోరుకు, ఎడ్లకంటె ఎడ్లకు, ఇత్తునాలకంటె ఇత్తునాలకు దేనికంటె దానికి ఇచ్చినయి అన్ని కలిసి లక్ష ఇరవై వేయిల రూపాయలైనయి. ఈడికి మూడేండ్లాయె. మిత్తితోని డబలైనయి. అంటె రెండు లక్షల నలబై వేయిల రూపాయలైనయి. అసలు, మిత్తి కలిసి మొత్తమిప్పుడు కట్టు."**

"అరేయ్! ఈ నెమళ్లెవనియిరా?" అన్నడు పోలీసాయినె జేబులకెల్లి దిగుకుంటనే.

"నాయే సారు" అనుకుంట లేచి నిలవడ్డడు ఎఱ్ఱ కొమురడు.

"నెమళ్లమ్ముతున్నవురా? ఎక్కు జేబెక్కు నువ్వు మొదలు" పోలీసాయినె కండ్లల్ల మిరుగులు దుంకుతున్నయి.

"అయ్యో! అమ్ముటానికి కాదు సారూ! సాదుకపుయి" అన్నడు వణుక్కుంటనే.

"సాదుకపుయి అయితే అంగట్లెందుకు కూసున్నవురా వీటిని పట్టుకొని?" పోలీసాయినె గొంతు మరింత కఠినంగా అడిగింది.

"బాయికాన్నుంచి ఇంటికి పోతున్న సారు. అంగట్ల మా బామ్మర్ది కలిత్తే గీడాగిన గంతే మీరచ్చిండ్రు" నీళ్ల నములుతున్నడు కొమురడు.

"ఇగో! ధరెక్కువైందట మావోళ్లు కోప్పడుతుండ్రు. నీ నెమలి నువ్వు తీసుకొని నా పైసలు నాకిచ్చెయవయా" అనుకుంట వచ్చిండు ఇందాకటి తెల్ల బట్టల మనిషి. పోలీసాయినె కోపం నషాలానికెక్కింది.

"నాకే టోకరా ఇస్తావురా! లమ్డికే" అనుకుంట ఈపుల ఒక్క గుద్దు గుద్ది ఒక్కపెట్టున ఎఱ్ఱ కొమ్రన్ని, నెమళ్లను లావట్టి జీబులెత్తేసిండు.

కొమురయ్య గుడ్లల్ల నీళ్లు తిరిగినయి. 'పోక పోక దొంగతనానికి పోతే వాన కురిసినట్టు' పడక పడక మూడు నెమళ్లు పడ్డయనకుంటే పోలీసోళ్ల చేతికి చిక్కితి. నాదేం గాచారం' అనుకుంట కుమిలి పోతుండు. జీబు దుమ్ము రేపుకుంట పోలీస్ స్టేషన్కు పోతుంది...

★ ★ ★

సంక్రాంతి పండుగ ముందటి ఆదివారం. అంగడి ఎప్పటి లెక్కనే మెల్లమెల్లగా జోరందుకుంటంది. నూనెకు, నువ్వులకు, ఓమకు, శనగపప్పుకు, పల్లీలకు జనం విరగబడుతుండ్రు. సకినాల బియ్యంకాడ గుంపులు గుంపులు నిలవడ్డరు.

వేప చెట్టు నీడకు బట్టల దుకాణం పక్కపొన్న నిండు చేతుల సిల్కు అంగి, దోవతి కట్టుకొని, చేతి వేళ్లకు అటు నాలుగు, ఇటు నాలుగు ఉంగరాలు పెట్టుకొని, కట్టకు కట్ట మీసాలు వడి తింపి, జుట్టు వెనుకకు ముడేసి, ముందట అద్దాల పెట్టె పెట్టుకొని దర్జాగా కూసున్న ఎఱ్ఱ కొమురన్ని చూసి వైకుంఠం సేటు కాలు ఒక్కసారే టక్కున ఆగింది.

"ఏం రా! కొమ్రా అప్పట్ల కుందేళ్లంటివి, మొన్న నెమళ్లంటివి, నిన్న ఆవులంటివి అన్నిడిసి పెట్టి మళ్ల గిదెప్పుడు నేర్సుకున్నవురా? ఊళ్లెకెల్లి ఎల్లి పోయిండంటే ఏ ఊరు పోయిండో బతుకుటానికి అనుకున్న. కొత్తేషం గట్టి మళ్ల మనూళ్లెకే వచ్చినవన్న మాట" అనుకుంట కూసున్నడు వైకుంఠం సేటు అద్దాల పెట్టెను ఎగాదిగా చూస్తూ. పెట్టెల రకరకాల రంగు రాళ్లున్నయి. కొన్ని వెండి ఉంగరాలకు పొదిగిచ్చి ఉన్నయి. కొన్ని విడి రాళ్లున్నయి. అప్పుడప్పుడు సూర్యుని కిరణాలు పడి తళుక్కున మెరుస్తున్నయి.

"సంగారెడ్డిల మా బావ ఇదే పని చేస్తడు సేటు. ఆయినె దగ్గర్నే కొన్ని రాళ్లు తీసుకచ్చి రోజొక్క అంగడి తిరుక్కుంట అమ్ముతున్న. ఏదో బతుకుదెరువు" అన్నడు ఎఱ్ఱ కొమురడు అద్దాల పెట్టె తెరిచి చూపిస్తూ. "ఎవలకు ఏ రాయి మంచిదో నీకెట్లెర్కరా?"

"బాపనాయినెకు చూపిచ్చుకుంటే జాతకం ప్రకారం ఎవలకు ఏ రాయి శ్రేష్టమో ఆయినే చెప్తడు. దాన్ని బట్టి నా దగ్గర కొనుక్కుంటరు. ముత్యం, పొడం... అన్ని రకాల రాళ్లుంటయి. అదికాకపోతే ఏ రాయి పెట్టుకున్నా అంతో ఇంతో ఐశ్వర్యవంతులయితరు. కాకపోతే బాపనాయినెకు చూయించి పెట్టుకుంటే మంచిది."

"భాష కూడా జెర జెర మారుతుందేం రో! మొత్తం మీద చిన్న చిన్నగా ఒక రేవున పడుతున్నవన్న మాట. అయితెవాయెగని అసలు కింద మందను అప్పజెప్తివి. మరి మిత్తి ఎవలు కడుతర్రా? నీ పెండ్లాం సుట్టమా?" మెల్లగా అసలు విషయం అడిగిండు వైకుంఠం.

"..................................." కొమురడు సప్పుడు జెయ్యలే.

"మీ కుల సంఘంలనే పెద్దా పంచాయితీ. వాళ్ళు ఎట్ల జెప్తే గట్లనే యిందాం" మళ్ల వైకుంఠం సేటే అన్నడు.

"ఇప్పటికైతే ఈ ఉంగురం పెట్టుకోండ్రి సేటు. నా దగ్గరున్న దాంట్ల ఖరీదైంది. మీకు కల్సి వత్తది" అని అనుకుంట ఉంగరాన్ని తుడిచి సేటు వేలికి తొడిగిండు.

"అరేయ్ కొమ్రా! ఉంగరంతోని ఒడ్సి పోయిందనుకున్నేవు. నేనేం ఇడ్సి పెట్ట. మిత్తికి మిత్తికి వసూలు జేత్త" అని గట్టిగనే అనుకుంట, ఉంగరాన్ని పెట్టుకున్న చేతిని అటు ఇటూ తిప్పుకుంట అక్కడ్నుంచి కదిలిండు వైకుంఠం సేటు.

★ ★ ★

ఎఱ్ఱ కొమురని కోసం అంగడంతా జల్లెడవడుతుండు వైకుంఠం సేటు. కొమురడు ఎక్కడా కనిపిస్తలేడు. వైకుంఠం సేటుకు కోపం మరింత ఎక్కువైతంది. వేటగాని బాణం తాకిన సింహంలాగా అటూ ఇటూ మసులుతుండు. కడుపంతా రగిలిపోతంది. ఎఱ్ఱ కొమురడు దొర్కితే ఒక్క ఉదుటున గావు పట్టి చంపేసేటట్టు తిరుగుతున్నడు వాని కోసం. చివరకు అంగడి ఆఖరున ఎఱ్ఱ రంగు చెత్తిరి పెట్టుకొని కూసున్న కొమ్రడు కనిపియ్యనే కనిపిచ్చిండు. చుట్టూ ఇద్దరు ముగ్గురు రాళ్లు చూస్తూ కూసున్నరు. ఏవో అనుమానాలు అడుగుతున్నరు. కొమురడు ఏదో చెప్తున్నడు.

వైకుంఠం సేటు ఉరికిపొయ్యి ఎఱ్ఱ కొమురని గొంతు పట్టుకొని పైకి లేపిండు.

"లమ్డి కొడుక ఎసొంటి ఉంగుర మిచ్చినవురా? ఉంగురం పెట్టుకొని గిట్ల ఇంట్లకు అడుగు పెట్టిన్నో లేదో నా చెట్టంత కొడుకు రాజీవ్ రహదారి మీద యాక్సిడెంటయి సచ్చిపోయిండు. అంత నీ ఉంగరంతోనే శని సుట్టుకున్నది. నిన్ను కూడా బతుకనియ్యరా" అంటూ పండ్లు కొరుక్కుంట కొమ్రని గొంతును మరింత

కథ

గట్టిగా రెండు చేతులతోని పిసుకుతుండు. కొమ్రుడు గొంతు నొప్పితోని గిలగిలా తన్నుకుంట ఏదో మాట్లాడుటానికి అవస్థ పడుతుండు. చేతులతోని ఏవో సైగలు చేస్తుండు. సుట్టూ ఎంతో మంది గుమి గూడింద్రుగని ఎవ్వలు యిడిపిస్త లేరు. అప్పటికే మొగులు నిండా నల్లని మబ్బులు కమ్ముకొని చినుకులు మొదలైనయి. ఒక్కొక్కరే మెల్లగా జారుకున్నరు. వైకుంఠం సేటు కొమ్రుని అంతు చూసేదాక ఇడ్సిపెట్టలే. పెనుగులాటల అద్దాల పెట్టె ఎక్కన్నో ఎగిరి పడ్డది కొమ్రుని లెక్కనే. రాళ్లు చిందరవందరయినై. కొమురని పీనుగు వానల నానుకుంట అక్కన్నే ఉన్నది.

★ ★ ★

తెల్లారే సరికి ఎర్ర కొమురని పీనుగు పక్కకు వైకుంఠం సేటు పీనుగు కూడా పడి ఉంది. రాత్రి ఎవలో పద్దెనిమిది, ఇరవై ఏండ్ల అమ్మాయి వైకుంఠం సేటు మెడకు తాడు వేసుకొని గుంజుకచ్చి అక్కడ పడేసిందని చెప్పుకుంటుంటారు ఇప్పటికీ. భాగ్యలక్ష్మి ఈ పని చేసిందని గుసగుసలు చెప్పుకునే వాళ్లు కూడా ఉన్నారు.

★ ★ ★

ఈ రోజు ఆదివారం ఆఫీసుకు సెలవు. ఇరవై ఏండ్ల నుంచి నౌకరి జేసుకుంట హైదరాబాద్‌లనే ఉంటున్న నేను, మా ఊళ్లో నా సోపతిగాని తమ్ముని పెండ్లంటే పొద్దున్నే బయిలెల్లి ఎంజిబియస్‌లో మా ఊరి బస్సెక్కి కూసున్న. ఆదివారం అనంగానే మా ఊరి అంగడి యాదికొచ్చి గతమంతా సినిమా రీళ్లలా తిరిగింది. ఆఖరి రీలు అయిపోయే సరికి బస్సు మా ఊరి పొలిమేరల్లో ఉంది. టైం చూసుకున్న. పగటీలి పన్నెండయింది. మళ్లా ఇయ్యాల అంగడి చూడొచ్చుననే ఉబలాటం నా మనసు నిండా నిండిపోయింది. అంగట్ల గొంగడి కొనుక్కు రమ్మంది అమ్మ. కొనుక్కు పోవచ్చుననుకుంట బస్సు దిగి కింద అడుగు పెట్టిన. అప్సోసైపోవడం నా వంతయింది. ఊరంతా చాలా మారిపోయింది. అంతకు ముందు చెట్ల కిందనే బస్సులు వచ్చి ఆగేవి. వాటి జాగల ఇప్పుడు బస్టాండ్ కట్టింద్రు. బస్టాండ్‌కు కొద్ది దూరంలనే అంగడి ఉండేది. ఇప్పుడు దాని ఆనవాళ్లే లేవు. మున్సిపాలిటీ వాళ్లు 'వ్యాపార భవన సముదాయం' కట్టి కిరాయికిచ్చినట్టున్నరు. అన్ని దుకాన్లల్ల అంగడి సాగుతంది. నోట్లు చేతులు మారుతున్నయి. వస్తువులు చేతులు మారుతున్నయి. కానీ ఎక్కడా ముందటి అంగడికున్న అందం, సహజత్వం, ఆత్మగల్ల బేరం ఎక్కడా కనిపించలేదు. ఎర్ర కొమురడు, భాగ్యలక్ష్మి, ఈశ్వరయ్య సేటు, వైకుంఠం సేటు, కుందేళ్లు, నెమళ్ళు, అంగట్ల అమ్మే అరొక్క వస్తువులు, ఆ బేరగాళ్లు అందరూ నన్ను చుట్టు ముట్టింద్రు. అంగట్ల కాటగలిసిన పోరని లెక్క పెండ్లి మంటపాన్ని వెతుక్కుంట ఊళ్లోకి అడుగులు వేస్తున్న...

కవిత

# కాలం మాట్లాడితే...!?



కాలం మాట్లాడదు
మాట్లాడితే హెచ్చరికల పిడుగుల
ప్రాణ రస ప్రవాహమే
హుంకార గంభీరతను
హెచ్చరికల ఉత్ప్రేరకాలను
సమన్వయం చేసుకోలేకపోతే
గండ శిలలు తలలు పగులగొడ్తయి
కాలం మాట్లాడితే
దౌర్జన్య దోపిడి ఉరితాళ్ల
జాడలు దొరుకుతయి
ఎరుపురంగు సందర్భం శాసిస్తది
కాలం మౌనంగా ఉంటే
నీ పిరికితనంపై వ్యంగ్య
బాణ ప్రయోగమే
కాలం మాట్లాడలేదంటే
ప్రశ్నించే శబ్దాన్ని పరిచయం
చేసుకోలేదన్నమాటే
ప్రశ్నించకుండా పరిష్కారం కాదు-రాదు
వీడ్కోలు లేని కాలానికి వీడ్కోలు చెప్పినట్లే
కాలం మాట్లాడదు
కాలంతో మాట్లాడాలంటే
కాలభాష తెలుసుకోవాల్సిందే
కాలం మాట్లాడకున్నా
మాట కాంతి తరంగాలను పారిస్తది
కాలం అంతరంగం తెలుసుకుంటే
ప్రజల కన్నీటిని చూసి అహల్యవైపోవు
లావావై ఊడ్చి పారేస్తవు
కాలం మాట్లాడే గుట్టు తెలుసుకుంటే
ఉద్వేగాలూ - ఉక్రోష ఆవేశాలూ
ఉక్కు పిడికిళ్ళయితయి
ఆశయాలు కాంతి ఉదయాలైతయి
కన్నీరు సముద్రహెూ రై
ఎత్తుపల్లాలను సమం చేస్తది
ఆశయం కొత్త సూర్యుడై పుట్టి ప్రకాశిస్తది

వల్లభాపురం జనార్దన

# కథల పోటీకి ఆహ్వానం



**అక్టోబర్ 16, 2020లో ప్రారంభించిన తంగేడు సాహిత్య పక్షపత్రిక మీ అందరి అభిమానంతో ముందుకు సాగుతున్నది. సాహిత్యంలో ఉత్తమ విలువలు నిర్మించడంతో పాటు యువ సాహితీవేత్తలను ప్రోత్సహించడం అనే లక్ష్యాన్ని గురుతరంగా పాటిస్తున్నది. ఇలాంటి ఉత్తమ సాహిత్య నిర్మాణంలో భాగంగా ప్లవ నామ సంవత్సర ఉగాది కథల పోటీ నిర్వహించాలని సంకల్పించింది. రాష్ట్ర రాష్ట్రేతర దేశ, విదేశీ తెలుగు కథా రచయితలంతా ఈ పోటీలో పాల్గొనవచ్చు. మా కథాయజ్ఞంలో భాగస్వాములు కావచ్చు.**

**నిబంధనలు :**

1) కథలు తెలంగాణ సంస్కృతి, సమకాలీన జీవన ప్రతిఫలనం, నేపథ్యంగా ఉండాలి. సృజనాత్మకత సమాంతర వైవిధ్యం, తెలంగాణ నుడికారం కలిగిన కథలకు ప్రాధాన్యం ఉంటుంది.
2) ఇంతకు ముందు ఎక్కడా ప్రింటు పత్రికలలోగానీ, వెబ్ పత్రికలలో గానీ, సోషల్ మీడియాలో గానీ, ప్రచురితం కాని కథలను మాత్రమే పోటీకి పంపించాలి.
3) ఈ వరకు ఎక్కడైనా పరిశీలనలో ఉన్న రచనలు పోటీకి అనర్హం.
4) ప్రచురణకు అంగీకరించని రాత ప్రతులు తిరిగి పంపడం సాధ్యం కాదు.
5) రచనకు ఏ కలం పేరు ఉపయోగించినా, హామీ పత్రంలో మాత్రం తప్పక పూర్తి పేరు, చిరునామా, ఫోన్ నెంబర్ రాయాలి. కేవలం జతచేసిన హామీ పత్రంలో తప్ప, కథా రచన క్రింద పేరు రాయకూడదు. హామీ పత్రం వేరే పేపరుపై రాసి జత చేయాలి.
6) బహుమతికి ఎంపిక కాని మంచి కథలను సాధారణ ప్రచురణకు స్వీకరిస్తాం. సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథలకు రూ. 1000.00 (వేయి రూపాయలు) పారితోషికం ఉంటుంది.
7) రాత ప్రతి అయితే కథ 8 నుండి పది పేజీలు మించకుండా ఉండాలి. 1300 పదాలు ఉండేటట్టు చూసుకోవాలి.
8) ఈ మెయిల్‌లో పంపేవారు యూనిక్ కోడ్ వర్డ్ ఫైల్ ద్వారా పంపవచ్చు. దానికి పి.డి.ఎఫ్. కూడా అటాచ్ చేయాలి.
9) పేజీ మేకర్‌లో డి.టి.పి. చేసి కథలు పంపేవారు పి.ఎం.డి. ఫైలును, పి.డి.ఎఫ్.ను కూడా జత చేసి మెయిల్ చేయాలి.
10) ఏ మతాన్ని గాని, కులాన్ని గాని, వర్గాలను గాని వ్యక్తులను గాని, కించపరచే అంశాలేవీ రచనలో ప్రతిఫలించకూడదు.
11) కవరుపై **ఉగాది కథల పోటీ**కి అని స్పష్టంగా రాయాలి.
12) ప్రచురణకు ఎంపికైన రచనలు ఎడిట్ చేసుకునే హక్కు సంపాదకులకు ఉంటుంది.
13) బహుమతులకు రచనలు ఎంపిక చేసేది మేం నియమించుకున్న న్యాయనిర్ణేతలే. ఎవరూ ఎలాంటి సంప్రదింపులు జరుపకూడదు.
14) కథలు మార్చి 10,2021 వరకు మాకు చేరాలి. గడువు దాటాక వచ్చే కథలు పరిశీలించడం సాధ్యం కాదు.

కథలు పంపించవలసిన చిరునామా :

**తెలంగాణ జాగృతి**
పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4,
3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర,
అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029.
తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

**బహుమతుల వివరాలు...**

1) ప్రథమ బహుమతి : రూ. 20,000
2) ద్వితీయ బహుమతి : రూ. 10,000
3) తృతీయ బహుమతి : రూ. 5000
4) ప్రచురణకు ఎంపిక చేసిన రచనలకు పదునైదింటికి ఒక్కొక్కటికీ రూ. 1000

*- కల్వకుంట్ల కవిత, ఎడిటర్, తంగేడు.*

వ్యాసం

# అతివలను అందలమెక్కించిన గద్వాల సంస్థానం

గద్వాల సంస్థానం ఘనతను చాటే వ్యాసం....



సంగిశెట్టి శ్రీనివాస్

'విద్యద్గద్వాల'గా విఖ్యాతి గాంచిన ఈ సంస్థాన చరిత్ర కాకతీయుల కాలం నుంచీ తెలియవస్తున్నది. గద్వాల సంస్థాన మూలపురుషుడు ఐజకు చెందిన బుద్దారెడ్డి. గ్రామ నామాన్ని బట్టే వీరిని 'ఐజ గౌడ'లు అనే పిలిచింద్రు.

కృష్ణా-తుంగభద్రానది మధ్యప్రాంతంలోని పూడూరు నాడగౌడరీకం చేస్తున్నటువంటి వీరారెడ్డికి బక్కమ్మ అనే కూతురున్నది. ఆయనకు కొడుకులు లేరు. అయితే ఈయన కర్నూలు జిల్లా కొంతలపాడు గ్రామ మునసబు అని, కట్టా వేంకటేశ్వర శర్మ తన పరిశోధన గ్రంథం 'గద్వాల సంస్థానం సాహిత్య పోషణం' గ్రంథంలో పేర్కొన్నారు. ముష్టిపల్లి పెద్దన గద్వాల సంస్థాన మూలపురుషుడని కాణదము పెద్దన రాసిన 'ముకుంద విలాసము' వల్ల తెలుస్తున్నది.

పురుష సంతానం లేక పోవడంతో వీరారెడ్డి అప్పటికే ఐజ, దరూరు, కందనవోలు, అదవని (అదోని), నంద్యాల సీమలపై ముష్టిపల్లి వంశస్థులైన రెడ్లు నాడగౌడులుగా ఉన్నరు. అయితే ఈ కుటుంబీకులు తమలో తాము కలహించుకోవడంతో పెద్దారెడ్డి అనే అతను ఐజ, దరూరు, కందనవోలు సీమలకు నాడగౌడరీకం చేజిక్కించుకుండు. ఈయన బీజాపూర్ సుల్తాన్‌కు సామంతుడుగ ఉన్నడు. జ్ఞాతులచే తగవులాడి కుటుంబం నుంచి బయటికి వచ్చిన పెద్దారెడ్డికి పూడూరు నాడగౌడగు వీరారెడ్డి తన కూతురు బక్కమ్మనిచ్చి పెండ్లి చేసిండు. దీంతో మిగతా ప్రాంతాల నాడగౌడరీకంతో పాటు పూడూరుపై కూడా పెద్దారెడ్డికి అధికారం జిక్కింది. వీరికి సోమన్న, సిరిగరెడ్డి అనే ఇద్దరు కొడుకులు పుట్టింద్రు. పిల్లలిద్దరు చిన్నగున్నప్పుడే అంటే 1628లో పెద్దారెడ్డి మరణించిండు. దీంతో బక్కమ్మ నాడగౌడరీకము చేపట్టి ప్రజలను కన్నబిడ్డలవలె కనిపెట్టుకుంది. ఆమెకు దైవభీతి, పాపభీతి ఎక్కువగా ఉండిందని మారేమండ సీతమ్మ ఒక వ్యాసంలో రాసింది. ఈమె 34 ఏండ్లు అంటే 1628 నుండి 1663 వరకు పాలన జేసి అధికారాన్ని పెద్దకుమారుడు పెదసోమభూపాలునికి అప్పగించింది. ఈయన బాహుబలము, రాజనీతిజ్ఞత వలన పాలనలో రాణించిండు. బీజాపూర్ సుల్తాన్‌పై జరిగిన దాడిలో ఔరంగజేబుకు మద్దతుగా నిలిచి ఆయన అభిమానాన్ని చూరగొన్నాడు. అంతే గాకుండా ఔరంగజేబు నుంచి కర్నూలు, బళ్ళారి ప్రాంతాలలోని అనేక ప్రాంతాలపై నాడగౌడరీకము సంపాయించిండు.

పెద్దన (పెద్దారెడ్డి), బక్కమాంబికల కుమారుడైన పెద శోభనాద్రి ఈ సంస్థానాన్ని పాలించిండు. ఈయన 1712లో చనిపోయిండని సీతమ్మ రాసింది. 1735 వరకు జీవించినట్లు కట్టా వేంకటేశ్వర శర్మ రాసిండు. బహుశా రెండోదే నిజం కావొచ్చు. పెదశోభనాద్రి అసలు పేరు 'పెద సోమభూపాలుడు'. ఈయన తన తల్లి బక్కమ్మ పేరిట అయిజలో ఒక బాయిని ప్రజోపయోగం కోసం తవ్వించిండు. ఈయన 1688-97 మధ్యకాలములో శత్రువులపై దాడి చేస్తూ అయిజ తదితర ప్రాంతాలను కైవసం చేసుకున్నడు. 1663-1712 మధ్యకాలంలో గద్వాల కోటను నిర్మించిండు. ఈయన 1735లో చనిపోవడంతో పెదభార్య రాణీ అమ్మకమ్మ పరిపాలన బాధ్యతలను స్వీకరించింది. అంతకుముందు సంస్థాన పాలన 12 ఏండ్ల పాటు ఉద్యోగులు నిర్వహించారు. అమ్మకమ్మ రెవిన్యూ బాధ్యతలను చూస్తున్న కట్టా వెంకన్నకు, అతని తర్వాత బ్రాహ్మణుడైన రమణయ్యకు పాలనను అప్పగించారు. వీరి పాలన వరుసగా 1735-1740, 1741-46 మధ్యకాలములో సాగింది. పెద శోభనాద్రి కుమార్తె గిరియమ్మ (బోరవెల్లి)లో ప్రోత్సాహముతో లయగ్రాహి గరుడాచల కవి 'కౌసలేయ చరిత్రము' అనే గ్రంథాన్ని రాసిండు. గిరియమ్మ చేసిన దాన, ధర్మాల వివరాలు

ఈ కొసలేరు చరిత్రలో వివరంగా రికార్డయ్యాయి. అయితే ఈ దశలో ఉద్యోగుల పాలనతో సంతృప్తి చెందని అమ్మకమ్మ బాధ్యతలు తానే స్వీకరించింది.

అంటే అమ్మకమ్మ 1746-47 మధ్యకాలంలో ఆమె పాలన చేసింది. అనంతరం పెదశోభనాద్రి రెండో భార్య లింగమ్మ 1747-1760 వరకు రాజ్యపాలన చేసింది. ఈమె పాలనా కాలంలోనే బీచుపల్లి వద్ద 'నిజాంకొండ' కోట నిర్మాణం ప్రారంభమయింది. కరువు బారిన పడిన ప్రజల కోసం ధాన్యాన్ని పంచింది. అందరికి వసతి సదుపాయాలు సమకూర్చింది. అలాగే ప్రజాహితార్థం వంగాల, తాండ్రపాటి చెరువులను తవ్వించింది. తన పేరిట గద్వాలలో 'లింగమ్మ బాయి'ని తవ్వించింది. ఈమె తన కుమార్తె 'గిరియమ్మ'ను బోరవెల్లి చిన సోమభూపాలునకిచ్చి వివాహం జరిపించింది. అనంతరం లింగమ్మ దత్తపుత్రుడు రాజా తిరుమలరావు అధికారంలోకి వచ్చి నాలుగేండ్లు పాలన జేసిండు. ఈయనకు ఇద్దరు భార్యలు. తిరుమలరావు 1760-64 మధ్యకాలములో పాలన జేసిన కాలములోతల్లి కాలములో ప్రారంభమై అసంపూర్తిగా నిర్మితమైన నిజాం కొండ కట్టడాన్ని పూర్తి చేసిండు.

1764లో ఈయన మొదటి భార్య రాణీ మంగమ్మ కొన్ని నెలలు పాలన చేసింది. అనంతరం రెండో భార్య రాణీ చొక్కమ్మ 1764-68 మధ్యకాలములో పాలన చేసింది. ఈమె గద్వాలలో 'లింగమ్మ బాయి'ని తవ్వించింది. కృష్ణానది ఒడ్డున గల బీచుపల్లిలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేసింది. ఈమె తన ఇరువురు పుత్రుల పెంపకం, గద్వాల సంస్థాన పాలక బాధ్యతలను సమీప బంధువు బోరవెల్లి సంస్థానాధీశుడైన రామరాయలుకు అప్పగించింది. 1768-1783 మధ్యకాలములో రాజా రామరాయలు పాలన చేసిండు. రాణీ చొక్కమ్మ ఇద్దరు కుమారులకు విద్యాబుద్ధులు చెప్పించి తన సొంత నాడగౌడరీకంలో ఉన్న బోరవెల్లిని కూడా గద్వాలలో కలిపింది. ఈతడు అవుకు తాలూకా బేతెండ్ల గ్రామములో చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠింపజేసిండు. కర్నూలు నవాబుతో యుద్ధం చేసి గెలిచిండు.

అనంతరం పెదసోమ భూపాలుని మనుమడగు చిన సోమభూపాలుడు గద్వాల రాజ్యమును పాలించిండు. 1784-1815 మధ్యకాలములో ఈయన పాలన సాగింది. ఈతను మరణించే నాటికి అతని పుత్రుడు రెండవ రామరాయడు బాలుడగుటచే చిన సోమభూపాలుని భార్య రాణీ రామక్కమ్మ పాలన చేసింది. ఒక ఏడాది పాలన తర్వాత కుమారునికి పట్టం కట్టింది. రాజా రామభూపాల్ బహద్దూరను పేర విఖ్యాతుడైన ఈయన చాకచక్యముతో వివిధ రాజులతో యుద్ధాలు చేసిండు.

**జ్ఞాతులచే తగవులాడి కుటుంబం నుంచి బయటికి వచ్చిన పెద్దారెడ్డికి పూడూరు నాడగౌడగు వీరారెడ్డి తన కూతురు బక్కమ్మనిచ్చి పెండ్లి చేసిండు. దీంతో మిగతా ప్రాంతాల నాడగౌడరీకంతో పాటు పూడూరుపై కూడా పెద్దారెడ్డికి అధికారం జిక్కింది. వీరికి సోమన్న, సిరిగరెడ్డి అనే ఇద్దరు కొడుకులు పుట్టిండ్రు. పిల్లలిద్దరు చిన్నగున్నప్పుడే అంటే 1628లో పెద్దారెడ్డి మరణించిండు. దీంతో బక్కమ్మ నాడగౌడరీకము చేపట్టి ప్రజలను కన్నబిడ్డలవలె కనిపెట్టుకుంది. ఆమెకు దైవభీతి, పాపబీతి ఎక్కువగా ఉండిందని మారేమండ సీతమ్మ ఒక వ్యాసంలో రాసింది.**



వ్యాసం



మహారాష్ట్రులపై కూడా దాడులు చేసిండు. ఈయన పాలన 1816-1828 మధ్యకాలములో సాగింది. ఆయన మరణానంతరం గద్వాల రాజవంశములో కల్లోలాలు జరిగాయి. రామరాయనికి శేషమ్మ, లక్ష్మమ్మ అను ఇద్దరు భార్యలున్నారు. రాజు మరణించే నాటికి చిన్న రాణియగు లక్ష్మమ్మ గర్భవతి. రాజు మరణశయ్యపై నుండి తల్లియగు రామక్కమ్మను పిలిచి "నా చిన్న భార్య పుత్రికను గనినచో నామెను నీ మేనల్లుడగు సీతారామునికి బెండ్లి చేసి యతనికి రాజ్యము నప్పగింపుము. అంత వరకును సంస్థానమును రక్షించుచుండుము" అని చెప్పెను. ఈ సమయములో రాజబంధువుల సహాయముతో కార్యక్రమాలను ఆమె చక్కబెట్టింది. ఇదే సమయంలో సినీఫక్కీలో పెద్ద భార్య శేషమ్మ అసూయతో సవతికి విషమివ్వజూడడం, అది విఫలం కావడం కూడా చరిత్రలో రికార్డయింది. ఆ తర్వాత రామక్కమ్మ తన చిన్నకోడలుకు పుట్టిన అమ్మాయిని సీతారామారెడ్డికిచ్చి పెండ్లి చేసింది. ఆ తర్వాత అతను రాజా సీతారామ భూపాల్ బహద్దరను పేరిట సింహాసనమెక్కిండు. అనంతరం పెద్ద సీతారామ భూపాలుడు 1828-61 మధ్యకాలంలో పాలన జేసిండు. ఈయనకు ముగ్గురు భార్యలు. అనంతమ్మ, లింగమ్మ, వెంకట లక్ష్మమ్మ. ఇందులో రాణీ లింగమ్మ తన ఏకైక కుమార్తె లింగమ్మను చోళాపురం వాస్తవ్యుడైన నల్లారెడ్డికిచ్చి వివాహం చేసిండు. అతన్ని ఇల్లరికపుటల్లుడుగా తెచ్చుకున్నడు. తన అనంతరం అల్లుడి పేరును రాజా సీతారామ భూపాలుడిగా మార్చి అతనికి అధికారాన్ని అప్పగింపజేసిండు. ఈయన సంతాన రహితుడిగానే గతించాడు. అనంతరం లింగమ్మ పాలనా బాధ్యతలను స్వీకరించింది. 1861-63 మధ్యకాలములో పాలన జేసింది. ఇదే సమయంలో రాణి లింగమ్మ వడ్డేపల్లికి చెందిన యల్లారెడ్డి కుమారుడు రాయన్నను దత్తత తీసుకొని అతనికి రాజ సోమభూపాలుడు అని నామకరణం చేసింది. ఈయన తల్లి మరణానంతరం మూడు సంవత్సరాలు అంటే 1863-66 వరకు పాలన చేసి చనిపోయిండు.

రాజ సోమభూపాలుడు మరణానంతరం వెంకట లక్ష్మమ్మ పాలన బాధ్యతలను స్వీకరించింది. తన హయాములో గద్వాల కోటలోని కేశవాలయానికి గోపురము, మహాద్వారాన్ని నిర్మింపజేసింది. తనకు సంతానం లేకపోవడంతో వెంకటాపురానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు రామన్నను దత్తత తీసుకుంది. అతనికి రాజా రామభూపాలుడు అని నామకరణం చేసింది. వెంకట లక్ష్మమ్మ 1867-87 అధికారాన్ని చలాయించింది. అనంతరం దత్త పుత్రుడు రాజ రామభూపాలుడు పాలనా బాధ్యతలను స్వీకరించిండు. ఈతను 1887-1923 వరకు అధికారం చలాయించినాడు. 1843లో జన్మించిన ఈతన్ని మూడో ఏటనే వెంకట లక్ష్మమ్మ దత్తత స్వీకరించింది. అయితే ఈతనికి కూడా సంతానం లేకపోవడంతో తన అన్న కొడుకు వెంకటాపురానికి చెందిన భీమిరెడ్డి తనయుడు వెంకటరెడ్డిని దత్తత స్వీకరించి అతనికి చిన సీతారామభూపాలరావు అని పేరు పెట్టిండ్రు.

భర్త రాజ రామభూపాలుడు మరణానంతరం బాధ్యతలు స్వీకరించిన రాణి 1923 నుండి 1935 వరకు పాలన చేసింది. ఈమె బతికుండగానే ఆ బాధ్యతలను దత్త పుత్రుడు చిన్న సీతారామభూపాలరావుకు 1935లో బదలాయించింది. ఈతను 1913లో ఆదిలక్ష్మిదేవమ్మను వివాహమాడిండు. వీరిద్దరికి వరలక్ష్మమ్మ, శ్రీ లక్ష్మిదేవమ్మ అనే ఇద్దరు కూతుళ్ళున్నరు. చిన్న సీతారమభూపాలరావు 1935 నుండి 1946 వరకు పాలన చేసిండు. అనంతరం ఆయన భార్య ఆదిలక్ష్మిదేవమ్మ ఆ బాధ్యతలను స్వీకరించింది. ఈమె పాలన కాలంలో ఎంతో సాహిత్యం ఈ సంస్థానం నుంచి వెలువడింది. కవి, పండితులను ఆదరించింది. ఈమె జీవిత చరిత్రను పండితులు పద్యరూపములో రాసి ప్రచురించినారు. పెద్ద కుమార్తె వరలక్ష్మమ్మను దోమకొండ సంస్థానాధీశులు రాజా సోమేశ్వరరావుకిచ్చి వివాహం చేయించడమే గాకుండా అతనికే సంస్థాన పాలనా బాధ్యతలను కూడా అప్పజెప్పినారు. ఇదే జిల్లాకు చెందిన రాజోలు సంస్థానంలో కూడా మహిళలు కీలక భూమిక పోషించినారు. ముష్టిపల్లి ఇమ్మడి ఎల్లారెడ్డి సోదరుడు చిన్నరెడ్డి భార్య లక్ష్మాంబ, చిన్న విభుడు భార్య లింగాంబ కూడా పాలనలో చేదోడు వాదోడుగా నిలిచారు.

సాహిత్య శిఖరం

# నోబెల్ సాహిత్య బహుమతి 2014

# పాట్రిక్ మోడియానో




ఫ్రెంచ్ నవలా రచయిత పాట్రిక్ మోడియానో 2014లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి పొందారు. మానవ జీవితాలు, నాజీల చేతుల్లో మారణ కాండకు గురైన యూదుల మనో భావాలు, వారు ఎదుర్కొన్న అవమానాలు, అస్థిత్వాన్ని కోల్పోవడం వంటివి పాట్రిక్ మోడియానో నవలల్లో ప్రధాన అంశాలు. 1945లో పారిస్ నగరంలో జన్మించిన మోడియానో స్వీయానుభవాలే ఆయన సాహిత్య సృష్టికి ప్రేరణలు. ప్రచార ఆర్భాటాలకు దూరంగా ఉండే పాట్రిక్ మోడియానో, ఫ్రెంచ్‌లో ఇప్పటి వరకు 40కి పైగా నవలలు, పలు బాలల పుస్తకాలు రచించారు. ఇందులో కొన్ని నవలలు ఆంగ్లంలోకి అనువదితమయ్యాయి. 'మిస్సింగ్ పర్సన్', 'సెర్చ్ వారంట్', 'డోరా బ్రూడర్', 'మెమరీ లేన్', 'ఏ ట్రేస్ ఆఫ్ మాలిస్' మోడియానో ప్రధాన రచనలు.



# జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీత 2012

# రావూరి భరద్వాజ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రముఖ రచయిత 'రావూరి భరద్వాజ'కు 2012లో జ్ఞాన్ పీఠ్ పురస్కారం లభించింది. రావూరి భరద్వాజ కథానికలు, నవలలు, నవలికలు, కవితలు, వ్యాస సంపుటాలు, నాటికలు, స్మృతి సాహిత్యంతో కలిపి సుమారు 190 పుస్తకాలు రాశారు. ఆయన ప్రసిద్ధ నవల 'పాకుడు రాళ్లు'. 1950లో ముద్రించబడిన రాగిణి అనే పుస్తకం భరద్వాజ గారి ప్రథమ రచన. పాకుడురాళ్ళు, జీవన సమరం, కాదంబరి వంటి రచనలు ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్టలను తెచ్చి పెట్టాయి. పాకుడురాళ్ళు నవలలో భరద్వాజ వెండి తెర వెలుగుల వెనుక ఉన్న చీకటి కోణాలను స్పృశించిన శైలి, వర్ణించిన విధానం ఒక గొప్ప సంచలనం, ఆలోచనాత్మకం.



కథ

# నిర్బంధం

కరోనా నుండి పుట్టిన కవిత్వం
మన ముందు పెట్టిన కథ....

కె.వి. నరేందర్

ఓ మనిషీ...
ఏ దగ్గ ప్రేమికుల
కన్నీటి ఉసురు నీకు తాకిందేమో
కులం చాటున... మతం మాటున
నువ్వు చేసే అప్రకటిత యుద్ధానికి
ఏ నరుడు నిన్ను శపించాడో...
కడుపులోంచి రాలక ముందే
చితికట్టెలు చల్లారకముందే
నీ వికృత చేష్టలు చూసి కరోనాని
సృష్టించివుంటాడు.
ఇకనైనా... మనసుకి కప్పేసిన
మాస్క్ విప్పెయ్... నీ గుండెని
శానిటైజర్ ముంచేయ్...

అయిదు రోజులుగా ఇంట్లో చిల్డ్రన్ బెడ్ రూంలో శైలి రాసిన తన కవిత్వం తనకే చిత్రంగా తోచింది. శైలికి పరీక్షల్లో కరోనా పాజిటివ్ వచ్చింది. హోమ్ ఐసోలేషన్ అని ఇంట్లోనే వుంటుంది. శైలి బెంగంతా అమ్మ గురించే... ఈ మధ్యనే అమ్మకు షుగర్ వచ్చింది. కరోనా దెబ్బకి నాన్న ఫోటో స్టూడియో సరిగ్గా నడవడం లేదు. రోజు తాగొచ్చి, అమ్మని కొడతాడు. మా తాతయ్య కూడా మా ఇంట్లోనే వుంటాడు. తాతయ్యకి వచ్చే ఆరు వేల పెన్షన్ అమ్మకిస్తాడు. వాటితోనే ఇల్లు గడవాలి. కవితని మళ్ళీ చదువుకొని... శైలి, "తాతయ్యా..", అని పిలిచింది. శ్రీరాములయ్య, "ఏమైంది తల్లీ", అని పరిగెత్తుకొచ్చాడు, దూరంగా ఉండి తలుపు కొంచెం తెరిచి... "ఇదొక్కసారి చదువు", అంది. ఆయనది చదివి ఆశ్చర్యపోయాడు.

"నువ్వే రాసావమ్మ...", అని అడిగాడు. తల బయటపెట్టి సంతోషంగా అంది, "నేనే కదా..", శైలి డిగ్రీ ఫస్టీయర్ చదువుతుంది.

"కవిత బాగుంది... ఇదిగో లతమ్మ... నీ బిడ్డ కవిత రాసిందే...", అన్నాడు.

వంటింట్లో చమటలు కక్కుతున్న లత ఆ మాట విని నిట్టూర్చింది.

"అదేదో లక్ష రూపాయల లాటరీ తగిలినట్టు మీరు సంతోష పడుతారెందుకు మామయ్య," అంది.

మరో రెండు రోజులకి, మరో కవిత రాసింది..

శైలి అమ్మ తిడుతోందేమోనని భయపడింది. అందులోను తనకి పీరియడ్ వచ్చింది. అమ్మకి విసుగొస్తుంది.

నాలుగో తరగతి చదివే తమ్ముడికి ఆన్ లైన్ క్లాస్ కోసం ల్యాప్‌టాప్ ముందు స్కూల్ డ్రెస్ వేసి, టై కట్టి, నిక్కరేసి బెల్టు పెట్టి కూచోబెట్టాలి. లేకుంటే ప్రిన్సిపాల్ ఫైన్ వేస్తుంది. వాడు ఇల్లంతా పరిగెడ్తాడు. స్నానం చేయడానికో, అన్నం తినడానికో సతాయిస్తుంటాడు...

తాను బయటుంటే... వీపు మీద ఒక్కటిచ్చేది.

కరోనా వల్ల అమ్మకు పని ఎక్కువై అలిసిపోతుంది...

కరోనా వచ్చి పనిమనిషి రంగమ్మ రెండు నెలలు క్రింద చనిపోయింది. రంగమ్మ మరణం మాకన్నా అమ్మను కుంగ దీసింది. దాని కష్టసుఖాలు అమ్మకి చెప్పేది. అత్త పెట్టే కష్టాలు, భర్త తాగొచ్చి రాత్రి కొట్టడం.. ఆ దెబ్బలు వాతలు అమ్మకు చూపించి ఏడ్చేది. ఆమెకి రెండో తరగతి చదివే కొడుకున్నాడు. తమ్ముడు వాడేసిన డ్రెస్‌లన్నీ అమ్మ ఆమె కిచ్చేది.

"శైలీ.. అమ్మా శైలీ..", తాతయ్య పిలిచాడు.

"ట్యాబ్లెట్ వేసుకున్నావా... ఈ రోజు ఏ కవిత రాసావ్", అడిగాడు.

"వేసుకున్న తాతయ్య... రాత్రి ఒక కవిత రాసాను. నువ్వయినా ఎంకరేజ్ చేస్తావ్. నాకదే బలం.

కానీ, పీరియడొచ్చింది తాతయ్య. నాలుగు రోజుల వరకు కవితలు బంద్", గది బయటికి ఒక మడిచిన కాగితాన్ని విసిరేసింది.

"ఇదేనా..", అంటూ కాగితం తెరిచాడు తాతయ్య...

మా చప్పట్లు
నీకు విన్పించక పోవచ్చు...
మా దీపం వెలుగులు
నీకు కన్పించక పోవచ్చు...
నీతో యుద్ధం చేస్తున్న
మా శ్వేతకపోతాలకి కన్నీటి విలువ

**“చూడమ్మా.. ప్రముఖ కవులందరూ... నిర్బంధంలోనే గొప్ప కవితలు రాసారు. కునుకు తీసేందుకు కటిక నేల, మనసుకి శరీరానికి కూడా స్వేచ్ఛ లేని బంధీఖానా.. తినేందుకు సిమెంట్‌ని కలిపిపెట్టిన రొట్టెలు, తీవ్రమైన అనారోగ్యం, నిత్య ప్రాణ భయం, తన జనం, తన కుటుంబం ఎలా ఉందో కూడా తెలియని స్థితి... ఇలా చావుకి బ్రతుక్కి ఉన్నా సంధి కాలంలో కూడా మంచి కవిత్వం రాయొచ్చన్నారు దాశరథి. జైలు గోడల మీద చెరబండరాజు, ‘అర చేతుల్ని అడ్డు పెట్టి సూర్య కాంతిని ఆపలేవు...’, లాంటివి రాసారు.**

తెలుసు.

మా ఖాకీ సైన్యానికి
కత్తి విలువ తెలుసు
నీ పాద ముద్రల్ని ఊడ్చేసే చీపుర్లు
కూడా
ఖడ్గ చాలనం చేస్తాయ్...
నీ కోట గోడల్ని కూల్చేసే
నీ డేగ రెక్కల విరిచేసే
మా ఖద్దర్ బిడ్డలు నిద్రపోని
సముద్రాలవుతున్నారు
యుద్ధం మొదలవకముందే,
ఆయుధాన్ని తస్కరించే...
శత్రువై నువ్వొచ్చిన
మాలోనే ఏ నైవేద్యం అడగని
స్వచ్ఛంద దేవతలు అన్నదానాలు
చేస్తున్నారు.

శైలి తండ్రి నారాయణ.. జగిత్యాలలో ఫోటో స్టూడియో నడుపుతున్నాడు. కరోనా కారణంగా... ఫంక్షన్లు కాదు గదా... బెత్తెడు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోల గిరాకీ లేకుండా పోయింది. ఇల్లు గడవాలంటేనే భయమేస్తుంది. మందు కొడ్దామన్నా డబ్బుల్లేవు...

శైలి.. మెల్లిగా తలుపు తెరిచి...

“అమ్మా ప్యాడ్స్ ఇవ్వవా”, అంది.

“అప్పుడే అయిపోయాయా... ఎక్కన్నుంచి తేవాలి... లాక్‌డౌన్ మొదలయ్యాకా కరివేపాక్కే కరువొచ్చింది”, అమ్మ విసుక్కుంది.

“ఆ విషయం మెల్లిగా చెప్పొచ్చుగా...”, అన్నాడు నాన్న బెడ్‌రూం లోంచి వస్తూ...

“ఇంకేం మెల్లిగా... నా బొంద లాగానా...”, అమ్మ అరిచినట్టుగా అంది.

అప్పుడే... అంతరిక్షంలో తిరిగే వాళ్ళలాంటి డ్రెస్ వేసుకుని... ఇంటి ఓనర్ వచ్చాడు. అది చూసి నారాయణ, బాత్రూంలోకి వెళ్ళి దాక్కున్నాడు.

“నారాయణా... నారాయణా”, గట్టిగా అరిచాడు ఓనర్. లత వంటింట్లోంచి బయటకు వచ్చింది.

“రండన్నయ్యా... కూచోండి”, అంది లత.

“నేను కూచోడానికి రాలేదు. నాలుగు నెలల కిరాయివ్వాలి. ఎప్పుడిస్తారు. మీ ఆయనెక్కడ”, అన్నాడు సీరియస్‌గా.

“ఆయన బాత్రూంలో ఉన్నారు”, అంది వినయంగా.

“మళ్ళీ వస్తాను... డబ్బులు రెడీ చేసుకొమ్మను... నువ్వు మాస్క్ పెట్టుకోమ్మా..”, అంటూ వెళ్ళాడు.

నారాయణ బాత్రూంలోంచి వచ్చాడు.

“ఛీ ఛీ... దొంగ బతుకైంది”, అంది లత అసహనంగా,

“ఎవరిదే దొంగ బతుకు..?”, అడిగాడు నారాయణ ఆవేశంగా...

“ఊ...నాదే..”, శైలికి తెలుస్తోంది... ఇంట్లో తుఫాను మొదలవుతుందని..

కడుపు నొప్పి వస్తున్నా... బలవంతంగానైనా ఏదో రాయాలని పెన్ను, పేపర్ తీసుకుంది. తాతయ్య చెప్పేవాడు ‘పెన్’తో రాయటం కాదమ్మ... పెయిన్‌తో రాయాలి అని. ఇప్పుడు తనకి రెండు ఉన్నాయని నవ్వుకుంది.

‘నాకు గోరంత స్వేచ్ఛ కావాలి,
నాకు చిటికెడు సంతోషం కావాలి,
నాకు పిడికెడు దుఃఖం కావాలి,
నాకు బెత్తెడు చోటు కావాలి,
నాకు దోసెడు స్వప్నాలు కావాలి,
నాకు చారెడు చిరునవ్వులు కావాలి,
ఇంకా చాలు...
వామనుడిలా వ్యాక్సిన్ రూపంలో
అవతరిస్తాను...’,

అని రాసింది..

కానీ తాతయ్యకి నచ్చకపోవడంతో చించేసింది..!

కొన్ని రోజులకి..

శైలి మరో కవిత రాసింది..

ఊపిరి తిత్తుల్లో రహస్యంగా
మృత్యుగీతం పాడుతోంది కరోనా
లయ తప్పిన ఆ శ్వాస వింటే...
మరణ సందేశం విన్పిస్తుంది
దేవుడి ముందు పెట్టిన నైవేద్యం
లాక్‌డౌన్‌లో పాచిపోయింది.
కుబేరుడికి కూడా కోవిడ్
వచ్చిందేమో...
గుప్పెడు అటుకులు చాలనే
కుచేలుడయ్యాడు
ఆన్‌లైన్‌లో పాఠాలు వింటున్న
తమ్ముడు
వరిగొల్కల్ని ‘అన్నం చెట్టు’
అంటున్నాడు.
పాలిచ్చే బర్రెని చూసి ‘మిల్క్ రోబో’
అనుకుంటున్నాడు.
వ్యాక్సిన్ కనుగొంటావంటూ దేశాలు
పొక్కిలైన కళ్ళలో తడిపుట్టిస్తున్నాయి
నెర్రలు జూపిన గుండెలు...
బతికించమని
ఆర్తనాదాలు చేస్తున్నాయి...
ప్రేమించిన చెలికాడికి
కాల్ చేస్తే... కవరేజ్ ఏరియాలో లేడని
వస్తోంది.
అంతకన్న ముందే... అపశకునం
పలికినట్టే
కరోనా శ్లోకం విన్పిస్తోంది.

అది చదివి తాతయ్య... శైలీ, నీలో స్పందించే గుణం ఉందమ్మా. ఇంకా బాగా రాయి... అనగానే, “తాతయ్య... ఈ గదిలో బందీగా ఉన్నట్టుంది. నాకు కవిత రాయాలని మనసొప్పడం లేదు. నన్ను బయటికి తీసుకెళ్ళండి. ప్లీజ్...”, అంది బాధగా.

శైలిని నిరుత్సాహ పర్చడం ఇష్టం

లేకుండా "చూడమ్మా.. ప్రముఖ కవులందరూ... నిర్బంధంలోనే గొప్ప కవితలు రాసారు. కునుకు తీసేందుకు కటిక నేల, మనసుకి శరీరానికి కూడా స్వేచ్ఛ లేని బందిఖానా.. తినేందుకు సిమెంట్‌ని కలిపిపెట్టిన రొట్టెలు, తీవ్రమైన అనారోగ్యం, నిత్య ప్రాణ భయం, తన జనం, తన కుటుంబం ఎలా ఉందో కూడా తెలియని స్థితి... ఇలా చావుకి బ్రతుక్కి ఉన్నా సంధి కాలంలో కూడా మంచి కవిత్వం రాయొచ్చన్నారు దాశరథి.

**తాను బయటుంటే... వీపు మీద ఒక్కటిచ్చేది. కరోనా వల్ల అమ్మకు పని ఎక్కువై అలిసిపోతుంది... కరోనా వచ్చి పనిమనిషి రంగమ్మ రెండు నెలలు క్రింద చనిపోయింది. రంగమ్మ మరణం మాకన్నా అమ్మను కుంగ దీసింది. దాని కష్టసుఖాలు అమ్మకి చెప్పేది. అత్త పెట్టె కష్టాలు, భర్త తాగొచ్చి రాత్రి కొట్టడం.. ఆ దెబ్బలు వాతలు అమ్మకు చూపించి ఏడ్చేది. ఆమెకి రెండో తరగతి చదివే కొడుకున్నాడు. తమ్ముడు వాడేసిన డ్రెస్‌లన్నీ అమ్మ ఆమె కిచ్చేది.**

జైలు గోడల మీద చెరబండరాజు, 'అర చేతుల్ని అడ్డు పెట్టి సూర్య కాంతిని ఆపలేవు...', లాంటి రాసారు. అలాగే గంగు, ప్రజల మనిషి వంటి వట్టికోట ఆళ్వారుస్వామి నిర్బంధంలోను రచనలు చేసారు. అందుకని నువ్వు బాధపడకు... ఇంకో మూడు రోజులైతే... ఐసోలేషన్ పీరియడ్ అయిపోతుందని ఓదార్చాడు.

తర్వాత రోజు మరో కవిత రాసి... తాతయ్యకందించింది.

నీ ఉనికి కన్పించని... నెత్తుటి
మరకల్లేని
పత్రిక చూడాలనుంది
కన్పించని సంకెళ్ళను తెంచి
దిక్కులు పిక్కటిల్లేలా రుద్రగీతం
పాడాలనుంది
కరోనా గుండెలపై డీజే పెట్టుకొని
పాదాలు చిట్లిపోయేలా ఆడాలనుంది
అమ్మ చిర్నవ్వుల ఒడిని చేరి
సముద్రాల్ని మోస్తున్న నాన్న భుజాలపై
పువ్వునై వికసించాలనుంది.
శ్వాసని ఆపేస్తున్న కరోనాని...
అక్కని అగ్నిగుండంలో తోసేసిన కట్న
పిశాచాలతో పోలిస్తే...
అనంతమైన ఆకాశంలో ఆకునై
రాలిపోవాలనుంది.
కన్నీటి మౌన భాషనవుతున్నాను
ఉచ్ఛ్వాస గొంతులో తన్నుకుంటుంది.
పరమాణువంతలేని... నువ్వు
ప్రపంచానికి పురిటి నొప్పులు చూపిస్తుంటే
నేను మాత్రం నీ మృత్యుపత్రం మీద
సంతకం చేయలేను.
"కవితనై వికసించి... పుస్తకమై
విస్తరించాలనుంది.."

మర్నాడు...

శైలి గదిలోంచి ఏ కవిత రాలేదు... ముడతలున్న ఏ కాగితం రాలేదు. తాతయ్య కలవరపడ్డాడు. తల్లి మనసు తల్లడిల్లిపోయింది..

తండ్రి... తమ్ముడు గుండె చెదిరిపోయింది.

సుడులు తిరుగుతున్న దుఃఖంతో ఐసోలేషన్ గది తలుపులు తెరిచారు.

శైలి అపస్మారక స్థితిలో ఉంది... అంతా కంగారు పడుతున్నారు... తాతయ్య వంటింట్లోకి వెళ్ళి గ్లాస్ లో నీళ్ళు తెచ్చి ముఖంపై చిలకరించాడు... తల్లి ఏడుస్తూనే వుంది..

మెల్లగా కళ్ళు తెరిచింది...

"కళ్ళు తిరిగాయి... చీకట్లు కమ్మాయి...", అంది నీరసంగా.

పది నిమిషాల తర్వాత... పూర్తిగా



కథ

కోలుకుంది.

పీడకలలా వచ్చి... నెత్తుటి కథలు చెప్పబోకు...

ఊడల మర్రిలా పెరిగి ఊపిరితిత్తుల్ని చుట్టేసుకోకు

మధురమైన మరణ జ్ఞాపకాన్ని తుంచేసావ్ కదే

అనుబంధాల్ని, ముక్కలు ముక్కలుగా తెంచేసావ్ కదే

అయినా... చావును ప్రేమించగల మా సైన్యం

నీ మీద నిలబడి... శిరసెత్తి సింహనాదం చేస్తారు.

నమ్మకంగా కలగంటున్నాను...

నీపై దుఃఖ నిఘంటువునే... ఆవిష్క...

నారాయణ లోపలికి రాగానే శైలి రాయడం ఆపింది. నీ ఐసోలేషన్ పీరియడ్ అయిపోయిందిరా, నీ రిపోర్ట్ లో కూడా నెగిటివ్ వచ్చింది. శైలి తృప్తిగా శ్వాస తీసుకుంది.

శైలి చేతుల్లోని కాగితం మడత తీస్కొని నారాయణ 'ఇవేం పిచ్చి రాతలే...', అన్నాడు. తాతయ్య 'మెల్లిగా లే బిడ్డా..', అంటూ చెయ్యందించాడు.

నెమ్మదిగా బయటకొచ్చిన శైలికి బయట ప్రపంచపు గాలి తగిలి... ఏవో స్వేచ్ఛావాయువులు పీల్చుకున్నట్లుంది.

అప్పుడే బయటనించి, "అమ్మా... అన్నముంటే పెట్టండమ్మా", అని గిన్నె పట్టుకొని ఏడేళ్ల పిల్లాడు నిల్చున్నాడు.

చెదిరిన జుత్తు... చిరిగిన దుస్తులతో... మురికి మురికిగా వున్నాడు..

దీనంగా నిల్చున్నాడు...

ఒక శైలి మాత్రమే వాణ్ణి గుర్తుపట్టింది...

వాడు చనిపోయిన పని మనిషి రంగమ్మ కొడుకు.

లత కూడా గుర్తుపట్టింది... వాడు దైన్యంగా ముఖంపెట్టి... 'అమ్మ ఆకలేస్తుంది...', అన్నాడు.

లత మనసు మంచులా కరిగిపోయింది. కండ్ల నిండా నీళ్ళు తిరిగాయి...వానికి కరోనా ఉందో లేదో చూసుకోకుండానే...వెళ్ళి వాణ్ణి హత్తుకుంది.

శైలి, వాళ్ళ తాతయ్య ఆశ్చర్యపోయారు. టీవీ లో 'గాయపడిన కవి గుండెల్లో... రాయబడని కావ్యాలెన్నో...', దాశరథి గీతాన్ని దేశపతి శ్రీనివాస్ ఆర్ద్రంగా పాడుతున్నాడు.

ఆ దృశ్యం చూసిన శైలి మనసులో ఎన్నెన్నో భావతరంగాలు ఉప్పొంగు తున్నాయి...!

కవిత

# వేలగొంతుకలైన అక్షరం



జయంతి వాసరచెట్ల

అతను
శతవసంతాలతో ఉదయించాడో..
సహస్ర జీవితాలకు కిరణమవ్వాలని అనుకున్నాడో..
నీటిబుడగజీవితమైనా బడుగులకు బాసటగా
నిలవాలనుకున్నాడో...
తెలుసుకోలేని రహస్యం...!!
ప్రతిక్షణం ప్రశ్నలు ఉదయిస్తాయి
అతను ప్రజలపక్షాన నిలిచి ప్రతిధ్వనించాడు
సమాధానాలు మంతనాలు చేస్తుంటాయి
నీడనిచ్చిన చెట్టుకు గొడుగుగా మారడం ఎంతగొప్ప?
భుజానికి సంచితో నడిచినదారల్లా
అక్షరాలు చల్లుతూ జీవితాన్ని మోసాడతను
అన్న అమ్మైనప్పుడు....
అన్న భుజాలు నాన్న పొత్తిళ్ళుగా మారి గుండెలపై మోసాయి
ఎవరిగోడు వారిదైనప్పుడు
అందరిగోడూ అతని గొడవైంది
అన్యాయం అంతరించే దాకా ఆగని గొడవ అతనిది
అతన్ని చూస్తే భాషయాస సంభాషిస్తది
అక్షరం అతనికోసం ఉదయించిందో
అతనే అక్షరమై బతికిండో
అతని నీడలో ఎందరో బతుకులకు భరోసా
అక్షరమై ఎదిగిన మహావృక్షానికి పూసినపదాలు
వేలగొంతుకలై ఉద్యమించాయి
కర్రను ఊతంగా చేసుకొని యాసకు ప్రాణం పోసి
భాషకు కాంతిపుంజమయ్యిండు
తనకలంనుండిరాలిన సిరా చుక్కలు సమాజచైతన్య దీపికలైనయి
అక్షరమై మొలకెత్తిన అతను
విశ్వాంతరాలంలోకి ఎదిగి మనీషిగా మిగిలాడు!!





## Archaeology and the Public Purpose: Writings on and by M.N. Deshpande

పురాతన కట్టడాలు, వాటి నేపథ్యం, పరిరరక్షణ గురించి తెలుసుకోవాలని చాలా మందికి ఆసక్తి ఉంటుంది. ప్రముఖ ఆర్కియాలజిస్ట్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) మాజీ డైరెక్టర్ జనరల్ నరహర్ దేశ్ పాండే యొక్క పూర్తి అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరిచారు రచయిత్రి నయన్ జోత్ లహిరి. దేశ్ పాండే ను ఇంటర్వ్యూ చేసి తన జీవిత చరిత్ర, ఆర్కియాలజిస్ట్‌గా మారేందుకు దారి తీసిన పరిస్థితుల గురించి ఇందులో వివరించారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వారసత్వ సంపద, అరుదైన చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించిన విధానాలు, వాటిలో తన భాగస్వామ్యం లాంటి అనేక అంశాలను దేశ్ పాండే ఈ పుస్తకం ద్వారా పంచుకున్నారు.



## Beyond Possible

జీవితంలో ఉన్నతమైన లక్ష్యాలను సాధించేందుకు అనేక ఒడిదొడుకులను ఎదుర్కొనవలసి ఉంటుంది. పర్వతాలను అధిరోహించడం అనే తన జీవిత లక్ష్యాన్ని చేరుకునే మార్గంలో ఎదురైన అనుభవాలను Beyond Possible పుస్తకంలో పొందుపరిచారు ప్రముఖ పర్వతారోహకుడు నిమ్స్ దాయ్ పూర్జా. నేపాల్ దేశానికి చెందిన పూర్జా ఇప్పటిదాకా ఎవరెస్ట్ సహా, అనేక ఎత్తైన పర్వతాలను అధిరోహించాడు. అయితే తన లక్ష్య సాధనలో ఎదురైన విపత్కర పరిస్థితులను ఎదుర్కొంటూ, ముందుకు సాగిన విధానాన్ని ఇందులో సందేశాత్మకంగా వివరించారు నిమ్స్ దాయ్ పూర్జా. జీవితంలో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఉపయోగపడే పలు జీవిత సత్యాలను నిమ్స్ దాయ్ పూర్జా, తన అనుభవాల రూపంలో ఈ పుస్తకంలో వివరించాడు.



## Himalayan Challenge: India, China and the Quest for Peace

ఇండియా-చైనా మధ్య సరిహద్దుల్లో ఘర్షణల గురించి ఈ మధ్య తరచుగా వింటున్నాం. అయితే ఇండియా-చైనా మధ్య ఉద్రిక్తతలు గత ఆరు దశాబ్దాల క్రిందటే మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఒక రాజకీయ నాయకుడిగా, వివిధ సందర్భాలలో చైనా దేశంలో పర్యటించిన అనుభవాలను ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి 'Himalayan Challenge: India, China and the Quest for Peace' పుస్తకంలో పొందుపరిచారు. ఇండియా-చైనా మధ్య సత్సంబంధాల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యల గురించి సైతం ఇందులో చర్చించారు.



## Indian Economy's Greatest Crisis

కరోనా మహమ్మారి ప్రపంచ ఆర్థిక, సామాజిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ప్రపంచంలో జనాభా పరంగా రెండో అతిపెద్ద దేశమైన భారతదేశం యొక్క ఆర్థిక వ్యవస్థ కరోనా మహమ్మారి కారణంగా ప్రభావితమైన తీరును 'Indian Economy's Greatest Crisis' పుస్తకంలో వివరించారు రచయిత అరుణ్. కరోనా సమయంలో వలస కార్మికుల వ్యధలపై ఈ పుస్తకంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆరోగ్య విపత్తుగా ప్రారంభమైన కరోనా, ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన తీరు, దానిని ఎదుర్కొనేందుకు పాలకులు అవలంబించిన విధానాలను ఈ పుస్తకంలో వివరించారు.

కవిత

# గడెం నొగలు నా శ్వాసలు

- వనపట్ల సుబ్బయ్య



నేను సేను బిడ్డను
సెలుకనే నా ఇల్లు ఇడుపు
సేతానమే నా సంస్కృతి
ముల్లుకర్రనే నా నేస్తం

మొకాళ్లలోతు మట్టిలో పొర్లాడి
బురుదను మింగి
విత్తును సృష్టించిన ఆకలిని తాగి
అన్నదాత త్యాగులైనను తగిలిచ్చుకున్న
అపర దరిద్రున్ని

గడెం నొగలు నా శ్వాసలు
ఎడ్లబండి నా నడక
నాగలి నా ఆయుధం
పలుగొర్రు, గుంటుక నా భుజాలు
దుకిమోకు, పగ్గం, భార్యలు
పలుపు, ఆంద్రె, వార్లు, నా నరాలు
గంటలు మువ్వలు నా గుండెలు
తుకం నారు నా సింగారం
మేడితోక నా అలంకారం!

పాలుపట్టిన కంకులనుచూసి
బిడ్డల ఆకలితీరుతదని మురిసిపోయినోన్ని
ఇంటికొచ్చిన కళ్లాన్ని చూసి
దేశం ముందుకుపోతుందని గంతులేసినోన్ని
ఊరి కోమటాయనకు బర్తి పట్టిచ్చి
వారం దినాలకోయి
కాంట లెక్కలు చూసుకున్నోన్ని
వచ్చినంతనే తృప్తిపడ్డోన్ని

వానొచ్చి గింజలు నవ్వకున్న
పోతేపోననుకున్నోన్ని
కరువొచ్చి
కాలం కాకున్న కలత చెందనోన్ని
ఎరువులు సబ్సిడీలు ఎగనామం పెట్టినా
గుండెనిబ్బరం చేసుకున్నోన్ని

అప్పులు కత్తులై కుతికెలను కోస్తున్నా
నేలకోసం సిపాయిల్లా నిలబడ్డోన్ని
ఇయ్యాళ సౌకర్యాల పేరున రెక్కల్ని గత్తిరిచ్చి
పరుగులపోటిపెడ్తున్నరు
పంటరకం తప్ప పురుగుల రకం ఎరుగనోన్ని
గుమ్ములు గాదెలు తప్ప
గోడౌన్లనకు అయిసతు లేనోన్ని
సెలుకాడికి ఇంటికాడికి తప్ప
ఏ దేశం సంగతి తెల్వనోన్ని
నలుగుట్ల నగుపట్లపాలైన నాగలిని

**(రైతులకు మద్దతుగా కవిత)**

# నీకు మనసెట్లా వచ్చింది తల్లీ

చిత్తలూరి



నీకు నోరెట్లా వచ్చింది తల్లీ
ఆ నోటి నాలుక మీదే కదా
నాలుగక్షరాలు గీసి
నిన్ను మాటల పెట్టెను చేసి
దేశమ్మీదికి వదిలేశారు

నీ కలమెట్లా కదిలింది బిడ్డా
వాళ్ల కలాల నిండా కన్నీళ్లను నింపి కదూ
నీ బతుకంతా అక్షరాలను పూసారు

నీకు చేతులెట్లా వచ్చాయమ్మడూ
నీకు జన్మనిచ్చినోళ్ల తరువాత
చదువు చెప్పి నీకు మరో జన్మనిచ్చోళ్లు కదా

నీ జన్మస్థానాలనే,
నీ భవిష్యత్తు మర్మస్థానాలనే
కలం ముక్కుతో కసిగా కాకిలా పొడిచావు

అక్షరాలంటే అణుబాంబులని చెప్పినవాళ్లనే
నిలువునా పేల్చేయటానికి సిద్ధపడ్డావు
ఏ కనిపించని శక్తులో ఉసిగొలిపితే ఎగబడి
నీ బోధక దేవుళ్ల చిత్రపటాలకే
దండలు వేయాలని తలపోశావు

నువ్విలా గుండెల్లో పొడుస్తావని తెలిస్తే
నువ్విలా మనసు మీద కొడతావని తెలిస్తే
బహుశ వాళ్లు నీకు
చదువు చెప్పే వాళ్లే కాదేమో

అయినా బిడ్డ తప్పు పని చేసినా
క్షమించే పెద్ద గుణంలే తల్లీ వాళ్లది
నువ్వు వాళ్ల గుండె కాయల్ని పెకలించుకుని
పారిపోతూ తట్టు తగిలి పడిపోయినా
నేలపాలైన వాళ్ల గుండె కూడా
అచ్చం మీ అమ్మలాగే
జాగ్రత్త తల్లీ కాస్త చూసుకుని నడువు
ఎంతైనా నీకు నడత నేర్పిన వాళ్లం కదా
అనే దీవిస్తారు

అన్ని అవాకుల చవాకుల బాకులతో
నీ చదువు కన్నతల్లుల
గుండెల మీద పొడవటానికి
నీకు మనసెట్లా ఒప్పింది తల్లీ!

**ఉపాధ్యాయుల ఒకానొక వేదనకీ...**

కథ

# వేప చెట్లు

**మనిషి - చెట్లు అనుబంధం తెలుపుతున్న కథ...**



డా॥ రూప్ కుమార్ డబ్బీకార్

"ఏం రాజమ్మత్తా! బాగున్నవా గట్ల కూసున్నవేంది బుగులుగా, ఒంట్లో బాగుండలేదా?

"ఎవరే! బుచ్చమ్మనా? బాగేముంది బిడ్డా, గిట్లున్న సూడు! మీ చిలకమ్మత్త కనబడ్తలేదేమే?!" ఆరా తీసింది రాజమ్మవ్వ.

"మంచం దిగేటట్టున్నాది ఆమెకు. పచ్చవాతం పట్టుకున్నపట్నుంచి ఇంటి గడప దాటితే కదా ముసల్ది. పానానికి పెద్ద యాష్టయి పాయె. చెయ్యలేక, సూడలేక సస్తున్న. తప్పేటట్టున్నాది.!" అంది బుచ్చమ్మ కాస్త విసుగు, అసహనం కలగలిపి.

"గట్లటవేందే? పెద్ద పానం, అందరికీ వూడిగం చేసి చేసి గీ పొద్దుకు చేరింది ముసల్ది. దాని చేతుల ఉందా! దాని రాత, కర్మ ఎట్ల కాలిందో అట్లనే తీర్తది, తీ రాదు!.." అంటూ రాజమ్మ సర్ది చెప్పింది.

"అంతేలే, మన చేతులున్నాది. పొద్దెక్కింది వస్త. కాంటకు పోవాలత్తా. వడ్ల బస్తాలొచ్చినయంట, గీ పిల్ల జానమ్మ ఇంట్ల ఉందో లేదో? తోల్కొని పోదామని చూస్తున్న?" అంటూ ముందు సందుల కెళ్ళి పోయింది బుచ్చమ్మ.

అరుగు మీద కూచోనున్న రాజమ్మకు బుచ్చమ్మ పిలుపుతో తెగిపోయిన జ్ఞాపకాలు మళ్ళీ అతుక్కున్నాయి.

అరుగు మీద కూచోవడం ఈ రోజు కొత్తేమి కాదు. గత డెబ్బై సంవత్సరాలనుండి ఈ అరుగు తోటి అనుబంధం. పిల్లలు మాట్లాడుకోంగ విన్నది గాని తనకి ఎనభై రెండేళ్లు దాటినయని తెలిసేది కాదు. ఈ ఇంటికి పది, పదకొండేళ్ల వయసులో పెళ్ళి కొత్తకోడలిగా వచ్చినప్పటినుంచి ఈ అరుగుతో సంబంధం. వచ్చిన కొత్తలో అరుగు అరుగులా వుండేది కాదు. మట్టి దిబ్బలా వుండేది. దాన్నే ఎప్పటికప్పుడు చదును చేసి పేడ, ఎర్ర మట్టితో అలికి ముగ్గులేసి అలంకరించేది. ఇంటి ముందు భాగం డంగు సున్నంతో కట్టిన అర్రలు, వెనుక వైపు కవేలి కప్పుతో, మట్టి గోడలతో కట్టిన వంటిల్లు, జాలాట్ల తోటి విశాలంగానే ఉంటుంది. ఇంటిమధ్యలో కాస్త ఖాళీ జాగా అక్కడినుంచి పైకి సిడీలు, సిడీల పక్కనే మోరీ. మోరీ దగ్గర తానాలకు, కాళ్ళు చేతులు కడుక్కోడానికి పరిచిన గ్రానైటు బండ పక్కనే సిమెంటు గోలెం, ఇత్తడి గంగాళం నీళ్లతో నిండి ఉండేవి. ఇప్పటిలా అప్పుడు శాబాదు బండలు పరిచి వుండేవి కావు, అంతా మట్టి నేల. అలుకుపూత చేయాల్సిందే.

రాజమ్మ కూర్చున్న ఆ ఇంటి అరుగు పెద్ద చరిత్ర కలిగినది. ఎండాకాలం సాయంకాలాల్లో పిల్లలకు ఆట మైదానం, చీకటి పడ్డ తరువాత ఆడ పిల్లలకు చెమ్మ చక్కాలాటలకు, కాళ్ళగజ్జ.. ఆటలకు రంగస్థలం. పెద్ద ఆరిందాలకు బాతఖాని చోటు. ఎన్ని పెళ్లిళ్లకు గద్దె అయ్యింది. ఎన్ని చివరి స్నానాలకు పీటమయ్యింది. ఎన్ని జ్ఞాపకాల మూటలు విప్పి పరుచుకున్న చద్దెర ఈ అరుగు. వీటన్నింటికి సజీవ సాక్ష్యాలు అరుగుకు రెండు వైపులా వున్న ఆ వేప చెట్లు. అరుగుకు, వేప చెట్లకు అక్కాచెల్లెళ్ళ బంధం. అరుగు రూపుదిద్దుకున్న ఆరు నెల్లకే చెట్లు నాటుకున్నయి. కాలంతో పాటు అరుగు ఎత్తు వెడల్పు పెరిగింది. రాజమ్మ పెళ్ళైన కొత్తలో సాన్పి తానమాడేది అరుగు. మెల్లమెల్లగా ఎర్ర మన్ను, పేడతో అలుకు పెట్టించుకుని ముగ్గులు వేయించుకుంది. రాజమ్మలాగే అరుగు అలంకారాలు చేసుకుంటూ వుండేది. కాలం మారింది. సంసారం రొంపిలో రాజమ్మ బండబారింది. మట్టి అరుగు మీద శాబాదు బండలు పరుచుకున్నయి. అరుగు మీద ఇప్పుడు సాన్పి లేదు, అలుకుపూత లేదు. ముగ్గులు లేవు. రాజమ్మ ఒంటిమీద అలంకారాలు లేవు. పెనిమిటి కాలం చేసి ఇరవై సంవత్సరాలకు పైనే దాటింది.

నెమ్మదిగా సూర్యుడు నెత్తిపై కొస్తుండు. ఎండ సెగ పెరిగింది. రాజమ్మ చూపు, మనసు వేపచెట్ల పైకి మళ్లింది. రెండు వేపచెట్లు. గంభీరంగా అరుగుకు రెండు వైపులా చివరంచున

నిలబడివున్నయి. పెళ్ళైన కొత్తలో ఈ ఇంటికొచ్చినపుడు మామ వెంకోజి మహా ఇగురంగ నాటిండు. "వేపచెట్లు నాటుకుంటున్నవేందయ్యా సుతారంగా! "యని అత్త గొణుక్కున్నదే మనసులోనే.

"వేపచెట్టు గాలి, నీడ సోకితే ఒంటికి, ఆరోగ్యానికి మంచిదే పిచ్చిదానా, నీకేం తెలుసు గాని పొద్దుగాల, పొద్దుమీకి గిన్ని నీళ్ల పోస్తే అవే పానం పోసుకొని నిలబడతయి. కోడలు పిల్లకు చెప్పు మేకలు తినకుండా జాగ్రత్త పడమని.." అంటూ మామ చెప్పుకొచ్చేది.

మట్టి గోడల్తోటి కట్టినా ఇల్లు పెద్దగానే ఉండేది. వెనకాల పెద్ద దొడ్డి కట్టి మామ అండ్ల యాటల్నితెచ్చి వదిలేటోడు. మర్క పిల్లలు, గొర్రె పిల్లల్ని గట్ల గాలి కొదిలేస్తే వాకిట్లోకొచ్చి తిరిగేవి. నాటిన వేప మొక్కల్ని యాడ మేస్తయోనన్న భయం. ఆగలేక దొడ్ల వున్న పాత తడికల్ని తెచ్చి గుండ్రంగ సుట్టి సుత్లీ తాడుతో గట్టిగ కట్టి మొక్కల చుట్టూ గింత లోతు మట్టి తీసి నిలబెట్టిన అడ్డంగా. ఎట్ల కాలం తిరిగిందో తెల్వదు గాని చెట్లు గట్టిగనే నాటుకున్నాయి. ఆడపిల్లలు, మగ పోరగాళ్ళు పెరుగుతుండ్రు. వేపచెట్లు పెరుగుతున్నయి. పిల్లల సాదుడు బరువు ఎక్కువయిపోతుండే. అప్పుడు ఆ కాలంల మగపిల్లల చదువులకు అంత తండ్లాట లేదు గాని ఆడపిల్లల పెళ్ళిళ్లకు యాతనై పోయేది. నల్లగొండ అంత పెద్ద టౌను కాదు. గట్లని చిన్నవూరు కాదు. గిప్పుడంటే దగ్గర దగ్గర పల్లెలు కలిసినట్లయిపాయె. రోడ్లు పడ్డయి. బస్సులొచ్చినయి గాని, అప్పుడున్న చుట్టుపక్కల వూర్లంటే పేర్లకు వూర్లు. పానగల్లు, గొల్లగూడెం, మర్రిగూడెం, చర్లపల్లి, గట్ల ముందుకుపోతే ఎల్లారెడ్డిగూడెం. గీవూరు దాటక పోదుము. పెద్దగట్టు, చెర్వుగట్టు జాతరల పుణ్యమాని బయటికెళ్లుడు తప్పితే ఇంటి చాకిరి తోటే పొద్దు గడిచిపోయేది. పెద్దపిల్ల రాంబాయమ్మ పెళ్లీడుకు, వేర్లు బలిసి మనిషెత్తు పెరిగిన చెట్లు గ్యాపకమే. పచ్చగా కొమ్మల లేత మండల తోటి కళకళలాడుతుండేవి. రాంబాయమ్మ పెళ్ళి సందట్ల బోనాలు జరిపితే బోనం కుండ మీద ఈ వేపచెట్ల మండలే తెంపి పెట్టిమి. సాకబోసిన కాడ, దర్వాజ తోరణాలు కట్టిన కాడ ఈ చెట్ల కొమ్మలే పనికొచ్చే. ఎంత సంబురమంటే మా కన్నా ఆ చెట్లే మురిసినట్లు కనబడేవి గావు! యాది కొస్తే పానం గిలగిల్లాడ్తది. ఒక్క పెళ్లిళ్ళ పేరంటాలకేనా, బోనాల పండక్కి అరుగు వేపచెట్లే దిక్కు. ఇప్పటి మాటా, యాభై, అరవై యేండ్ల కిందటి మాట. ఎండకాలం వస్తే రాత్రి అరుగు మీద వేపచెట్ల కిందే మగోళ్ళందరికీ పడక. పగటి గాడ్పుకి పోయిన పానం ఈ చెట్ల గాలికి తిరిగొచ్చేది. గాడ్పంటే మామూలు గాడ్పు కాదు. పక్కనున్న లతీఫ్ షా వలి గుట్ట రాళ్లు, పరుపు బండలన్నీ వేడెక్కి సెగనెగదోసేయి. అరుగు మీదే ఓ మూలకు జాగా చేసుకొని పక్క సందులోని గొండ్ల పోరగాళ్ళు కూడా పక్కేసుకునేది.

"ఎండ పొద్దెక్కింది అన్నం తింటావమ్మా?" కోడలు పిలవంగనే యాదిలకెళ్లి బయటికొచ్చింది రాజమ్మ.

"వస్తున్న పెట్టు" - అన్నది ముభావంగా.

మనుషుల మీదే మనసిరిగిపోయింది. ఆకలి సోయి వుండటమే లేదు. కళ్ళముందు పిల్లలు తిర్గాడిన ఆత్మకు తృప్తిలేదు. పిల్లలెదురుగానే వున్నా ఎడం వుంటుంది. ఎవ్వడూ సక్కగ మాట్లాడడు. మందలించడు. మాట వరసకి 'తిన్నవా అంటే తిన్న' అంతె. యాడికి పోయిందిగా మనుషుల మాట తీరు, మర్యాద. ఎక్కడ చూసినా డొల్లతనమే. సంసారం చేసినన్నాళ్లు ఇంట్ల ప్రతి ఒక్క వస్తువు జవాబిచ్చేది - గోలెం, గంగాళాలు, చెంబులు, గిన్నెలు, అంట్లు ఇరవై నాల్గు గంటలు వీటి తోటే బత్కు తెల్లారే. తెల్లారక ముందే చీకట్లనే ఇంటి చుట్టూ వున్న రెండు వాకిళ్లు ఊడ్చి సాన్పి చల్లి సుబ్బరంగా వున్నదాన్ని కంటినిండా చూసుకొని మురిసిపోయేదాన్ని. ఎండకాలమైతే వేప చెట్ల గాలి చల్లదనం



**రాజమ్మ కూర్చున్న ఆ ఇంటి అరుగు పెద్ద చరిత్ర కలిగినది. ఎండాకాలం సాయంకాలాల్లో పిల్లలకు ఆట మైదానం, చీకటి పడ్డ తరువాత ఆడ పిల్లలకు చెమ్మ చక్కాలాటలకు, కాళ్ళగజ్జ.. ఆటలకు రంగస్థలం. పెద్ద ఆరిందాలకు బాతఖాని చోటు. ఎన్ని పెళ్లిళ్లకు గద్దె అయ్యింది. ఎన్ని చివరి స్నానాలకు పీటమయ్యింది. ఎన్ని జ్ఞాపకాల మూటలు విప్పి పరుచుకున్న చద్దర ఈ అరుగు. వీటన్నింటికి సజీవ సాక్ష్యాలు అరుగుకు రెండు వైపులా వున్న ఆ వేప చెట్లు. అరుగుకు, వేప చెట్లకు అక్కాచెల్లెళ్ళ బంధం. అరుగు రూపుదిద్దుకున్న ఆరు నెల్లకే చెట్లు నాటుకున్నయి. కాలంతో పాటు అరుగు ఎత్తు వెడల్పు పెరిగింది.**

పానానికి హాయినిస్తూ వుంటే చెట్ల మొదళ్ళ చుట్టూ శుభ్రం చేసి అలికి గొలుసు ముగ్గు వేస్తే అది వాకిట్లో వున్న పందిరి ముగ్గు తోటి పోటీపడి నవ్వుకునేది.

ఓ రోజు ఉన్నట్టుండి నెత్తి మీద పెద్ద బండ పడినట్లయింది. కోడలు చెప్తుండగా విన్నది.

"వాకిట్ల అరుగు మీదున్న చెట్లు పెరిగి చాలా పెద్దగయినయి! చూస్తివి గదా! వేర్లన్నీ భూమిలోకి పోయి పునాదుల్ని లేపుతున్నట్లున్నయి. అరుగు మీదున్న శాబాదు పలకల్ని చూస్తే తెలుస్తది. అరుగును మడత పెట్టినట్లయితుంది. బండలన్నీ పగిలి పోతున్నయి. వేర్లు గోడల కిందికి వచ్చి గోడలు పగిలితే ఇంటికే గండం.." చెప్పుకుపోతుంది రాణిబాయి. అవతల్నుంచి జవాబు





లేకపోయేసరికి 'వింటున్నావయ్యా?!' గొంతు రెట్టించింది.

"ఆ, వినబడ్తనేవుంది చెప్పరాదు?" అన్నడు వీరాజీ, విసుగు బయటికి కనబడకుండా.

"చెప్పేదేముంది! ఆ మున్సిపాలి టోళ్ళతో మాట్లాడి చెట్లు కొట్టించే పని సూడు. పైన కరెంటు వైర్లు, పెద్ద లైను కూడా పోతున్నది. ఎత్తుకు పెరిగిన పెద్ద చెట్లు. ఆషామాషీ కాదు. కరెంటోళ్లు రావాలి. మున్సిపాలిటోళ్లు రావాలి. మనం ఒక్క చేతి మీద కూలోల్లకు చెప్పి చేసే పని కాదు" అని పని కాస్త మెడకంటగట్టింది రాణిబాయి.

చిక్కువడ్డ చాంతాడులా సమస్య వుండేసరికి చిరాకేసింది వీరాజీకి. "అడిగి చూస్త తీయరాదు?" అంటూ మాట దాటేసి బయటికెళ్లిపోయాడు.

వాళ్ళ మాటలిన్నపట్నుంచి బెంగవడ్డ మనసుతో సగం తను సచ్చింది. ఆకలి పూర్తిగా సచ్చి వూర్కుంది. తనకా వయసుపై బడింది. చెపితే వినే వారెవ్వరూ లేరు. "ఎప్పుడారి పోతానా!?"యని ఎదురు చూడటం తప్ప ఏముంది ఈ బతుక్కిక అనుకుంటూ సమాధానపడిపోతూనే వున్నది రాజమ్మ. అలా జీవితమంతా రాజీ పడుతూనే వస్తున్నది. రాళ్ళ మాదిరిగున్న ఇత్తడి గంగాళాలు ఇప్పుడేమవసరమని అమ్మేసినా గులుక్కుంటూ కూర్చుంది వినా చేసిందేమి లేదు. రాగి బిందెలు పాయె, ఇత్తడి బిందెలు పోయాయి. సెమ్మెలు పోయాయి. కంచు తలెలు మాయమయ్యాయి. "ఇప్పుడు వాటిని కొనే తాహత్తుందా!? అమ్మి తినడమంతా సులువా! మళ్ళీ కొనాలంటే". ఇంటి లచ్చిమంతా పోయినట్లనిపించే. ఇప్పుడేమో చెట్లమీదికి గాలి మళ్లింది. మనుషుల గాలి మళ్లింది. "మామ వేపచెట్ల గాలి ఆరోగ్యానికి మంచిదని సందు దొరికిన ప్రతిసారి చెప్పేటోడు. తెల్లారితే వేప్పుల్ల తోటి పళ్ళు తోముకునేటోడు. మేము పొట్టు పొయ్యిల నుంచి కాలిన పిడకల బూడిద తీసి తోముకునేది. కట్టెల బూడిద అంట్లు తోముడుకయ్యేది. ఈ కాలం మాదిరి పళ్ళ పొడులు, పేస్టులు ఎక్కడివి. అంట్లుతోమే పొడర్లు, సబ్బులెక్కడివి?" కలికాలం, పొయ్యేకాలం కాకపోతే!. చెట్ల గాలి సోకి మేము బాగానే ఉంటిమి. ఇగ ఈ చెట్లకే వచ్చింది ఆపతి. మనుషుల విషపు గాలి సోకుతుంది. నా పిల్లలతోబాటు పిల్లల్ని చూసుకున్నట్లు చూసుకున్న. కడుపుల పుట్టిన కొడుకులకన్నా ఎక్కువ. కన్నపేగులా ధైర్యం ఇచ్చేవి కదా ఈ వేప మాన్లు. ఉగాది, బోనాల పండక్కి ఆసరా అన్నట్లు నిలిచేవా! పిల్లలకు అమ్మోరు పోస్తే వేప మండలు, దోమల పోరు ఎక్కువై యాష్ట పెడితే వేపాకు కాల్చి పొగ వేసేదాన్ని. వేపకాయలు సేర్ల కొద్దీ పోగు చేసి అణా బేడకు అమ్ముకునేదాన్ని. అట్లొచ్చిన పైకం కూడా ఎచ్చాల కనీ, పిల్లల చిరుతిండ్ల కనీ సంసారానికే పెట్టేది. కొడుకులు పెద్దమనుషులై మనుమరాళ్లు, మనవళ్ళొచ్చేసరికి వేపచెట్లు చేపుకొచ్చి కల్లుబొట్టు ఊట పొయ్యసాగినయి. గౌండ్ల లింగయ్య చెట్లెక్కి లొట్టి కట్టి వదిలేసేటోడు. వారం పది రోజులకోసారి లొట్టి దింపి పోతే వాడకట్టు జనాలకు ఓ వింత. వేపచెట్టేంది, కళ్ళు పోయడమేందాయని ఇచ్చంత్రం పోయేటోళ్లు. వేపకల్లు చేదు విషం. సక్కెర వేసి రెండు మూడ్రోజులు పులియబెట్టి తాగేది ఒంటికి మంచిదని. వాడ కట్టోళ్ళంతా అడుక్కుపోయే వారు. పిల్లా పెద్ద తేడా లేకుండా దవఖాన మందులాగ తాగెటోల్లు. చెట్లు కొట్టేస్తరన్న మాటలు విని కాలేజి చదువులవున్న మనవడికి చెపితి.

"ఏందిరా శంకర్! మీ అమ్మ చెట్లు కొట్టేసే పని పెడుతుందేమిరా! అవుంటే నష్టమేమొచ్చే?! అవేమైన అడ్డొచ్చినయా? బరువైతున్నయా ఎవరికైనా? ఇంటికి నీడ పట్టి చల్లగానే వుంచే. సర్కారే చెట్లు నాటాలని చెప్తావుంటే మనం వున్న చెట్లను నరికేస్తే ఎట్లరా!? తాతల కాలం నాటివి. ఎన్ని యాది ముచ్చట్లు అంటిపెట్టుకొని వున్నయి" అని అడిగింది రాజమ్మ.

"నన్నడుగుతవేంది! నాకేం తెలుసని. ఐనా చెట్లు ముసలివైపోయినై, ఇంకెందుకు. డెబ్బై ఏళ్లకు పైబడ్డయంట గదా చెట్లకు. గాలి దుమారం గట్టిగ కొడితే కూలి ఇంటిమీద పడేట్లున్నాయి. ముందే పాత గోడలు. ఇప్పుడప్పుడన్నట్లున్నాయి. మంచిదే గదా కొట్టేస్తే. నరికిన కొమ్మల తోటి చెక్కలు కోయించొచ్చు. ఇంకేదానికైనా వాడుకోవచ్చు. చెట్లు చూడు ఎట్లా ఇంటి వైపు బంగళా కప్పు మీదికి వాలిపోయి ఉన్నయో!" అని సర్రున బయటికెళ్లి పోయిండు శంకర్.

రోజులాగే తెల్లారింది. కానీ ఆ రోజు ఇంటిముందు హడావుడి వింతగా తోచింది. పదిమంది జమయ్యారు. కొందరి చేతిలో గొడ్డళ్లు, కొడవళ్లు

వున్నాయి. కరెంటు వాళ్లేమో "పవర్ లైన్ కట్ చెయ్, పవర్ లైన్ కట్ చేయ్" అని ఒకడు అరుస్తున్నడు. ఒకడు కరెంటు స్తంభం ఎక్కి తన పని తాను చేసుకుపోతున్నడు. చిన్నపాటి క్రేన్ మున్సిపాలిటి వాళ్ళది వచ్చి నిల్చున్నది, ఎత్తు పైన వున్న కొమ్మలను విరిచి పట్టడానికి. చెట్లు నరికే కార్యక్రమం మొదలైంది. "రాజమ్మవ్వ ఇంటరుగు మీది చెట్లు కూలగొడుతున్నారంటూ" పిల్లలంతా సందడి చేస్తూ తమాషాలా చూస్తున్నారు. వాళ్లకు సరదాగ వుంది. కొడుకు, కోడలు, మనవళ్ళు అందరి ముఖాలు వికసించినట్లున్నయి. ఎవ్వరికీ ఎక్కడా ఏ కోశానా బాధ కనిపించలేదు. "తనకెందుకు బాధ మరి. తన గుండె కెందుకింత ఆరాటం. రేపో మాపో ఈ చెట్టు కూడ కూలిపోతది. అప్పుడూ ఎవరికీ ఏమి పట్టదేమో?! అవ్ మరి, ఈ చెట్టు కూడ ముసలిదై పాయె. ఒక్కొక్కటి అన్నీ కళ్ళ ముందే కూలిపోయినయ్. బతుకు పంచుకున్న మనిషి పాయె. కడుపున పుట్టిన ముగ్గురు బిడ్డలు పోయిరి. ఉన్నోళ్లు దూరం పెట్టి చూస్తుండ్రి. చేసిన సంసారం రూపమే మారిపాయె. చుట్టర్కాలు మారిపోయాయి. పలకరించేటోళ్లు కరువైపోయిరి. అంతెందుకు ఇంతకాలం సంసారం చేసి నాదనుకున్న నా ఇల్లు పరాయిదానిలా కనబడుతుంది. మనుషులు అంటీముట్టనట్లున్నరు. చివరికి ఏం మిగిలింది" రాజమ్మ గొణుక్కుంటున్నది. అంతా శూన్యమేనన్న తలంపు. రాజమ్మ గుండె బరువెక్కింది. కడుపుల పేగులు సన్నగా వణకబట్టినయి. "గీ చెట్ల సోపతైనా తను పోయేదాక వుంటాయేమోననుకుంటి. అవి నాకంటే ముందే కూలి పోతున్నయి".

"చెట్లు కొట్టించొద్దు బిడ్డా అనీ ఎంత పోరు పెడ్తి. ఎవ్వరూ చెవిన పెట్టక పోయిరి కదా! నేనే లెక్కలోకి రాకుండపోతి మావోళ్లకి. నా మాటొక లెక్కనా!" ఒక బరువైన నిట్టూర్పు విడిచింది రాజమ్మ.

జరుగుతున్న తతంగం సాగిపోతూనేవుంది. ఎవరి పనివాళ్ళు వంతుల వారీగా చేస్కుంటూ పోతున్రు. పై నున్న చిన్న కొమ్మలనుంచి నరికేసుకుంటూ వస్తుండ్రు. చెట్ల కొమ్మలన్నీ విరిగి కింద పడ్తున్నయి. మధ్యాహ్నం దాటింది. అరుగు మీదికొచ్చిన రాజమ్మ తల పైకెత్తి చూసింది. సూర్యుడు సూటిగా మొహానికి కొడ్తున్నడు. ఎండ చుర్రుమంటున్నది. అరుగు మీద నీడ శాశ్వతంగా మాయమైంది. మళ్ళీ చాలా కాలానికి మామ యాదిలకొచ్చిండు. లావుపాటి చెట్ల మొండెం మిగిలింది. పూరాగ చెట్లను చూస్తే నెత్తి విరబోసుకున్న అమ్మోరు నెత్తి లేకుండావుంటే ఎలా ఉంటుందో అలా వున్నయి వేపచెట్లు. ఇల్లు, ఇంటిముందు అరుగు వికారంగ కనబడ్డది. తల, చేతులు నరికిన మనుషుల్లా వేపచెట్లు విలవిల్లాడుతున్నట్లున్నాయి. ఏళ్ళ తరబడి వున్న సంబంధం మరికొన్ని గంటల్లో సమాప్తమవబోతుంది. పొద్దుగూకు తుండగా ఓ ట్రాక్టరు వచ్చింది. అందులో మెషీను వుంది. చెట్ల లావుపాటి మొదళ్ళు నరికే మెషినట. సర్రు సర్రున మూడు ముక్కలుగా నరికేసింది. అంతా చదునయ్యింది. అక్కడ రెండు వేప చెట్లుండే యన్న ఆనవాళ్లను మాత్రం వదిలి మిగతా వాటిని ట్రాక్టరులోకి ఎత్తించి తీసికెళ్ళిపోయారు. చీకటిపడేలోగా చరిత్ర ముగిసిపోయింది. అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పెద్ద విజయాన్ని సాధించిన ఆనందం వాళ్ళ ముఖాల్లో కనబడింది. మొద్దులన్నీ కట్టెలమండికి కోతకు పోయినయి. వయసుడిగిన పశువులు కబేళాకు తరలించినట్లు. ఇంటిముందు శవం లేచినట్లు విషాదం, వైరాగ్యం రాజమ్మను చుట్టుముట్టాయి. చీకటి పడింది. అరుగు బరిబత్తలయినట్లు ఆకాశం చుక్కలదుప్పటి కప్పింది. గాడ్పు సెగకు అరుగు మేల్కొనే వుండగా వాడకట్టు నిద్దరోయింది. తెల్లారే సమయం, నిద్దరోయిన రాజమ్మ కప్పుకున్న పాత దుప్పటి, పైట కాస్త గాలికి పక్కకు జరిగిపోయినా సోయి లేకుండా పడుంది.

"అయ్యో ! ముసల్ది సచ్చిపోయిందంట?! నిన్నటి దాక మాట, చూపు బాగుండి తిరుగులాడుతనే వుండే పాపం!" వాడకట్టు ఆడోళ్ళంతా చేరి గుసగుసలు పోసాగిన్రు. పెద్దప్రాణం. చివరిచూపుకు ఇరుగుపొరుగు చేరి తలో మాట, సానుభూతి పలుకుతుండ్రు. అరుగు మీద నీడ కోసం మొదటిసారిగా షామియాన నిలబెట్టిండ్రు. ఎండ సెగ పెరగ సాగింది.

"బయట అరుగు మీదకు తెండి. చెయ్యాల్సిన కార్యక్రమాలున్నాయి. ఆలస్యమవుతోంది.." నలుగురు పెద్ద మనుషులు ఆదేశాలు జారీ చేశారు.

"రావలసిన వాళ్లంతా వచ్చిన్రు గదా, ఇంకా ఆలశ్యం దేనికి.." మరికొంత మంది వంత పాడారు.

"దగ్గరి సోపతులింకేమైనా వున్నయా రావాల్సింది"-కొందరు ఆరా తీసిన్రు.

అంతిమ కార్యక్రమాలకు కదలిక మొదలయ్యింది. వంతులవారీగా ఎవరు చేయాల్సిన పనులు వారి ద్వారా జరుగుతూనే వున్నాయి. డెబ్భైయేళ్ల అనుబంధం కలిగి ఎన్ని శుభకార్యాలకు, ఎన్ని కర్మ కాండలకు, ఎన్ని సంఘటనలకు రాజమ్మకు తోడుగా నిలిచిన సాక్ష్యాలు, ఈ రోజు రాజమ్మ చివరి స్నానానికి అరుగు వాడి పట్టినా ముసల్దాని శవానికి మాత్రం సాక్ష్యంగా ఆత్మలాంటి వేపచెట్లు లేవు.

**చిన్నపాటి క్రేన్ మున్సిపాలిటి వాళ్ళది వచ్చి నిల్చున్నది, ఎత్తు పైన వున్న కొమ్మలను విరిచి పట్టడానికి. చెట్లు నరికే కార్యక్రమం మొదలైంది. "రాజమ్మవ్వ ఇంటరుగు మీది చెట్లు కూలగొడుతున్నారంటూ" పిల్లలంతా సందడి చేస్తూ తమాషాలా చూస్తున్నారు. వాళ్లకు సరదాగ వుంది. కొడుకు, కోడలు, మనవళ్ళు అందరి ముఖాలు వికసించినట్లున్నయి.**

వ్యాసం

# తెలుగు సాహితీ సంపద సదాశివ

సదాశివ మరపురాని యాదిని పంచుతున్న వ్యాసం...



ఉదారి నారాయణ

తాము పుట్టిన మట్టికి, ప్రాంతానికి కొందరే కీర్తి ప్రతిష్టలు తెచ్చి పెడతారు. ఆ గడ్డకు ఖాండాంతరాలలో పేరు ప్రఖ్యాతులు వెదజల్లుతారు. అటువంటి వారు కొందరే ఉంటారు. ఆ కొందరిలో మన సాహితీ శిఖరం సంగీత మేరునగం సామల సదాశివ. ఆదిలాబాద్‌ను భారత దేశ పటంలో ప్రముఖ ప్రాంతంగా నిలబెట్టిన వారు వీరు.

సదాశివగారు మామూలు మనిషి మంచి ఉపాధ్యాయుడు. తెలుగు,ఉర్దూ, ఫార్శీ, మరాఠి తదితర భాషల్లో పాండిత్యం సంపాదించిన వాడు. తెలుగు సాహిత్యాన్ని సునిశితంగా చదవడం వల్ల ఇటు తెలుగు పాఠకులకు, ఉర్దూ, మరాఠి, ఫారసి సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించడం వల్ల అటు వారితోను, సన్నిహితుడయ్యాడు. హిందుస్థానీ కర్ణాటక సంగీత విషయాలను పత్రికల్లో వ్యాసాలుగా రాస్తుండడం వల్ల సంగీత ప్రియులకూ దగ్గరయ్యాడు. అందుకే ఆదిలాబాద్‌లో ఆయన ఇల్లు ఏదో ఒక రంగానికి చెందిన వారితో సదాశివ ముచ్చటించడం తాను మరణించేవరకు జరిగాయి.

ఉదయాన్నే లేచి ఐదారు దినపత్రికలు చదవడం, మధ్యాహ్నం వరకు తన దగ్గరికి వచ్చిన వారితో కబుర్లు చెప్పుకోవడం, మళ్ళీ సాయంత్రం ఒక పుస్తకం చేతిలో ఉండడం పక్కనే అతని వయసంతటి రేడియోలో కమ్మని హిందుస్థాని సంగీత స్వరాలు వినడం అతనున్నంత వరకూ జరిగాయి.

ఎక్కడెక్కడి నుంచో అతని దగ్గరికి వచ్చి సంగీత సాహిత్య విషయాలను

**సంగీత సాహిత్య రంగాలలో విశేషమైన కృషి చేసినందుకు గాను సదాశివను రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు నిచ్చి గౌరవించింది. తెలుగు విశ్వవిద్యాలయం, కాకతీయ యూనివర్శిటిలు గౌరవ డాక్టరేటును ఇచ్చి ఘనంగా సత్కరించాయి. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సదాశివకు "రాజీవ్ ప్రతిభా పురస్కారానిచ్చి అభినందించింది.**

ముచ్చటించుకునే వాళ్ళు. కవులు, రచయితలు తమ కవితల్ని, రచనల్ని చూయించడానికి, ముందు మాట రాయించుకోవడానికి వస్తుండేవారు. నిర్మొహమాటంగా, సున్నితంగా చక్కని సలహాలిచ్చేవాడు.

అప్పుడప్పుడు నా కవితల్ని సదాశివ గారికి చూయించే వాణ్ణి. ఈ వాక్యం మళ్ళీ చదువు? ఇది బాగుంది. ఇది బాగా లేదని చెప్పేవాడు. అన్యభాషల (ఉర్దూ, ఫారసి) ప్రభావం వల్ల సులభమైన భాషను లోతైన భావాన్ని ఇష్టపడేవారు. "కవిత రాయడం ముఖ్యం కాదయ్యా! రాసిన దాంట్లోంచి ఏది తీసివేయాలో తెలిసిన వాడే గొప్ప కవి అవుతాడని" అనేవాడు.

ఎవరైనా పద్యం రాసి వినిపిస్తే వెంటనే దానిలోని దోషాన్ని చూయించేవాడు. "పద్యంలో కవిత్వం చెప్పగలిగితేనే పద్యం రాయాలి. అయినా ఇప్పుడు పద్యం ఎవరు రాస్తున్నారు. రాస్తున్న కొందరి లాగా మనం రాస్తామా! రాస్తున్న దాన్ని ఎందరు చదువుతున్నారయ్యా! చక్కగా వచన కవితనో, కథనో, నవలనో రాయొచ్చు గదా"ని ముక్కు సూటిగా అనేవాడు. ఆ సూటిపోటి సలహాలే కొందరిని అతనికి దూరం చేశాయి. అతడు ముచ్చట్లు మొదలు పెడితే కాలమే భయపడి పోయేది. మధ్య మధ్యలో సందర్భోచితంగా ఎక్కడెక్కడి కవితా పంక్తులనో, దోహానో వినిపిస్తూ సాహితీ వాతావరణాన్ని మరింత రసమయం చేసేవాడు.

ఏ పత్రికలోనైనా గురజాడ గురించో, కందుకూరి గురించో, శ్రీశ్రీ గురించో వ్యాసం వస్తే' ఎందుకయ్యా ఇంకా వీరినే ఆకాశానికెత్తడం ఇటువంటి గొప్ప వారి గురించి టన్నుల కొద్దీ పుస్తకాలొచ్చాయి. అదే యువకవుల్ని, రచయితన్ని ప్రోత్సాహిస్తే మరింత పదునెక్కు తారనేవాడు".

**సదాశివ సుమారు ఇరవై రెండు పుస్తకాలు రాసినా ఆయన "యాది" సదాశివగారికి ఇంటి పేరుగా ఖ్యాతిని తెచ్చి పెట్టింది. దీనిలో ఇతని జీవితానుభవాలు, జీవన సమరం, ప్రాంతేతరుల అవమానాలు వివక్ష, వాళ్ళలో కొందరి అభినందనలు అన్నిటినీ వినమ్రంగా చెప్పుకున్నాడు. ఈ యాది పుస్తకం తెలుగు వారి తరగని సంపద. సాహిత్యానికి అమూల్య నిధి. గిరిజన విప్లవ వీరుడు కొమురం భీం జీవిత చరిత్రను 1972 సం.లో 7వ తరగతి తెలుగు వాచకంలో మొట్టమొదటి సారిగా పాఠంగా రాసి పెట్టించాడు. ఈ విధంగా తన మాతృభూమి రుణం కొంత తీర్చుకున్నాడు. ఒక కవి రచయిత తన మట్టి రుణం తీర్చుకోవడానికి ఇంత కన్నా ఏమి కావాలి? తుమ్ భూల్ భీ యాద్ నహీకర్తే హెూగోయా! హమ్‌తో తుమ్హారే యాద్‌మే సబ్‌కుచ్ భులాదియా" నువ్వు పొరపాటున గూడా నన్ను జ్ఞాపకం చేయవు. నేనేమో నీ జ్ఞాపకాల్లో సమస్తం మరచి పోయాను" మనం పట్టించుకోని మరచిపోయిన విలువైన విషయాలను సదాశివ రసజ్ఞులకు అందించాడు.**

సదాశివరూపం సాంప్రదాయం, భావాలు మాత్రం ఆధునికం, సమకాలికం. ఏ రచయిత గురించైనా, కవి గురించైనా ప్రస్తావన వచ్చినప్పుడు అతని దీనస్థితిని గ్రహించి "బాబాలకు స్వాములకు చందాల పేరుతో లక్షలకు లక్షలు తగల బెడతారు. కానీ ఒక కవి పుస్తకం అచ్చు వేసుకోవడానికి పది రూపాయలు సహాయం చెయ్యడం ధైర్యం కాదని" బాధపడేవాడు. జి.కృష్ణ, కె.రామచంద్రమూర్తి, కృష్ణబాయి, చలసాని ప్రసాద్, వాకాటి పాండురంగారావు, పొత్తూరి వేంకటేశ్వర రావు తదితర కవులు రచయితలు మేధావులతో ఇతనికి గల సఖ్యతను బట్టి చూస్తే ఇతను ఆధునికుడని స్పష్టంగా తెలుస్తుంది. వేలూరి శివరామ శాస్త్రిని రోజూ ఏదో ఒక సందర్భంలో యాది చేసుకోవడం చూస్తే సదాశివకు శాస్త్రి గారంటె ఎంత అభిమానమో తెలుసుకోవచ్చు.

ఎవరైనా ప్రజానాయకుడు గాని, ప్రజల మనిషి గాని మరణిస్తే సదాశివ కంటికొలుకుల్లో రెండు కన్నీటి చుక్కలు విలవిల్లాడితే బాధగా రెండు వేళ్ళతో ఒత్తుకొని దు:ఖించేవాడు. అయినవాళ్ళకోసం జీవితాంతం దు:ఖించిన వారికి ఈ ముదిమి వయసులో కన్నీళ్ళెక్కడుంటాయి.

తెలుగు సాహిత్య

వాతావరణం కలుషితమైందని కొంత కాలం తెలుగు పాఠకులకు రాయడం మానేశాడు. ఉర్దూ, హిందీ పత్రికలకు రాస్తుండేవాడు. ముఖ్యంగా మరాఠి కవి కేశవవసంత్ గురించి, మీర్జా గాలిబ్ జీవితం, రచనల గురించి అమ్జద్ రుబాయిల అనువాదం ఇట్లా విలువైన వ్యాసాలెన్నో రాశాడు. హిందూస్థానీ సంగీత కారులైన పండిత్ జస్‌రాజ్, ఉస్తాద్ బడేగులామ్ అలీఖాన్ సాహెబ్, హీరా బాయి బరోడేకర్, కేసర్ బాయి కేర్కర్, అంజనీ బాయి ముల్పేకర్, బేగం అక్తర్‌ల సంగీత మాధుర్యాన్ని చెప్తుంటే చెట్టు కొమ్మలు లయాత్మకంగా ఊగుతుంటే దోసిలి నిండా పూల ముచ్చట్లను నింపుకోవడమే మనవంతు అన్నట్లుగా అతని కబుర్లు సాగేవి.

ఉర్దూ, ఫారసి సాహిత్యాలకు



సంబంధించి ఎన్నో వ్యాసాలు రాసి వాళ్ళకు ఎన్నో కొత్త విషయాలు తెలియజేసి ఇంత కృషి చేసినా ఉర్దూ భాషకు సంబంధించిన ఎటువంటి పురస్కారం రాకపోవడం ఆశ్చర్యం, విచారం కూడా!

సభలో ప్రసంగించినా, వాలు కుర్చీలో కూర్చోని ముచ్చటించినా మనముందు ముచ్చటాడుతున్నట్టు, సాహితీ వేత్తలెందరో మన ముందు ఉన్నట్లు అనిపించేది. తెలుగు పంచె, లాల్చీ, మెడలో రుద్రాక్ష మాలలతో సాదాసీదాగా ఉన్నట్లు అతని వాక్యము అంతే పొట్టిగా సాదా సీదాగా ఉంటుంది. భావం లోతు మాత్రం అనంతం. కాళోజీ సోదరులు గురించి ఒక చోట "బతికినంత కాలం బతికారు అంటాడు. అట్లాగే రావు బాల సరస్వతీ గారి గురించి రాస్తూ "ఆమె గొంతులో ఏదో ఉంది అంటాడు" సదాశివ గారి వచనంలో విలక్షణత అంటే ఇదే మరి.

సదాశివగారి వాక్యంలో క్రియా పదాలైన వచ్చినారు, పోయినారు, చేసింద్రు, చూసింద్రు అని ఉంటాయి. ఒక సారి నేను భయపడుతూ వచ్చారు, పోయారు అని రాయొచ్చు గదా సార్! అంటే అదే! ఇట్లా రాయొద్దా ! ఇట్లా రాస్తే తప్పా! నేను ఇట్లనే రాస్తా అని బదులిచ్చాడు. అంటే సదాశివ గారికి తెలంగాణా భాషా నుడికారం, పలుకు బళ్లంటే ఎంత ఇష్టమో తెలుసుకోవచ్చు.

తెలుగు టీచరుగా జీవితాన్ని ప్రారంభించి తన అభిరుచి మేరకు రచనా వ్యాసాంగాన్ని ఎంచు కున్నాడు. చివరి దాకా దానినే కొనసాగించాడు. తాను నడిచిన వీధుల్లో సాహిత్య సౌరభాలను ఏరుకున్నాడు. సంగీత మధురిమల్ని ఒంపుకున్నాడు. మొదట పద్య కవిత్వం 'రేవతి' నవల రాసినా సురవరం ప్రతాపరెడ్డి సలహా మేరకు అనువాద రంగాన్ని ఎంచుకున్నాడు. వివిధ భాషల్లోని మంచి సాహిత్యాన్ని అనువదించడం తన వ్యక్తిగతమే అయినా ఆయా భాషా, సాహిత్యాల సొగసుల్ని మాధుర్యాన్ని తెలుగు వారికి అందించడం మన భాగ్యమే.

సదాశివ సుమారు ఇరవై రెండు పుస్తకాలు రాసినా ఆయన "యాది" సదాశివగారికి ఇంటి పేరుగా ఖ్యాతిని తెచ్చి పెట్టింది. దీనిలో ఇతని జీవితానుభవాలు, జీవన సమరం, ప్రాంతే తరుల అవమానాలు వివక్ష, వాళ్ళలో కొందరి అభినందనలు అన్నిటినీ వినమ్రంగా చెప్పుకున్నాడు. ఈ యాది పుస్తకం తెలుగు వారి తరగని సంపద.

**సభలో ప్రసంగించినా, వాలు కుర్చీలో కూర్చోని ముచ్చటించినా మనముందు ముచ్చటాడు తున్నట్టు, సాహితీ వేత్తలెందరో మన ముందు ఉన్నట్లు అనిపించేది. తెలుగు పంచె, లాల్చీ, మెడలో రుద్రాక్ష మాలలతో సాదాసీదాగా ఉన్నట్లు అతని వాక్యము అంతే పొట్టిగా సాదా సీదాగా ఉంటుంది. భావం లోతు మాత్రం అనంతం. కాళోజీ సోదరులు గురించి ఒక చోట "బతికినంత కాలం బతికారు అంటాడు. అట్లాగే రావు బాల సరస్వతీ గారి గురించి రాస్తూ "ఆమె గొంతులో ఏదో ఉంది అంటాడు" సదాశివ గారి వచనంలో విలక్షణత అంటే ఇదే మరి.**

సాహిత్యానికి అమూల్య నిధి. గిరిజన విప్లవ వీరుడు కొమురం భీం జీవిత చరిత్రను 1972 సం.లో 7వ తరగతి తెలుగు వాచకంలో మొట్టమొదటి సారిగా పాఠంగా రాసి పెట్టించాడు. ఈ విధంగా తన మాతృభూమి రుణం కొంత తీర్చుకున్నాడు. ఒక కవి రచయిత తన మట్టి రుణం తీర్చుకోవడానికి ఇంత కన్నా




ఏమి కావాలి? తుమ్ భూల్ భీ యాద్ నహీకర్తే హెూగోయా! హమ్‌తో తుమ్హారే యాద్‌మే సబ్‌కుచ్ భులాదియా" నువ్వు పొరపాటున గూడా నన్ను జ్ఞాపకం చేయవు. నేనేమో నీ జ్ఞాపకాల్లో సమస్తం మరచి పోయాను" మనం పట్టించుకోని మరచిపోయిన విలువైన విషయాలను సదాశివ రసజ్ఞులకు అందించాడు. తన జీవితంలో ప్రతి క్షణాన్ని సౌందర్యాత్మకంగా మలుచుకొన్న రసజీవి. తనను సంపద వరించకున్నా ఎందరో మంది అభిమానుల్ని, మిత్రుల్ని సంపాదించుకున్న సాహితీ బంధువు.

సంగీత సాహిత్య రంగాలలో విశేషమైన కృషి చేసినందుకు గాను సదాశివను రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డు నిచ్చి గౌరవించింది. తెలుగు విశ్వవిద్యాలయం, కాకతీయ యూనివర్సిటీలు గౌరవ డాక్టరేటును ఇచ్చి ఘనంగా సత్కరించాయి. అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సదాశివకు "రాజీవ్ ప్రతిభా పురస్కారానిచ్చి అభినందించింది. కేంద్ర ప్రభుత్వం సదాశివకు తన 83వ యేట 2011 సంవత్సరమునకు "స్వరలయలు" పుస్తకానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును బహుకరించింది. సాహితీ దిగ్గజం సదాశివ ఆగస్టు 7, 2012న లోకాన్ని విడిచి వెళ్ళిపోయారు. తెలుగు సాహిత్యం ఒక అపురూపమైన వాక్యాన్ని కోల్పోయింది.

కవిత

# ఒంటరి ఎడారిలో

- పప్పుల రాజిరెడ్డి



చానా రోజులైంది వాళ్ళు మాతృదేశం విడిచి
గంటల కొద్ది ప్రయాణం చేసి
గాలివాహనంపై రానే వచ్చారు
పచ్చని మర్రి చెట్టుపై పక్షుల సందోహంలా యిల్లు
ఆత్మీయ ఆలింగనమై
చానాళ్ళ కలువలేని తనాన్ని గాలికి వొదిలి
సంతోషాల సంబరమయ్యారు
మా బిడ్డ, వారి పెనిమిటి, చిచ్చర పిడుగుల్లాంటి పిల్లలు

ఇప్పుడిల్లంతా అల్లరల్లరి ఆటలతో పాటలలో
కవ్వింపులతో, కయ్యాలతో, పంతాలతో, పట్టింపులతో
బొమ్మలతో చిందరవందర
చింపిన దిన పత్రికలతో అంగడంగడి ఆగమాగం
సగం రాసిన కాపీలు స్వేచ్ఛ గీసిన చిత్రాలు
పలకా బలపాలు తీరికలేని పిచ్చి గీతలు
తినుబండారాల ఆప్షన్, సాధకుల వ్యూహాలు
సెల్లు ముందుంటేనే బువ్వ తినటాలు అలగటాలు
ఆర్భాటాలు, తిక్క తిక్కవేషాలు
గోడలపై అర్థం కాని నైరూప్య చిత్రాలు
కలాల ముక్కలు, స్కెచ్ పెన్సిల్ వక్కలు
రంగులు రుద్దిన కాయిదాలు ఇస్కుడిస్కుడు
నెలరాజులు నెల రోజుల్ని ఐస్ క్రీంలా లాగించారు.

మళ్లీ పయనం దేశం గాని దేశం వీసా అల్లారం
సర్దుకోవాలి. కుదుటపడాలి సమాయాత్తమవ్వాలి
రంధిపడే మనసును కళ్లల్లో దాచుకోవాలి
అనివార్యమైన లవణ సముద్రం ఈదాలి
బంధాలను వదిలి బతుకు గమ్యం కోసం
భవిష్యత్తు కోసం పయనమవ్వాలి
కాలం వాకిట్లో హవాయి జహాజ్ ఎదురు చూపు
ఇల్లంతా నిశ్శబ్దం
మస్తిష్కంపై టన్నుల కొద్ది మౌనం బరువు
రెక్కలొచ్చి పక్షులు గూడొదలిన తర్వాత
యింట్లో ఇద్దరమే పేర్చిన పుస్తకాల షెల్ఫులు
టీపాయ్ కింద తేదీల వారీగా దినపత్రికలు క్యూ
చెక్కు చెదరని బొమ్మలు గూట్లో పటాలు మెమెంటోలు
యిస్త్రీ బట్టల్లా సోఫాలు కుర్చీలు

పిల్లలు లేని ఇల్లు పక్షులు లేని గూడు
కరంటు లేని వేసవి రాత్రి సెలవులున్న బడి
సెల్లు లేని రేడియో, కేబుల్ లేని టి.వి,
నిశ్శబ్ద విస్ఫోటనంలో గాయపడ్డ మనసు పెట్టలమై
వొంటరొంటరిగా మేం

# రాష్ట్ర సాధన కోసం వుసిళ్ళ పుట్టయి లేసిన పదాలు

**పసునూరి రవీందర్ సాహిత్య కృషిని మనకళ్ళకు కడుతున్న సందర్భం...**



అంబటి వెంకన్న

సమైక్య పాలన మీదనే కాకుండా, దళిత బహుజన దృక్పథంతో ప్రశ్నల కొడవల్లెత్తి ప్రతిధ్వనించిన ఈ పాటకు పదునెక్కువ. ఎర్ర జెండా నీడలో పురుడు పోసుకున్న ఈ మాటకు ఎదిరించే తత్వం ఎక్కువ. అందుకే ఈ పదం ఆదివాసీల ఆత్మ ఘోషకు అక్షరరూపం అయితది. అడవి బాట పట్టిన అన్నలకు ఆకలి తీర్చే అమ్మయితది. కన్నీళ్ళ ఆశల దీపమై కమ్యూనిస్టు సిద్ధాంతాలతో కలిసి నడిచిన పాటగాడు డాక్టర్ పసునూరి రవీందర్. అక్షరమే ఆయుధంగ వామపక్ష భావజాలంతో పెరిగి పెద్దోడు అయ్యిండు. బుద్ధుడు, పూలే, అంబేద్కర్ ఆలోచనా విధానంతో సామాజిక విప్లవాత్మక శక్తిగా అవతరించినాడు. పాట లోతుల్ని శోధించి పరిశోధకుడు అయ్యిండు. విద్యార్థి ఉద్యమ నాయకుడు అయ్యిండు. కవి, గాయకుడు, రచయిత, జర్నలిస్టు విమర్శకుడుగా బహుముఖ ప్రజ్ఞా పాటవాల తో బహుజన సామాజిక చైతన్యాన్ని పాదుగొలుపుతున్న కేంద్ర సాహిత్య యువపురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ ఈ ఫిబ్రవరి 21న ఎర్ర ఉపాలి మొదటి స్మారక అవార్డు అందుకుంటున్న సందర్భంగా రవిందర్ గురించి నాలుగు మాటలు.

గొప్ప చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ వారసత్వం ఉన్న వరంగల్ పట్టణం లోని రైల్వేస్టేషన్ పక్కనే గల శివనగర్ లో భిన్న సంస్కృతుల మేళవింపు తోపాటు విప్లవ భావజాలం కూడ మెండుగానే ఉంటది. అక్కడ బతుకే పోరాటం అయిన కాడ భారత కమ్యూనిస్టు పార్టీ జెండాను భుజానికి వేసుకుని బానిసత్వాన్ని ధిక్కరించి బతుకుతున్న నిరుపేద శ్రామిక కుటుంబమే పసునూరి వీరస్వామిది. వీరస్వామి - వరమ్మ దంపతులిద్దరూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసిండ్రు. దోపిడీ పీడన లేని సమాజ నిర్మాణం కోసం ఇంటినే పార్టీ కేంద్రంగా మార్చిండ్రు. వీరి పెద్ద కొడుకే డాక్టర్ పసునూరి రవీందర్ ఈయన 1980 జనవరి 8న శివ నగర్ లో జన్మించిండు. చిన్నప్పటి నుంచి తండ్రి అడుగుజాడల్లో పయనించిన రవీందర్ తండ్రితో పాటు మేడే ఉత్సవాలలో పాల్గొనడమే కాకుండ ఎర్రజెండా చేతపట్టి విప్లవ పాఠాలు నేర్చుకున్నడు. డప్పు దరువులకు చిందేసి ఆడడం, వేదికలెక్కి పాటలు పాడడం రవీందర్ కు వెన్నతో పెట్టిన విద్య అయింది. విప్లవోద్యమ స్ఫూర్తితో రవీందర్ ఇంటర్మీడియట్ చదివే రోజుల్లోనే పాటలు రాయడం మొదలు పెట్టిండు. తల్లి పాడే బతుకమ్మ పాటలు, జానపద గేయాల ప్రభావంతో అనేక పాటలు రాసిండు. క్రమంగా వామపక్ష ఉద్యమాల వైపు అడుగేసిండు. విప్లవోద్యమంలో అసువులు బాసిన అమరవీరులను స్మరిస్తూ

"అగ్గిపూలా వనము మన ఓరుగల్లో మన ఓరుగల్లు అమరులు యాదైతే మది తల్లడిల్లో మది తల్లడిల్లు" అంటూ వరంగల్లో ఘనతను వర్ణిస్తూ నే అమరవీరులను పేరుపేరునా పలకరిస్తడు. అమ్మల కడుపుకోతకు అక్షరరూపం అయితడు. అన్నార్తుల పేగు బంధమై అల్లుకుంటడు. రవీందర్ వరంగల్లో డిగ్రీ చేస్తున్న సమయంలో విద్యార్థి నాయకుడిగా అనేక ఉద్యమాలలో క్రియాశీలక పాత్రను పోషిస్తడు. అదే సమయంలో ప్రజానాట్యమండలి కళాకారుల పాటలకు ఆకర్షితుడై పాటలు రాసిండు. పసునూరి రవీందర్ స్నేహం విలువను చాటి చెప్పిన పాట విద్యార్థి లోకంలో ఒక సంచలనాన్ని సృష్టించింది. ఎంతోమంది అభిమానులను సంపాదించి పెట్టింది. ఈ క్రమంలోనే అంబేద్కర్ ఆలోచనా విధానంతో రవీందర్ ఉన్నత చదువుల మీద దృష్టి సాధించడమే కాకుండా తన ముగ్గురు తమ్ముళ్లు శ్రద్ధగా చదివేలా చేయగలిగిండు. అట్లా విద్యా దృక్పథాన్ని అలవర్చుకున్న రవీందర్

కాకతీయ విశ్వవిద్యాలయం నుండి తెలుగు లో గోల్డ్ మెడల్ సంపాదించిండు. అనంతరం 2000 సంవత్సరంలో రజితను వివాహం చేసుకొని ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిండు. సాహిత్యానికి అంజలి ఘటించిన పసునూరి రవీందర్ మార్క్సిజమా, అంబేద్కరిజమా అనే సంఘర్షణలో నుంచి సత్యాన్వేషణ చేసి ఆఖరికి బహుజన దృక్పథమే సరైనదని, అంబేద్కర్ సిద్ధాంతం లోనే అన్నీ ఉ న్నాయని సూత్రీకరిస్తడు. ఈ నేలకు అంబేద్కరిజం తప్ప ఇంకా ఏమీ అవసరం లేదని ప్రకటిస్తడు. అదే ప్రచారం చేస్తడు. కథలు, కవితలు, వ్యాసాలు, ప్రసంగాల ద్వారా తన భావజాలాన్ని బలంగ వ్యక్తం చేస్తడు. పసునూరి రవీందర్ హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో



"ప్రపంచీకరణ నేపథ్యంలో తెలుగు సాహిత్య విమర్శ" అనే అంశం మీద ఎం.ఫిల్ చేయడంతోపాటు "తెలంగాణ ఉద్యమ పాట" మీద పి.హెచ్.డి. పూర్తి చేసిండు. అనంతరం అదే విశ్వ విద్యాలయంలో పిడిఎఫ్ కూడా పూర్తి చేసిండు. దేశంలోని అనేక ప్రాంతాల విద్యార్థులు చదువుకునే హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో తెలంగాణ ఉ ద్యమానికి మద్దతు కూడగడతడు. రాష్ట్ర ఆకాంక్షతో ప్రత్యక్ష ఉద్యమంలో భాగస్వామిగా మారుతడు. ప్రజా కవులు పాటలను గొంతెత్తి పాడి సభలను విజయవంతం చేయడమే కాకుండా పసునూరి రవీందర్ తాను స్వయంగా ఎన్నో పాటలు రాసిండు. ఆయన రాసిన

"ఊరు వాడ ఒక్కటై ఉద్యమించి రన్నో జై కొట్టి తెలంగాణ

మెల్ల మెల్లగా పోరు ఢిల్లీ చేరిందన్నో జై కొట్టి తెలంగాణ"

అన్న పాట ఖండాంతరాలను దాటిపోయింది. సెల్ ఫోన్‌లలో రింగ్ టోన్ గా ప్రతిధ్వనించింది. 2010లో వచ్చిన ఈ పాట ఉ ద్యమాన్ని ఉగ్రూత లూగించింది. పసునూరి రవీందర్ రాసిన పాటలు "భూమికోసం, అగ్గి పూలవనం, ఊర్లకు నీళ్లంటుకున్నయి, జై కొట్టు తెలంగాణ వంటి పాటల సీడిలలో చోటుచేసుకున్నయి. డాక్టర్ పసునూరి రవీందర్ హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టిన సమయంలో తాను రాసిన దీర్ఘకవితను "లడాయి" అనే సంకలనంగా ప్రచురించినాడు. సింగిడి తెలంగాణ రచయితల వేదిక కన్వీనర్‌గా పనిచేసిన పసునూరి రవీందర్ విశ్వవిద్యాలయానికి అనేక మంది కవులను ఆహ్వానించి కవిత్వము, పాటలను రికార్డు చేసే కార్యక్రమాన్ని ప్రొఫెసర్ జయశంకర్ సార్, ప్రొఫెసర్

**గొప్ప చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ వారసత్వం ఉన్న వరంగల్ పట్టణం లోని రైల్వేస్టేషన్ పక్కనే గల శివనగర్ లో భిన్న సంస్కృతుల మేళవింపు తోపాటు విప్లవ భావజాలం కూడ మెండుగానే ఉంటది. అక్కడ బతుకే పోరాటం అయిన కాడ భారత కమ్యూనిస్టు పార్టీ జెండాను భుజానికి వేసుకుని బానిసత్వాన్ని ధిక్కరించి బతుకుతున్న నిరుపేద శ్రామిక కుటుంబమే పసునూరి వీరస్వామిది. వీరస్వామి - వరమ్మ దంపతులిద్దరూ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేసేంద్రు.**

కోమురన్నలతో కలిసి నిర్వహించినాడు. ఈ సందర్భంగా అనేక సంకలనాలకు సహాయ సంపాదకుడిగా పని చేసినాడు. తన సంపాదకత్వంలో "మాదిగ పొద్దు" సంకలనాన్ని వెలువరించినాడు. రాష్ట్రం ఆవిర్భవించిన తొలినాళ్ళలో డాక్టర్ పసునూరి రవీందర్ వెలువరించిన కథాసంకలనం "అవుట్ ఆఫ్ కవరేజ్ ఏరియా"కు 2015 కేంద్ర సాహిత్య యువ పురస్కారం లభించింది. ఇదే కాకుండా పసునూరి రవీందర్ రాసిన కథలు ఇంగ్లీష్, హిందీ, కన్నడ భాషల్లోకి అనువాదం చేయబడినవి. పసునూరి రవీందర్ సిద్ధాంత గ్రంథానికి గాను తెలంగాణ ఎన్నారై అసోసియేషన్ వారు సురవరం ప్రతాపరెడ్డి అవార్డును ప్రధానం చేసినారు. అదేవిధంగా యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ వారు జాషువా అవార్డును ప్రధానం చేసినారు. ఎన్నో అవార్డులు, రివార్డులు సొంతం చేసుకున్న డాక్టర్ పసునూరి రవీందర్ ఈనాడు దళిత కవి ఎర్ర ఉపాలి మొట్టమొదటి స్మారక అవార్డును అందుకుంటున్న సందర్భంగా పసునూరి రవీందర్‌కు శుభాకాంక్షలు. జయహో డాక్టర్ పసునూరి రవీందర్.

సమాజం

# నాటి కథలలో తెలంగాణ (1950-60)

**అప్పటి తెలంగాణ సమాజిక స్థితిని అన్యాప దేశంగా...**



కాంచనపల్లి గో.రా.

ఎం.ఎ. వెల్లోడి ముఖ్య మంత్రిగా తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంగా ఏర్పడ్డ కాలమది. 1952లో హైదరాబాద్‌లో మొదటి ఎన్నికలు జరిగాయి. నవంబర్ 1, 1956లో ఆంధ్రప్రదేశ్ కలిపి సంయుక్త రాష్ట్రంగా ఏర్పడింది. ఇలాంటి రాజకీయ పరిణామాలు జరిగిన కాలంలోనే వచ్చిన సాహిత్యం ఆ కాలాన్ని ప్రతిఫలించడం అనివార్యం. అంతకంటే కొంత కాలం ముందు జరిగిన రజాకార్ల ఉదంతం లాంటి రాజకీయ పరిస్థితులు, తరువాత హైదరాబాద్‌పైన జరిగిన పోలీస్ యాక్షన్, తరువాతి పరిస్థితులు ఈ కథలలో కనిపిస్తాయి.

1948 ప్రాంతంలో రాసిన నెల్లూరు కేశవస్వామి యుగాంతం ఈ స్థితిని ప్రతిఫలించింది. హైదరాబాద్ భారత్ యూనియన్‌లో విలీనం జరిగాక ముస్లింల భయం, ఉద్విగ్నత, కథలో బలంగా చిత్రించారు. కానీ ఈ పరిస్థితిలో కూడా ఒక హిందూ యువకుడు ఒక రజాకార్ ముస్లిం యువకునితో స్నేహం మానవత్వానికి ఒక మచ్చు తునక.

తెలంగాణలో నిరుపేద కుటుంబాలలో అసఫ్ జాహీల కాలంలో నిలువరించలేని చీకట్లు ఉన్నాయి. భూస్వాముల క్రౌర్యం వల్ల, జైలు పాలైన నిస్సహాయ జీవితాలున్నాయి. అలాంటి ఒక దైన్యాన్ని చిత్రించిన కథ వట్టికోట ఆళ్వారు స్వామి "పరిగె" (1952). ఒక పూట గింజలు తెద్దామని ప్రయత్నించిన మల్లయ్య భూస్వామి శిక్షకు గురై, చివరికి చట్టం దృష్టిలో కూడా నేరస్థుడై జైలు పాలైన కథ ఇది.

మనిషిలో సహజంగా ఉన్నదానికి లేనిదానికి కూడా తన ఊహను కలిపి చిలువలు పలువలు చేసే లక్షణం ఉంటుంది. అసలు విషయం తెలిసాక తామెంత అవివేకంగా ఆలోచించామో తెలిస్తే సిగ్గు కలుగుతుంది. అట్లాంటి వైనాన్ని తెలిపే కథే (1950) మురళి రాసిన "అదిగో పులి, ఇదిగో తోక".

విషాదాంతాలు భారతీయ సాహిత్యంలో చాలా తక్కువ. ఇది అమంగళం అనే లాక్షణిక శాసనం కూడా ఉంది. కాని కథ ఏనాడో దీన్ని అధిగమించింది. యశోదారెడ్డి (1951)లో రాసిన "విచ్చిన తామరలు" ఇందుకు ఉదాహరణ. పేదవాళ్ళ అమ్మాయికి ధనవంతుల అబ్బాయితో ప్రణయం. ఆ అమ్మాయి దీని వల్ల తన తండ్రి బాధ పడతాడని ఊహించి ఆత్మహత్య చేసుకోవడం ఇందులో కథనం.

మధ్య మధ్య సంభాషణలతో కథ నాటకీయంగా ఉంటుంది. కమలాకరుడు అని ప్రథమా విభక్త్యాంతంగా ఉన్న పేర్లు కొన్ని బెంగాలీ నవలలకు తెలుగు అనువాదం స్ఫురింపిస్తాయి. "పదహారు సంవత్సరాల కిశోరి" లాంటి పదాలు శైలికి ఒక విలక్షణత్వం తెచ్చాయి.

"ఎలక్షన్ హడావిడి" సి.హెచ్. రాజేశ్వర రావు, (1952) కథలో స్టాండై, ఎక్స్‌పెక్ట్ చేయడం లాంటి కృత్రిమంగా ప్రయోగించిన ఆంగ్ల పదాలు కనబడతాయి. అట్లాగే క్లయింట్ లాంటి అనివార్య పద ప్రయోగాలు కూడా ఉన్నాయి. నాటి జమీందారులకు ప్రజలు బుద్ధి చెప్పడం, అదే సమయంలో జమీందారీ ఎస్టేటులన్నీ భారత యూనియన్‌లో కలిసిపోయి, వాళ్ళ సాంప్రదాయాధికారానికి స్వస్తి వాచకం ఇందులోని అంశం. మధ్య తరగతి జీవితం అప్పులమయం. ఎక్స్‌ప్లాయిటేషన్ వాళ్ళకు నిత్యానుభవం. అటువంటి ఒక దైన్య మధ్య తరగతి ఉద్యోగి కథే పి.యస్.ఆర్. ఆంజనేయ శాస్త్రి ఎక్స్‌ప్లయిటేషన్, (1953) కథ.

గూడూరి శంకరం పాపాయి కథ (1953) ఒక ఏకపాత్రాభినయం లాగా సాగుతుంది. చిరు పాపాయిలో నిర్మలత్వం ఆవిష్కరించడం ఈ కథలో ముఖ్యాంశం.

స్నేహం అపూర్వమైనది. ఏ కాలంలో నైనా స్నేహబంధానికి ఉన్న విలువ అపారం. కె.లింగరాజు "తిల్లానా" కథలో (1953) కళా హృదయం కలిగిన హిందూ ముస్లిం స్నేహాన్ని చిత్రించాడు. నాటి కుపిత సమాజాన్ని శాంతి హితం చేయడానికి సాహిత్యం ఒక సాధనం అని ఈ కథ మరోసారి నిరూపించింది.

**ఇల్లిందుల సరస్వతీ దేవి కథ కాని కాలం వస్తే కూడా నాటి హైదరాబాద్ రాజ్య పరిస్థితిని చిత్రించిందే. నవాబ్ వంశానికి చెందినా ఓ ముస్లిం కుటుంబం నాటి పోలీస్ యాక్షన్ తరువాత ఎట్లా చెల్లా చెదురైందో హృదయ ద్రావకంగా వర్ణించింది రచయిత్రి. ఈ విధంగా కథలన్నింటిలోనూ నాటి రాజకీయ సామాజిక పరిస్థితులు అన్యాపదేశంగా చిత్రించబడ్డాయి. గ్రాంథిక భాషతో మొదలైన కథ క్రమంగా పరిణామం చెందింది. తెలంగాణ తనను తాను తడుముకుంటున్న వేళ తెలంగాణ ఆత్మవిశ్వాసాన్ని, అస్తిత్వాన్ని ప్రకటించిన కథలు ఇవి. దీనికి కారణమైన సంకలన కర్తలు ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్. వీళ్ళ కృషి మిగుల అభినందనీయం.**

కథా సంవిధానంలో చక్కని కవిత్వం జాలువారుతుంటుంది" కణం కణం నరం నరం ఉప్పొంగి ఉన్న ఆ ఆరాధనలో గళం కుంటుపడింది. అమరంలోని కోశాలు అవి. కన్నతల్లికి నవరత్నాల నివాళి. అయినా జీవచ్ఛవమైన జరాభారం కాందిశీకి లాగే ఉండిపోయింది."

కుటుంబ జీవితంలో పురుష దౌష్ట్యం నాటి నుండి కొనసాగుతున్నదే. అట్లాంటి ఒక భర్త లేక తండ్రిని చిత్రించిన కథ జీవిత గతి (1953). కుటుంబం చీకటి నేపథ్యం వల్ల మనిషి ఎంత దిగజారుతున్నాడో ఈ కథ వల్ల తెలుస్తుంది. నాటి తెలంగాణలో విస్తరించిన దుఃఖాన్ని మరో కోణంలో చిత్రించిన కథ ఇది.

'పెద్దోల్ల కథ'లో ఒక సభానిర్వహణ కోసం కూలీగా పోయిన మల్లయ్యకు పటేల్ కులదర్పం బాధ పెడుతుంది. తన ఊరి పటేల్ కూడా ఆ సభకు ప్రేక్షకుడుగా వస్తాడు. కాని నల్లబట్టల మల్లయ్యను పలకరించడు. ఒక సామాజిక అంతరం గ్రామాల్లో ఎట్లా ఉందో చెప్పేకథ సురమౌళి "అంగుడు పొద్దు" (1954).

అస్పృశ్యతా నివారణ గురించి గొప్ప ఉపన్యాసాలు చెప్పేవారు ఈ రోజు వరకూ ఉన్నారు. అంతేకాక వేదిక మీద గొప్ప ఆదర్శాలు చెప్పి ఇంట్లో మాత్రం పరమ మూర్ఖులుగా వ్యవహరించే వాళ్లకు తక్కువేమీ లేదు. భారత దేశంలో సాధారణంగా ఒక వ్యక్తి సమాజంలో ఒక రకంగా, కుటుంబంలో ఒక రకంగా ఉండే వైరుధ్యాన్ని చూస్తాం. అట్లాంటి వైరుధ్యాన్ని చిత్రించిన కథ జి. చంద్రమౌళి, "ప్రజా నాయకుడు పరంధామయ్య (1954)".

పరంధామయ్య అనే వ్యక్తి హరికథలు, బుర్రకథలు చివరికి ఉపన్యాసాలు చెప్పి తన జీవితాన్ని అస్పృశ్యత నివారించడానికే అంకితం చేశానని వేదికల మీద చెబుతాడు. ఇంట్లో కన్న కూతురు హరిజనులతో ఆడుకుంటే ఆమెని శిక్షిస్తాడు. ఇట్లాంటి ద్వంద్వ వ్యక్తిత్వం బలంగా చిత్రించాడు ఈ కథలో. 1954లోనే వచ్చిన కే.సరోజిని "తీరని బాధ"లో పురుషుని పేరుతో స్త్రీ రాసిన ఉత్తరాలు చదివి ఆమెనే శంకించి చంపిన దయ లేని భర్త కథ.

నాటి హైదరాబాద్ విమోచనోద్యమ కాలంలో ఉద్యమానంతర కాలంలోనూ స్వార్థ రాజకీయాలు చేసిన వారు ధనికులుగా నాయకులుగా మారారు. కొందరు మాత్రం కేవలం సేవా భావంతో పని చేసి సర్వస్వం కోల్పోయారు. దేశ సేవకుడు (1955) కథలో. ఇరివెంటి కృష్ణ మూర్తి "రంగుల లింగయ్య" చమత్కారంగా కొనసాగుతుంది. రైలు ప్రయాణాన్ని గురించి చెబుతున్న ఓ పల్లెటూరి మనిషి భాషణంలో తన అనుభవం ఇక్కడ గమనించదగింది. మొత్తం విషయాన్ని చలన చిత్రం లాగా మన ముందు పెడతాడు రచయిత.

నేర ప్రవృత్తి మనిషిని దహించి వేస్తుంది. నిష్కల్మషమైన హృదయం కలవాళ్ళు సంతోషంగా ఉంటారు. ఈ వ్యక్తిత్వాన్ని చిత్రించిన కథ చక్రవర్తి రంగస్వామి (1956) "నిజమైన మనుషులు".

పరుపులు కుట్టే వ్యక్తికి యాదృచ్ఛికంగా పాత పరుపులో దాచిన డబ్బు దొరికితే మొదట తానే తీసుకుందామనుకున్నా, తరువాత ఆత్మవిమర్శ చేసుకొని ఆ డబ్బు యజమానికప్పగించడం ఇందులో సారాంశం. యజమాని కూడా ఔదార్యంతో మళ్ళీ పరుపులు కుట్టే వ్యక్తికి ఇచ్చేస్తాడు. ఒక సార్వజనీనక మానవతా కోణాన్ని ఆవిష్కరించిన కథ ఇది.

ఇదే కోవకు చెందిన కథ పబ్బరాజు గోపాల రావు "రిక్షా వాలా" (1956). రిక్షా ఇరుసు విరిగి కింద పడినందుకు కోపగించుకున్న వర్తకుడు రిక్షావాలాను దారుణంగా కొట్టడం, ఆ వ్యాపారి రిక్షాలో ముత్యాలు మరచిపోతే రిక్షావాలా ముత్యాలు మళ్ళీ వ్యాపారికి తీసుకెళ్ళి ఇవ్వడం, వ్యాపారి తాను చేసిన పనికి సిగ్గుపడి రిక్షావాలాకు ఒక వేయి రూపాయలు ఇచ్చి భాగస్వామిగా చేర్చుకోవడం ఇందులోని అంశం.

ఇల్లిందుల సరస్వతీ దేవి కథ 'కాని కాలం వస్తే' కూడా నాటి హైదరాబాద్ రాజ్య పరిస్థితిని చిత్రించిందే. నవాబ్ వంశానికి చెందినా ఓ ముస్లిం కుటుంబం నాటి పోలీస్ యాక్షన్ తరువాత ఎట్లా చెల్లా చెదురైందో హృదయ ద్రావకంగా వర్ణించింది రచయిత్రి.

ఈ విధంగా కథలన్నింటిలోనూ నాటి రాజకీయ, సామాజిక పరిస్థితులు అన్యాపదేశంగా చిత్రించబడ్డాయి. గ్రాంథిక భాషతో మొదలైన కథ క్రమంగా పరిణామం చెందింది.

తెలంగాణ తనను తాను తడుముకుంటున్న వేళ తెలంగాణ ఆత్మవిశ్వాసాన్ని, అస్తిత్వాన్ని ప్రకటించిన కథలు ఇవి. దీనికి కారణమైన సంకలన కర్తలు ముదిగంటి సుజాతారెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్. వీళ్ళ కృషి మిగుల అభినందనీయం.

# ఆదిలాబాద్ జిల్లా వ్యావహారిక పదకోశమే 'మనభాష-మనయాస'

అదిలాబాద్ భాషా సొగసుల ఆవిష్కరణ....



గోపగాని రవీందర్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రజలు మాట్లాడుతున్న భాషలోని పదాలను సేకరించి, వాటికి అర్థాలను సమకూర్చి ఒక పదకోశాన్ని తయారు చేయడం కష్టసాధ్యం. చేపట్టిన పనిలో ఎన్ని అడ్డంకులు వచ్చిన కూడా పూర్తి చేయకుండా ఉండలేరు ఉత్తములు. అట్లాంటి కోవకు చెందిన కవి, రచయిత, సాహితీ యాత్రికుడు మరియు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత మడిపల్లి భద్రయ్య. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వ్యావహారికలో గల పదాలను గుర్తించి రాసుకోవడం, అకారాధిక్రమంలో అమర్చుకోవడం, వాక్యానిర్మాణం చేయడం వంటివి చేసి, ప్రచురించి వెలికి తేవడానికి ఒక పుష్కర కాలం పట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యావహారిక భాషా పదకోశమును 'మన భాష-మన యాస' పేరుతో ప్రచురించి అందించడం సముచితమైనది. గతంలో ఆయన ఆదిలాబాద్ విశిష్టతను వివరించిన 'మన ఆదిలాబాదు' గ్రంథను వెలువరించి ఈ జిల్లా ప్రాముఖ్యతను పరిచయం చేశారు.

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని నిర్మల్, ఖానాపూర్, జన్నారం, లక్షెట్టిపేట, భైంసా, మంచిర్యాల,చెన్నూరు, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, ఉట్నూరు, జైనూర్, నార్నూరు, ఇంద్రవెల్లి, ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడలు కొన్ని ముఖ్యమైనవి. ఒక్కొక్క ప్రాంతంలో మాట్లాడే తీరు కూడా వేరువేరుగా ఉంటుంది. మైదాన ప్రాంతంలో తెలుగుపై హిందీ, ఉర్దూ, ఇంగ్లీషుల ప్రభావముంటే, ఏజెన్సీ ప్రాంతంలో గోండు, లంబాడి, మరాఠి, కొలామి భాషల పదాలతో తెలుగు పదాలు కలిసిపోయి ఉంటాయి.

ఉపాధ్యాయుడుగా, పధానోపాధ్యాయుడుగా భద్రయ్య గారు ఈ ప్రాంతాలలో చాలా చోట్ల పనిచేశారు. ఈ పదకోశ నిర్మాణానికి కవి మిత్రుల సహకారం, తనతో పని చేసిన సహ ఉపాధ్యాయుల చేయూత, తన దగ్గర చదువుకున్న విద్యార్థుల సహాయం ఆయనకు లభించింది.

భాష అనేది అనేక పదాల సమూహం. ఒక పదం యొక్క పుట్టుక, విస్తరణ, వాడుకల గూర్చి పరిశోధన చేయడం ఆసక్తికరమైనది. మానవ జీవతంలోని అనేక రంగాలను ప్రభావితం చేస్తుంది భాష. మానవుల మధ్యన ఉంటే సంబంధాల వినిమయం నుంచే పదజాలం పెరిగింది. ఒక ప్రాంతంలోని ప్రజలు మాట్లాడే భాషకు ఇంకొక ప్రదేశంలో మాట్లాడే వారి మధ్యన తేడాలుంటాయి. వారి నిత్య వ్యవహారంలోని భాషల పదాలు భాష మీద చాలా ప్రభావం చూపుతాయి. పలుకుబడులు, జాతీయాలు, సామెతలు భాషలో సునాయాసంగా మనం మాట్లాడే భాషలో వచ్చి చేరుతుంటాయి. వాటిని మనం మాట్లాడే భాషలో ఉపయోగించడం వలన ఆ భాషా సౌందర్యం వికసిస్తుంది. అట్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు మాట్లాడే భాషలోని యాస పదాలను సేకరించి పదకోశంను నిర్మాణం చేయడమంటే భావితరాలకు బంగారు కానుకను అందించడం వంటిది.

'ప్రజల నాలుకల పద సంపద' అంటూ తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు నందిని సిధారెడ్డి రాసిన ముందు వాక్యంలో ఇలా అభిప్రాయం వ్యక్తం చేశారు. 'ఆదిలాబాద్ ప్రజల ఉచ్చారణ పదాల్లో వకారం లోపించి ప్రత్యేకంగా కనబడి ఆకర్షిస్తుంది. మిగతా తెలుగు ప్రాంతాల్లో 'వక్కిపోయి' అనే పదం, తెలంగాణ కొన్ని చోట్ల (మెదక్) 'ఒ'త్వం వచ్చి 'వొక్కిపోయి'అని వాడితే, ఈ జిల్లాలో వకారం లోపించి 'అక్కిపోయి' అయింది. అట్లాంటిదే 'ఏడస్తది'. అంతటా ఏదవస్తది-ఏడువొస్తది అంటే ఇక్కడ మూడవ అక్షరం వకారం లోపిస్తుంది. ఏడవమంటే అదేవిధంగా 'నువ్వుల పొడి' మారి 'నూలపొడి' అయింది. ద్విత్వ లోపం, ద్విత్వ పూర్వాక్షరం దీర్ఘాక్షరంగా మారటం కన్పిస్తుంది. కాగా ఉర్దూ పదాలు తెలంగాణ భాషలో మిళితమై పోయాయి.

చాలా చోట్ల అకల్‌మంద్ అనే ప్రయోగం ఉండగా, ద్విత్వం ప్రవేశించి 'అక్కల్‌మంద్'పదం జిల్లాలో కనిపిస్తున్నది. మరాఠి ప్రభావంతో 'చోళి','మక్క' వంటి పదాలు వ్యవహారంలోకి వచ్చాయి. కర్ణాటక ప్రభావంతో తెలుగులో వాడుకలో ఉన్న 'ఉప్మా' ఇక్కడ 'ఉక్మ'గా మారిపోయింది. 'హీనాతిహీనం' అనే సంస్కృత ప్రయోగం స్థానికంగా 'ఈనమీనం' అయింది. మహాప్రాణలోపం, 'అతి'లోపం ఇట్లా చాలా పదాలు ఎన్నో ప్రభావాల, పరిణామాల అనంతరం స్థానిక వ్యవహార సౌందర్యంతో తళతళలాడుతుంటాయి. ఖర్జూర పండ్లని ఆదిలాబాద్‌లో 'ఉచ్చడి పండ్లు'అంటారనే విషయం భద్రయ్య వల్లే తెలుస్తున్నది'

కేంద్ర సాహిత్య అకాడమి అనువాద అవార్డు గ్రహీత, తెలంగాణ పదకోశాన్ని రూపొందించిన బహు భాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ గారు రాసిన ఆత్మీయమైన మాటలో ఆదిలాబాద్ ప్రాంత భాషపై తన అంతరంగపు మాటల్ని రాశారు. 'భాషా పరంగా చూసినప్పుడు ఆదిలాబాదు జిల్లాకే పరిమితమైన కొన్ని ప్రత్యేక పదాలు మదిలో మెదులుతాయి. 'జీపులో పోవడం కన్న బస్సులో వెళ్ళడమే నయం'అనే వాక్యంలో ఆదిలాబాద్‌లో 'జీబుల పోవుడు కన్న బస్సుల పోతనే పోపు'అనే తీరుగా మారుతుంది. ఇక్కడ ప్రధానంగా గమనించాల్సింది 'పోపు'అనే పదాన్ని. దీని కర్థం నయం, మేలు, మంచిది అని చెప్పుకుంటున్నాం. నిజానికి 'పోపు' అంటే ప్రోపు, ప్రోచు, బ్రోచు అనే క్రియ నుండి పుట్టినదే పోపు. అంటే రక్షణ అని అర్థం. ఆదిలాబాద్‌లో దుర్మార్గుణ్ణి 'కడ్డు' అంటారు. ఇది 'కరుడు' అనే మాట వర్ణసమీకరణం చెందగా ఏర్పడిన రూపం. 'కరుడు' అంటే గడ్డకట్టిన రూపం. అంటే ఏ మాత్రం దయాదాక్షిణ్యం లేని కరగని హృదయం కలవాడని అర్థం. ఇవే గాక ఆదిలాబాదు జిల్లా భాషపై మరాఠీ ప్రభావం కూడా అధికం. ఉర్దూ అసర్ ఎలాగు వుంటుంది. మరాఠీలోని



'కసకాయ్'అనే మాటకు అనువాదంగా ఎట్ల, ఏమిటి(ఎట్లేం)అని ప్రశ్నిస్తుంటారు. అట్లాగే తల్లిని ఆయి అనీ, భార్యను బాయి అనీ పిలుస్తారు. ఆదిలాబాదు జిల్లా భాషపై గిరిజనుల నుడుల ప్రభావము ఉంటుంది'.

ఆదిలాబాదు జిల్లా ప్రజల వ్యవహారిక భాషకున్న ప్రత్యేకతలను సునిశితంగా పరిశీలన చేసిన ఈ పద సంకలనం విశిష్టమైనది. ఇందులో చోటుచేసుకున్న పదాలన్ని కొన్ని వాడకంలో ఉన్నాయి. కొన్ని కనుమరుగై పోయినవి. సేకరించిన పదాలకు అర్థాలను రాస్తూనే, సందర్భాను సారమైన వాక్యాల్లో కూడా ప్రయోగించారు.' కుదిరిచ్చుడు, గెద్మడు, గోలిచ్చుడు, జప్పన, జమిలి, డక్కీ మొక్కీలు, తెలివికచ్చుడు, తిరంలేదు, ధూత్తెరి, దొబ్బుడు, దండెగొట్టుడు, నీట్కం, న్యాలముచ్చోడు, బొక్కలు కలికలి అవుడు, బొంకియ్యడు, మాగిపొద్దు, మనాది, మన్నువడ్డది, మాయలబడుడు, మీపట్టెకు, మూడింది, లేసికుసున్నడు, వరుసైనోళ్లు, సత్తెనాశనం, శనార్తి, శోకంబెట్టుడు వంటి పదివేలకు పైగా ఉన్న ఈ ప్రత్యేక ఆదిలాబాదు పదకోశం తెలంగాణ ప్రాంతంలోని యాస పదాలకు అర్థాలను తెల్పుతున్నది.

తెలంగాణ ప్రాంతంలోని కవిత్వంలోగాని, వ్యాసాల్లోగాని, కథల్లోగాని, నవలల్లోగాని వచ్చిన తెలువని పదాలకు ఈ పదకోశం ఒక ఆధారంగా నిలుస్తుంది. వట్టికోట ఆళ్వారుస్వామి, దాశరథి సోదరులు, సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణ రావు, సామల సదాశివ, పొట్లపల్లి రామారావు, పాకాల యశోదారెడ్డి, కాలువ మల్లయ్య, అన్నవరం దేవేందర్ వంటి కవుల, రచయితల రచనల్లోని మాండలిక పదాల అర్థాలను అవగాహన చేసుకోవడానికి ఈ పదకోశం దోహదపడుతుంది.

'ఈ పదకోశం అక్షర క్రమంలో తీసుకుంటూ ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాడుక లోనున్న పదాలకు సరియగు అర్థంతోపాటుగా ఒకటో రెండో వాక్యాలను ఆయా గ్రామీణ వాతావరణంలో మాట్లాడుకునే తీరునుదహరించడంతో జన బాహుళ్యానికి తొందరగా అర్థం కావాలనే తపనతో వ్రాయడం జరిగింది కాని ఎవ్వరినీ దీన్లో ఎక్కువ తక్కువ చేసే ఉద్దేశ్యం లేదని' మడిపెల్లి భద్రయ్య గారు విన్న వించుకున్నారు.

ఈ పదకోశానికి కపిలవాయి లింగమూర్తి, ఆచార్య కసిరెడ్డి, నారాయణ, కూరెళ్ల విఠలాచార్య, బి. మురళీధర్, పెండ్యాల కిషన్ శర్మ, కాచాపురం పాపేశ్వరశర్మ, ఎం.వి.పట్వర్ధన్, దామెర రాములు, అప్పాల చక్రధారిలు అందించిన ముందుమాటలు ఈ నిఘంటువు ప్రాధాన్యతను వివరిస్తు న్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని గ్రంథాలయాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో, యూనివర్సిటీల్లోని తెలుగు విభాగాల్లో ఉండాల్సిన మంచి పుస్తకమిది. కవులు, రచయితల దగ్గర కూడా ఉండాల్సిన వ్యవహారిక భాషా పదకోశమిది. ఒక సంస్థ చేసే ఈ పనిని ఒక వ్యక్తిగా చేసి తెలంగాణ పద సంపదను బలోపేతం చేసిన భద్రయ్య గారి కృషికి ఏ అవార్డుతో సత్కారం చేసిన తక్కువే అనిపిస్తుంది. ఈ పదకోశానికి విస్తృతంగా ప్రాచుర్యంలోకి తీసుకపోవల్సిన బాధ్యత మనందరి మీదున్నది.

# తెలుగు అంటే తెలంగాణ భాషే ...

**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత భాషా కోవిదుడు 'నలిమెల భాస్కర్'తో అన్నవరం దేవేందర్ ఈ పక్షం ముఖాముఖి**

*ప్రఖ్యాత కవి, రచయిత, అనువాదకుడు డాక్టర్ నలిమెల భాస్కర్ 14 భారతీయ భాషలు తెలిసిన ఉపన్యాసకులు. 'పునత్తిల్ కుంజబ్దుల్ల' మలయాళ నవలను స్మారక శిలలు' పేర తెలుగులోకి అనువదించారు. ఈ నవలకే 2010లో కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం పొందారు. తెలంగాణ భాషకు సంబంధించిన తెలంగాణ పదకోశాన్ని 2003లోనే ముద్రించారు. ఇది ఇప్పటికీ నాలుగు ముద్రణలు పొందింది. తెలంగాణ పదాల మీద నిరంతర పరిశోధన చేస్తూ 'బాణం' అనే వ్యాస సంపుటి 2008లో వెలువరించారు. తెలంగాణ ఉద్యమ సందర్భంలో మన భాష మీద వందల ప్రసంగాలు చేశారు. 2017లో 'తెలంగాణ భాష - దేశ్య పదాలు' 2019లో 'తెలంగాణ భాష -సంస్కృత పదాలు' అనే పుస్తకాలను వెలువరించారు. అదే సిరీస్‌లో ఇటీవలనే 'తెలంగాణ భాష-తమిళ పదాలు' అనే గ్రంథం వెలువరించారు. 1974 నుంచి ఇప్పటివరకు వివిధ ప్రక్రియల్లో 20 పుస్తకాలు వెలువరించారు. ఆయనతో కవి రచయిత ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ అన్నవరం దేవేందర్ - తంగేడు పత్రిక కోసం ముఖా-ముఖి నిర్వహించారు. ఇందులో తెలంగాణ భాషకు సంబంధించిన చాలా విషయాలు చర్చించారు.*

**తెలంగాణ సంస్కృతి వేరైనట్లుగానే తెలంగాణ భాష వేరు అని మీరు పలు సందర్భాల్లో అన్నారు. తెలుగుకు, తెలంగాణకు ఎట్లా వేరు వేరో వివరంగా చెప్పగలరా?**

దేవేందర్! ఇక్కడ ఒక చిన్న సవరణ. నాకు తెలిసి నేను ఆంధ్ర భాష తెలుగు భాష. ఇవి రెండూ వేరు వేరు అని చెప్పినట్లు గుర్తు. తెలుగు అంటే తెలంగాణ భాషే అని చాలా బలంగా తెలంగాణ మలి దశ ఉద్యమ కాలంలో చెప్పాను. ఒకవేళ అప్పట్లో తెలుగు భాష, తెలంగాణ భాష రెండూ వేరు వేరు అని చెప్పి వుంటే అది తప్పే!

మరి ఇంతకీ ఆంధ్ర భాష, తెలుగు భాష ఇవి రెండూ వేరుగా ఉన్నాయా? ఒకప్పుడు ఉండినాయి. ఆంధ్రులు ఆర్యులు. వాళ్ళు ఉత్తర భారతం నుండి వింధ్య పర్వత ప్రాంతాల వరకూ, ఇంకా దిగువకూ వచ్చారు. వాళ్ల భాష బహుశా: సంస్కృతం అయివుండచ్చు. తెలుగు వాళ్ళేమో వింధ్యకు దిగువన తెలుగు మాట్లాడుతున్న ప్రజలు. ఆంధ్రులు, తెలుగువాళ్లు కలిసి పోయి ఈనాటి తెలుగు మాట్లాడుతున్నారు. తెలుగు వాళ్ళు ద్రవిడులు. అయితే ఇట్లా కలిసిపోవడం ఏ రెండు వేల ఏండ్లకు ముందే జరిగింది. ఆంధ్ర భాషలో అందుకే సంస్కృత పదాలు ఎక్కువగా ఉంటాయి. తెలుగులో దేశ్య శబ్దాలు అధికం. "అమ్మ" ఆంధ్ర పదం "అవ్వ" తెలుగు పదం. నన్నయ పూజ్యురాలు, స్త్రీ అనే అర్థంలోనే అవ్వ అన్నాడు. పోతన తల్లి అనే అర్థంలో రాసినాడు. "అమ్మ" మీదా ఇంతో కొంతో "మాత, మా" అనే మాటల ప్రభావమో, "అంబ" అనే పదం ప్రభావమో వుంది. "అవ్వ", "అవ్వె" ద్రవిడ పదం నుండి వచ్చింది.

"ఆంధ్ర భాషా వికాసము" రాసిన గంటిజోగి సోమయాజి ఏమన్నారో గమనిద్దాం: "నేడు ఆంధ్రమనబడెడు దేశమునకు కేంద్ర స్థానము గుంటూరు సీమ" (1947). సోమయాజి మరలా "నిజాము రాజ్యమున తూర్పు భాగము తెనుగు. ఈ భాగమునకే 'తెలింగాణా' అని పేరు. ఇది అక్కడ తెనుగు వారి వలన వచ్చిన నామమే గాని వేరు కాదు" అన్నారు.

"పశ్చిమాంధ్రులకును, ప్రాగ్దేశాంధ్రులకును సారస్వత సృష్టిలోను, సారస్వత సేవలోను కొంత భేదమున్నది. మన వాఙ్మయమున గల మార్గ దేశి శాఖలలో పూర్వ కాలమున మార్గ శాఖ ప్రాక్రియలోను, దేశి శాఖ పశ్చిమ సీమలోను ఎక్కువ వృద్ధియైనది.

ముఖాముఖి

బాహుళ్యము మీద చెప్పవచ్చును "ఇది పింగళి లక్ష్మీకాంతం 1942లో చెప్పిన ముచ్చట.

పశ్చిమాంధ్రులు అంటే తెలంగాణీయులు. ప్రాగ్దేశాంధ్రులు అనగా ఆంధ్రులు. వీళ్ళ సాహిత్యంలో కూడా తేడా ఉందని పింగళి వారన్నారు. మార్గశాఖ ఆంధ్రులదైతే, దేశీశాఖ తెలంగాణ వారిది. సంస్కృత మార్గంలో నడిచే శాఖ "మార్గ". తమ దేశపు, ప్రదేశపు పద్ధతిని అనుసరించేది "దేశీ". అందుకే అక్కడ "నన్నయ" వున్నాడు. ఇక్కడ "సోమన్న" వున్నాడు.

"ఆంధ్ర సాహిత్య చరిత్ర

**నేను భాషకే పరిమితమై మాట్లాడుతాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆలస్యంగానైనా తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడింది. ఇది సంతోషించవలసిన విషయమే! మిత్రుడు నందిని సిద్దారెడ్డి అధ్యక్షతన కొంతవరకు మంచి పుస్తకాల ప్రచురణ జరిగింది. అయితే ఈ కృషి చాలదు. తెలంగాణ భాష కి ఒక సమగ్ర చరిత్ర రచన జరుగలేదు.**



సంగ్రహం"లో ఖండవల్లి లక్ష్మీరంజనం "తెలుగు వారుండు దేశము కనుక ఈ దేశమందలి ఒక భాగమునకు తెలంగాణము అను పేరు ఏర్పడినది" అన్నారు 1955లో.

అంతెందుకు? "ఆంధ్రము" అనే పదమే అది సంస్కృతపు మాట అనే ఆధారాన్ని చూపిస్తున్నది. "ధ" అనే అక్షరం మహాప్రాణం. ఖ,ఛ,ఠ... మొదలైన ఈ మహాప్రాణాలు తెలుగులో లేవు. అవి సంస్కృతం నుండి ఆ తర్వాత తెలుగులోనికి వచ్చాయి. ఈ "ధ" అనే అంతరిక సాక్ష్యం "ఆంధ్రము" అనే మాట సంస్కృతం అని చెప్పకనే చెబుతున్నది. "తెలుగు" (తెలంగాణం కూడా) అనే పలుకు అది తెలుగు నుడి అని చెబుతున్నది.

అయితే... ఇవాళ ఆంధ్రప్రాంతం అంతటా సంస్కృతపదాలతో వున్న తెలుగు మాట్లాడుతున్నారని, తెలంగాణ అంతటా తెలుగు మాటలతో కూడిన తెలుగు పలుకుతున్నారని ఒక గీత గీసి సూత్రీకరణ చేయలేము. రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని ప్రాంతాల్లోనూ తెలుగే మాట్లాడుతున్నారు. కానీ, తెలంగాణ, సీమలోని ప్రజల వ్యవహారంలో ఆంధ్రప్రాంతపు రెండున్నర జిల్లాల విద్యావంతుల భాషలో వున్న తెలుగు కంటే ఎక్కువ తెలుగు ఉన్నది అనేది నిర్వివాదంశం. దానిక్కారణం ఏమంటే... తెలంగాణ ప్రాంతం మొదటి నుండి అది తెలుగు మాట్లాడే భూభాగం. పైగా నిజాము నవాబుల కాలంలో పాఠశాలలు, పత్రికలు, ముద్రణాయంత్రాలు, రవాణా సౌకర్యాలు మొదలైన ఆధునిక నాగరికత సౌలతులు లేకపోవటం చేత తెలంగాణ తెలుగు మార్పుకు ఎక్కువగా లోనుగాక, మూలాల కాపాడుకున్నది. అట్ల కాక బ్రిటీషాంధ్రలో పై వసతుల కారణాన అక్కడి భాష బాగా మారిపోయింది. అక్కడ కూడా రెండున్నర జిల్లాలు విద్యావంతుల భాషా వ్యవహారంలో తెలుగు కన్నా ఇతర ప్రాంతాల్లో తెలుగు ఎక్కువ. ముఖ్యంగా తెలుగు భాష ఎక్కడైనా నిరక్షరాస్యుల్లోనే బాగా బ్రతుకుతున్నది.

**ప్రస్తుతం తెలంగాణ భాష సంస్కృతి ఎట్లా ఉన్నది? దీని కోసం ప్రభుత్వంగానీ, రచయితలుగానీ ఏ రకమైన కృషి చేయాలి?**

నేను భాషకే పరిమితమై మాట్లాడుతాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆలస్యంగానైనా తెలంగాణ సాహిత్య అకాడమీ ఏర్పడింది. ఇది సంతోషించవలసిన విషయమే! మిత్రుడు నందిని సిధారెడ్డి అధ్యక్షతన కొంతవరకు మంచి పుస్తకాల ప్రచురణ జరిగింది. అయితే ఈ కృషి చాలదు. తెలంగాణ భాషకి ఒక సమగ్ర చరిత్ర రచన జరుగలేదు. ఓ సమగ్రమైన నిఘంటువు రాలేదు. తెలంగాణ భాష వ్యాకరణం దిశగా ఏ కృషి చేయడం లేదు. తెలంగాణ కవులైన పోతానాదుల పద ప్రయోగ సూచికలు తయారుకాలేదు. అన్నమయ్యను పట్టించుకున్నంత కాకున్నా కొంతమేరకైనా భద్రాచల రామదాసును పట్టించు కోవాల్సి ఉండింది. తెలంగాణ భాషకు సంబంధించిన పరిశోధన ఏ మాత్రం జరగడం లేదు. తెలంగాణ పల్లె సీమల్లో ప్రాచీన మూలాలు కలిగిన వేలాది పదాలున్నాయి. అవి అటు మూలద్రావిడానికీ, ఇటు తెలుగు దేశీపదాలకూ అతి దగ్గరగా ఉన్నాయి. ఈ అపురూపమైన పద సంపదనూ, సామెతలనూ, జాతీయాలనూ, నుడికారాలనూ ప్రభుత్వం అనుకుంటే సేకరణ చేయించగల్గుతుంది. వ్యక్తులు ఎంత చేసినా తక్కువే. పైగా తెలంగాణ భాష గొప్పతనం ఏమిటంటే... ఈ భాషలో ద్రవిడ పదాలూ, తెలుగు పలుకులూ, ప్రాకృత సంస్కృతం మాటలూ, ఆంగ్ల ఉర్దూ నుడులూ వుండి అది సుసంపన్నగా, పరిపుష్టంగా వుంది. దేశంలోని ఏ భాషకూ లేని ప్రాశస్త్యం యిది. ఉత్తరాది భాషల్లో ద్రావిడ పదాలు వుండవు కదా! పోనీ... దక్షిణాదిలోను తమిళంలో సంస్కృత శబ్దాలు తక్కువ కదా! మలయాళంలో మనతో పోల్చితే ఉర్దూ తక్కువ,

కన్నడంలోనూ అంతే! జాతీయ భాషగా అర్హతలు కల్గిన భాష "తెలుగు" అని హాల్డేన్ అన్నాడు. నిజానికి తెలంగాణ భాషకి జాతీయ భాష కాదగిన అన్ని అర్హతలూ ఉన్నాయి. కానీ ప్రభుత్వాలకూ, రచయితలకూ, ప్రజలకూ తెలుగు భాషో, తెలంగాణ భాషో అనండి. పెద్దగా పట్టింపు లేదు. దేశభాషలతో పోల్చి చూస్తే మన భాషకు మనమే ఆదరణ చూపడం లేదన్నది చేదు నిజం.

**పద్నాలుగు భారతీయ భాషాసాహిత్యాలపై పట్టున్నవారిగా మీరు అంచనా వేస్తే మన తెలుగు సాహిత్యం భాష పరిస్థితి ఎట్లా వుంది?**

ఒక చిన్న ఉదాహరణ! నేను 1992 మే నెలలో మొదటి సారిగా కలకత్తా వెళ్ళాను. హౌరా రైల్వే స్టేషన్లో దిగాను. అక్కడి పుస్తకాల షాపులో "దేశ్" (స్వర్ణోత్సవ కథల సంకలనం) అనే పుస్తకం కొన్నాను. నిజానికి "దేశ్" అనేది బెంగాలీలో 1933లో మొదలైన పక్షపత్రిక. యాభై ఏళ్ల సందర్భంగా 1983లో ఆ యాభై సంవత్సరాల్లో ఆ పత్రికలోనే వచ్చిన ఓ యాభై మంచి కథల్ని ఎంపిక చేసుకొని సంకలనం వేశారు. ఆ సంకలనం 1991 వరకే ఏడుసార్లు ముద్రించబడి 37,500ల ప్రతులు అమ్ముడుపోయినై, ఆ తర్వాత ఆరేళ్లకు మరో 14300ల పుస్తకాలు చెల్లిపోయినై. 1997 నుండి ఈ 2021 వరకు ఇంకా ఎన్ని ముద్రణలు పొంది వుంటుందో నాకు తెలియదు. 1997నాటికే 51800ల ప్రతులు అమ్ముడు పోయినై అంటే వాళ్ళ భాషాభిమానం ఎంత గొప్పగా వుంది! నేను 1986లో త్రివేంద్రం వెళ్ళినప్పుడు ఉదయం పూట ఫుట్పాత్లపై మలయాళ దిన పత్రికలు చూసి ఆశ్చర్యపోయాను. అప్పటికి వంద దినపత్రికలు వస్తున్నాయట ఆ భాషలో. దేశంలోనూ అత్యధిక సర్కులేషన్ కల్గిన మలయాళ మనోరమ మనందరికీ తెలిసిన పత్రికే. నిన్నా మొన్నా శ్రీధరన్ అనే ఐదవ తరగతి వరకే చదువుకున్న ఒక వృద్ధుడు పన్నెండు లక్షల పదాలతో ఉన్న మలయాళ, తమిళ, కన్నడ, తెలుగు నిఘంటువు వేశాడు. పి.సి. కార్తా పదివేల మలయాళ సామెతలకు నిఘంటువు వేశాడు. మలయాళ మనోరమ వాళ్ళు "భాషా పోషిని" అనే గొప్ప రెన్నెళ్ల పత్రికను తెస్తున్నారు. మన కన్నా ముందునుంచి అయ్యప్ప పనిక్కర్ సంపాదకత్వంలో కేరళ కవిత వస్తున్నది. కేరళ యూనివర్సిటీ మలయాల శాఖ భాషా సాహితీ అనే త్రైమాసిక తెస్తున్నది. పాన్ కున్నం వర్కి క్రైస్తవ సమాజంలో ఉన్న ఎస్టాబ్లిష్మెంట్కి వ్యతిరేకంగా కథలు రాశాడు. వైక్కం ఒక ఋషి వంటి రచయిత, ఇక తమిళానికి వస్తే ఆనంద వికటన్, కుముదం వంటి పత్రికల కన్నా ఎక్కువగా తమ రచనలు "కనైయాలి" వంటి సాహితీ పత్రికల్లో వస్తేనే బావుంటుంది అనుకునే లబ్దప్రతిష్టులు వున్నారు. ఆ భాషలో తమిళంలో పదుల సంఖ్యలో సాహిత్య పత్రికలు ఉన్నాయి. వాటికి గొప్ప ఉదాహరణ ఉంది.

అంతేందుకు? దేవేందర్... మనం పోయినేడు మదురై వెళ్ళాం కదా! మీనాక్షి దేవాలయం ముందరి షాపులో నేను "తమిళ సాహిత్య చరిత్ర " పుస్తకాన్ని (అది తమిళ పుస్తకమే) కొన్నాను కదా! అది ఇప్పటి వరకు 33 ముద్రణలు చూసింది. పైగా, అది సాహిత్య చరిత్ర. కవిత్వమో, కథల వయ్యో కాదు, నవల అంతకన్నా కాదు, పైగా ఆ గ్రంథం కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురణ. సాధారణంగా ఆ పుస్తకాలు వాళ్ళ విక్రయ కేంద్రాల్లో తప్ప బయటి దుకాణాల్లో అమ్మరు, కానీ మదురైలో మామూలు పుస్తకాల షాపులో దొరికింది, పైగా అన్ని సార్లు అచ్చయింది. అది తమిళుల ప్రత్యేకత! తమిళంలో చారిత్రక నవలలు ఇప్పటికీ చదువుతారు, దళితవాదం ముందు మరాఠీలో వచ్చింది, దళితులు అద్భుతమైన ఆత్మకథలు రాసుకున్నారు, అక్కడి సాహిత్యంలో వ్యంగ్య కథలు ఎక్కువ, కన్నడంలో ఇప్పటికీ మినీ కవితలున్నాయి, "లలిత ప్రబంధ" పేరుతో హాస్యవచనం వుంది, జానపద సాహిత్యాన్ని వాళ్ళు కండ్లకు అద్దుకుంటరు. అక్కడ కన్నడ సాహిత్య పరిషత్తు తరుపున కన్నడ కథ, కవిత ఏటేటా వస్తాయి. నేమిచంద్ర మొదలైనవాళ్ల రెండునెలలకు ఓ మారు "అచల "అనే స్త్రీవాద పత్రికను ప్రకటనలు లేకుండా, ఏ సంచికనూ ఆపకుండా తెస్తున్నారు. దళితవాదం కన్నడంలో మనకన్నా ముందొచ్చింది, గుజరాతీలోనూ దళితవాదం వుంది. ఝవేర్ చంద్ మేఘాణి గొప్ప జానపద విద్వాంసుడు. గుజరాతీలో "కవితా" అనే రెండు నెలల పత్రిక గత యాభై ఒక్క ఏండ్లనుంచి వస్తున్నది, పైగా అప్పుడప్పుడు ప్రత్యేక సంచికలు వేస్తున్నారు. అనువాదానికి, బాలసాహిత్యానికి, ప్రణయ కావ్యాలకు, నగర కవితలకు మరాఠీ కవితలకు, ఇట్లా అనేక సంచికలు వచ్చాయి.

హిందీలో "యుగ్ స్పందన్" అనే పత్రిక వుంది, అది ముప్పై రెండేళ్ల నుండి ఢిల్లీ నుండి వస్తున్నది, వీళ్ళు కూడా సమకాలీన భారతీయ కవితలు, ఆఫ్రికా కవయిత్రులు, మరాఠీ కవిత, తెలుగు కవిత, కన్నడ కవిత, మలయాళం కవిత, మాతృ భాష గొప్పదనం, ఇట్లా

**పంజాబీలో దేశ విభజన నాటి సాహిత్యంలో "కాజి కా పేట్ " చెప్పుకోదగిన కథ. అస్సామీస్‌లో సరిహద్దు రాష్ట్రాల నుండి వచ్చిన పేదల పరిస్థితి దయనీయం, హెూమెన్ బోరోగహైన్ "వెతుకులాట"-చాలా గొప్ప కథ, ఒరియాలో గొప్ప సాహిత్యం వస్తున్నది. నేను తెలుగు తీసికట్టు అని చెప్పడం లేదు, ఇక్కడ వామపక్ష ఉద్యమ సాహిత్యం ఎక్కువ. కవిత్వం, కథ, నవలలు చక్కగా వికసించిన ప్రక్రియలు ఇక్కడ కానీ విమర్శ, వ్యాసం, సమీక్ష, హాస్యం, వ్యంగ్యం, బాలసాహిత్యం, ఆత్మకథ మొదలైన ప్రక్రియలు దాదాపు నిష్క్రియలుగా మిగిలాయి. రంగనాయకమ్మ వంటి రచయిత్రి ఇతర భాషల్లో ఎక్కడా కానరాదు.**

అప్పుడప్పుడు అనేక ప్రత్యేక సంచికలు తెచ్చారు. పంజాబీలో దేశ విభజన నాటి సాహిత్యంలో "కాజి కా పేట్" చెప్పుకోదగిన కథ. అస్సామీస్‌లో సరిహద్దు రాష్ట్రాల నుండి వచ్చిన పేదల పరిస్థితి దయనీయం, హెూమెన్ బోర్గొహైన్ "వెతుకులాట"చాలా గొప్ప కథ, ఒరియాలో గొప్ప సాహిత్యం వస్తున్నది.

నేను తెలుగు తీసికట్టు అని చెప్పడం లేదు, ఇక్కడ వామపక్ష ఉద్యమ సాహిత్యం ఎక్కువ. కవిత్వం, కథ, నవలలు చక్కగా వికసించిన ప్రక్రియలు ఇక్కడ, కానీ విమర్శ, వ్యాసం, సమీక్ష, హాస్యం, వ్యంగ్యం, బాలసాహిత్యం, ఆత్మకథ మొదలైన ప్రక్రియలు దాదాపు నిష్క్రియలుగా మిగిలాయి. రంగనాయకమ్మ వంటి రచయిత్రి ఇతర భాషల్లో ఎక్కడా కానరాదు.

**ఇతర భాషల నుంచే (ముఖ్యంగా బెంగాలీ, తమిళం, మరాఠీ, హిందీ) మన తెలుగులోకి నవలలు, కథలు అనువాదం అయి వస్తున్నాయి, మన సాహిత్యం ఆయా భాషల్లోకి వెళ్తుందా... ఈ అదాన్ ప్రదాన్ ఎలా వుంది?**

ఇతర భాషలనుండి తెలుగులోనికి అనువాదాలు ఎక్కువగా జరుగుతున్నాయనేది వాస్తవం. ఇట్లా జరగడం తప్పేమి కాదు. పైగా మన భాష మరింత కండపుష్టితో పుష్టిస్తుంది, దీనికి కారణం అంటే తెలుగులోకి అనువాదమై రావడానికి హేతువు... తెలుగు మాతృభాషగా ఉన్నవాళ్లు, వాళ్లకు ఇతర భాషలు తెలిసిన కారణం చేత అనువాదాలు చేస్తున్నారు. మాతృభాషలోనికి అనువాదాలు సులభంగా చేయవచ్చు. ఆ అనువాద గ్రంథాలను నలుగురికి పంచుతారు - లేదా మార్కెటింగో, నెట్‌వర్కో ఉంటే కొంతమేరకు అమ్ముకుంటారు. ఇతర భాషల్లోకి మన తెలుగు సాహిత్యం అనువదించబడాలంటే ముందు ఎల్.ఆర్. స్వామి లాంటి తెలుగేతరులై ఉండి మన ప్రాంతంలో స్థిరపడిన వాళ్ళను వెతకాలి. ఆ పని మన దగ్గర జరగడం లేదు. లేదా ముందు మన సాహిత్యాన్ని ఆంగ్లంలోనికి గానీ హిందీలోనికి గానీ తీసుకుని పోవాలి. అట్లా చేస్తే హిందీ ఆంగ్లాల నుండి తమిళం వంటి దేశ భాషల్లోకి వెళ్లే అవకాశం వుంది, ఏది ఏమైనా మన భాష నుండి ఇతర భాషల్లోకి వెళుతున్నది తక్కువ. దానికి మన సృజనకారులది ఎంత తప్పో, మన అనువాదకులదీ అంతే తప్పు. కవులూ, రచయితలూ, ముందుగా తమ రచనల్ని ఇతర భాషల్లోనికి తీసికొని వెళ్లాలన్న సంకల్పం కలిగి వుండాలి. ఆ తర్వాత మంచి అనువాదకుల్ని గుర్తించాలి. అట్లా చేసినా మళ్ళీ ఆ రచనల్ని ఆయా భాషీయులకు ఎట్లా చేరవేయాలన్న సమస్యా ఉత్పన్నమైతుంది. దీనికి ఒక పరిష్కారం ఏమంటే, తమిళనాడు, కేరళాల్లో వున్న ప్రచురణకర్తల్ని సంప్రదించడం. అలాగయితేనే అనువదించబడిన పుస్తకాలు అక్కడి పాఠకులకు చేరే అవకాశం వుంటుంది, లేకపోతే ఆ పుస్తకాలన్నీ తమ తమ యిళ్ళల్లో కట్టలు కట్టలుగా పడి ఉంటాయి. ఇంకో మార్గం వుంది. ఇతర రాష్ట్రాల్లో చాలా కాలంగా ఉద్యోగరీత్యా స్థిరపడిన తెలుగు వాళ్ళుంటారు. వారిని గుర్తించి అనువాదాలు చేయించవచ్చు. లోగడ ఉపద్రష్ట అనురాధ గారు తెలుగు కథలు ఒరియాకరించారు. ఇప్పుడు తుర్లపాటి రాజేశ్వరి ఉన్నారు. తమిళనాడులో గౌరీ కృపానందన్ ఉన్నారు. ఇట్లా ఎన్నో మార్గాలున్నాయి. మనసుంటే ముందు తెలుగు రచయితలకు తమ రచనలని అనువదింపచేసుకోవాలన్న తలంపు అవసరం, తరువాత సరైన అనువాదకుల్ని వెతికి పట్టుకోవాలి. ఆ తర్వాతే మిగతా పనులన్నీ అవుతాయి మరి.

**ఇతరులతో పోలిస్తే మనకు అధ్యయన శీలం తక్కువని. అయితే తెలుగులో సోమవారం పేజీలు మన ప్రత్యేకం, ఇతర భాషల్లో ఆదివారం సంచికలు ప్రత్యేకం. అంతేగాక అక్కడ ఉగాది, విజయదశమి, దీపావళి, ప్రత్యేక సంచికలు వేస్తారు.**

**మన తెలుగు సాహిత్యాన్ని తెలుగేతర సాహిత్యకారులు ఇష్టపడే చదువుతున్నారా? మన కవులు, రచయితల సృజన గురించి ఇతర భాషా సాహిత్యకారులు ఏమనుకుంటున్నారు ?**

చాల వరకు తెలుగేతర సాహిత్యకారులు తెలుగు రచయితల కన్నా ఎక్కువ చదువరులు - మిక్కిలి అధ్యయనపరులు - వాళ్లు అన్ని సాహిత్యాలను అక్కున చేర్చుకుంటారు, మన దిగంబర కవులను కన్నడిగులు చదివారు. కన్నడ రచయిత బెసగర హళ్లి రామన్న తను రాసిన ఒక రైతు కథలో శ్రీ శ్రీ ని పేర్కొంటాడు, మన గురజాడను చాలా మంది చదివారు. ఆ మధ్య చెన్నై తెలుగు శాఖ నిర్వహించిన ఒక సాహిత్య కార్యక్రమానికి నేను హాజరయ్యాను,



తమిళన్ బన్ అనుకుంటాను... నన్నయ నుండి నేటివరకు గల తెలుగు సాహిత్యాన్ని సంగ కవిత్వం నుండి ఈ నాటి వరకున్న తమిళ సాహిత్యాన్ని తులనాత్మకంగా వివేచించారు. అనువాదం వచ్చిందంటే చాలు కండ్లకు అద్దుకుంటారు. జ్ఞాన పిపాస మనకన్నా ఎక్కువ ఇతరులకు - చారిత్రక దృష్టి కూడా మనకంటే ఎక్కువ వాళ్లకు. నారాయణరెడ్డి గారు కూడా ఇతరులకు చాలా తెలుసు, అట్లా శివారెడ్డి, గోపి మొదలైన వారలందరూ చాలా మందికి ఎరుక.

మన కవిత్వం చాలా గొప్పదనీ, ముఖ్యంగా ఉద్యమ కవిత్వం గొప్పగా వుందనీ ఇతరులు తెలుసుకున్నారు. ఆయా వాదాల కవిత్వమూ, కథలూ ఏమాత్రం తీసిపోనివన్న అవగాహన ఏర్పరచుకున్నారు.

**మీరు 14 భారతీయ భాషలు నేర్చుకోవాలనే పట్టుదల మీకు ఎట్లా వచ్చింది? ఇప్పటికీ అన్ని భాషాసాహిత్యాలను చదువుతున్నారా ?**

ఇదో పెద్ద కథ, నిజానికి నాది విలక్షణ మనస్తత్వం, అందరూ నడిచే దారి కన్నా భిన్నంగా వుండాలన్న భావన నాలో స్వతః సిద్ధంగా వుండొచ్చు, చిన్నప్పుడు "లెక్కలు'' అంటే అంతా భయపడేవాళ్ళం, ఏం లెక్కలు ఎందుకు గొట్టు? అని ప్రశ్నించుకునే వాణ్ణి ! ఎస్.ఎస్.సిలో మిగిలిన సబ్జెక్టుల కన్న లెక్కల్లో ఎక్కువ మార్కులు వచ్చాయి, బి.ఇడిలో సైకాలజీ అంటే బెదిరిపోయేవాళ్ళం. నాకు అందులోనే ఎక్కువ మార్కులు, అట్లాగే ఎక్స్‌టర్నల్‌గా ఏం.ఏ చేస్తే పర్సెంటేజ్ ఇద్దరు అనే వాళ్లు, నాకు ఫస్ట్ క్లాస్ వచ్చింది. కొంత భిన్నంగా ఆలోచించడం వల్ల కావచ్చును భాషల వైపు మళ్ళడం, అయితే అదొక్కటే కారణం కాదు.

నేను సైన్సు టీచర్‌గా కొలనూర్ అనే ఊరికి నియుక్తున్ని అయి వెళ్ళినప్పుడు ఆ వూళ్ళో గ్రంథాలయం లేదు కనీసం దినపత్రిక కూడా రాదు. అప్పటికి ఏం.ఏ. ఎక్స్టర్నల్‌గా అయిపోయింది ఏం.ఫిల్‌కు

> **సృజనకారులు ఒక ప్రత్యేక వ్యక్తిగత గ్రంథాలయం ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలి. రాత్రికి రాత్రే పేరు రావాలన్న యావలోంచి బైటికి రావాలి. ముఖ్యంగా సృజనకారులు తమకు నచ్చిన ప్రక్రియలో కనీసం ఒక దశాబ్దం పాటు లోతైన అధ్యయనం అలవర్చుకోవాలి.**

వెళితే నేను ఎక్స్టర్నల్ కనుక నాకు అవకాశాలు ఇవ్వలేదు. ఇకపై చదువులకు వీలులేదు నాకేమో ఆరవ తరగతి నుండి పాఠ్య పుస్తకేతరమైనవి చదవడం అలవాటు. ఏం చేయాలి? 30 రోజులలో అంటూ ప్రారంభించాను త్రిభాషా సూత్రం ద్వారా మనందరికి వచ్చిన మూడింటిలో మరో 11 నేర్చుకుని 14 చేర్చాను ఇక్కడ మరో మాట చెప్పాలి పట్టుదల నాకు మా నాన్న నుండి వచ్చింది. చిన్నతనంలోనే తల్లిదండ్రుల్ని పోగొట్టుకుని అక్కాచెల్లెళ్ల అన్నదమ్ములు లేని కనీసం ఇల్లు అడుగు జాగ, తరిగాని కుశ్కిగాని లేని మా బాపును వాళ్ళ మేనమామ చేరదీశాడు. అటువంటి మా తండ్రి రాళ్లు మోసి బీడీలు చేసి మార్వాడి దుకాణంలో ఉండి కోపులల్ల అడవిలో ఉండి, ప్రైవేట్ టీచర్‌గా చేసి చివరికి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా నియమించబడి జీవితాన్ని గెలుచుకున్న నలిమెల రామచంద్రం మా తండ్రి. పోతే కొత్తపల్లి వీరభద్రరావు స్వాతంత్ర్యానికి పూర్వం మనదేశానికి కొచ్చిన పాశ్చాత్యులు ఇక్కడే భాష నేర్చుకుని నిఘంటువులు వేసి వ్యాకరణాలు రాసి సేవ చేశారు, కానీ స్వాతంత్ర్యానంతరం ఏ భారతీయుడు సోదర భాష నేర్చుకుని అధ్యయనం చేయకపోవడం విషాదం అని రాసిన మాటలు కూడా నన్ను వెంటాడినై, ఫలితంగా భాషల అధ్యయనం.

ఇప్పటికే దాదాపుగా అన్ని భాషా సాహిత్యాలు చదువుతున్నాను. అయితే మునుపటిలా ముమ్మరంగా కాదు. కండ్లు సహకరించని కారణాన తగ్గించాను.

**తెలుగులో ఇతర భాషల్లోని పత్రికల్లో సాహిత్యం స్థానం ఎంత...? మనవాళ్లు ఇటీవల సాహిత్య ప్రత్యేక సంచికలు వేయడం లేదు. పుటలు తగ్గిస్తున్నారు. ఎందుచేత.. ?**

కారణం మనమే...! మనం చదవం కదా...! పుటలు తగ్గిస్తారు మరి...! ఇందాకే చెప్పుకున్నాం. ఇతరులతో పోలిస్తే మనకు అధ్యయన శీలం తక్కువని. అయితే తెలుగులో సోమవారం పేజీలు మన ప్రత్యేకం, ఇతర భాషల్లో ఆదివారం సంచికలు ప్రత్యేకం. అంతేగాక అక్కడ ఉగాది, విజయదశమి, దీపావళి, ప్రత్యేక సంచికలు వేస్తారు. బెంగాలీలో దసరా సంచికలు, దర్శనమిస్తాయి. తమిళంలో, కన్నడంలో ప్రత్యేక సంచికలున్నాయి. ఓనం పండుగకు మలయాళంలో ప్రత్యేకంగా పత్రికలు, సంచికలు వేస్తున్నాయి. మరాఠీలో ఉన్నాయి. తెలుగులో ఇంతకు మునుపు ఉండేవి అని చెప్పుకోవలసిన దుస్థితి. దీనికి కారణం. మరలా చెబుతున్నాను. మనమే కారణం. రచయితలే చదువరు. పుస్తకాలు కొనరు. కేరళలో రచయిత 10 వేల కాపీలు వేసుకుంటే, ఏడాదిలో చెల్లిపోతాయి. పఠన సంస్కృతి వికసించనంత కాలం పత్రికలు ఏం చేస్తాయి మరి...!

**నూతన తరం పాఠకులకు, సృజనకారులకు మీరిచ్చే సలహా ఏంటి...?**

బాగా చదవాలి. సృజనకారులు ఒక ప్రత్యేక వ్యక్తిగత గ్రంథాలయం ఇంట్లో ఏర్పాటు చేసుకోవాలి. రాత్రికి రాత్రే పేరు రావాలన్న యావలోంచి బైటికి రావాలి. ముఖ్యంగా సృజనకారులు తమకు నచ్చిన ప్రక్రియలో కనీసం ఒక దశాబ్దం పాటు లోతైన అధ్యయనం అలవర్చుకోవాలి. ఆ తరువాతే ఆ ప్రక్రియే ఆ రచయితను పట్టుకుని ముందుకు నడిపించగలదు. చాలా సంయమనం అవసరం. అన్ని గాలుల్ని ఆహ్వానించాలి. ఒక సహృదయ దృక్పథం అవసరం. సృజనశీల రచయితలు, కొత్త వాళ్లైనా, పాత వాళ్లైనా ముందు మనిషిగా మారాలి.

# మిమిక్రీ సామ్రాట్, 'నేరెళ్లకు నివాళి'

తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో... తెలుగు భాషా చైతన్య సమితి, లక్ష్యసాధన ఫౌండేషన్ సంయుక్తంగా 23.01.2021న అంతర్జాల వేదికగా "తెలుగు గజల్", గానం - రచన" అనే అంశంలపై ఉపన్యాస కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇందులో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ ప్రజావాగ్గేయకారుడు, రచయిత, కవి శ్రీ కన్నెగంటి వెంకటయ్య గజల్ నేపథ్యాన్ని, గజల్స్ ఆలపిస్తూ... వాటి రచనా విధానాన్ని, పాడడంలో గల మెలకువల్ని వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ... సాహిత్య సృష్టిని, సాహిత్య కార్యక్రమాలను ఆపలేదని, అనేక సంస్థలు అంతర్జాల వేదికగా నిర్వహించే కార్యక్రమాలను ఆర్థికంగా సాయం చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతి అంతర్జాల కార్యక్రమానికి




రూ.2000 మరియు ప్రధాన వక్తకు రూ.500 ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడేసాబ్, సంపాదకులు డాక్టర్ జయప్రకాశ్, మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వర్లు, నరహరి తదితరులు పాల్గొన్నారు. **- కపిల భారతి, రిపోర్టర్**

# సాహితీ జిజ్ఞాసను కలిగించిన ఐత్వారం ముచ్చట్లు



నిన్న ఆదిలాబాద్‌లో కొమురం భీమ్ చౌకులో బ్రహ్మ అసోసియేట్ కార్యాలయంలో ఐత్వారం ముచ్చట్లు కార్యక్రమం జరిగింది. దీనిలో తెలంగాణ ఇంటలెక్చువల్స్ ఫోరమ్ కూడా పాల్గొన్నది ఇంటలెక్చువల్స్ ఫోరమ్ ప్రధాన కార్యదర్శి మదన్మోహన్ అడ్వకేట్, తెరవే. అధ్యక్షులు బి. వేణుగోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మన్నె ఏలీయాలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి భూమన్న, రిజ్వాన్, మల్లికార్జున్, వేణుగోపాల్ రెడ్డి, ఉదారి నారాయణ, దర్శనం దేవేందర్, యు గంగన్న, బాలసాని నారాయణ గౌడ్ ఇంకా కమ్మల నర్సిములు, కురివెల్లి లింగన్న తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ఆవిష్కృతమైన 'పద్యప్రభంజనం'



అవుసుల భానుప్రకాశ్ సంపాదకత్వంలో 610 కి పైగా కవుల పద్యకవిత్వం.. 2300 పద్యాలతో అపూర్వ దేశభక్తి పద్య బృహత్సంకలనం పద్య ప్రభంజనం ఆవిష్కర ణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హారజరైన ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, తంగేడు పక్షపత్రిక ఎడిటర్ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా ఈ గ్రంథం ఆవిష్కృతమైంది. పద్యప్రభంజనం విశిష్ఠ జాతీయ కావ్యమని కవిత ఉద్ఘాటించారు. కార్యక్రమంలో అవుసుల భానుప్రకాశ్, ఆచార్య కసిరెడ్డి వెంకట రెడ్డి, విశిష్ట అతిథిగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ మరియు డా. ఏనుగు నరసింహారెడ్డి, మామిండ్ల రామాగౌడ్, పూసల లింగాగౌడ్, బోర్పట్ల హన్మంతాచారి, డా. ఎస్. రఘు, మహారెడ్డి మహిపాల్ రెడ్డి, కందిశంకరయ్య, అయాచితం నటేశ్వర శర్మ, మరుమాముల దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

# మావతావాది ఉమ్మడి సింగు హనుమంతరావు స్మారక పురస్కార ప్రదానం



త్యాగరాయ గానసభలో మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన "మావతావాది ఉమ్మడి సింగు హనుమంతరావు స్మారక పురస్కారం"ను నేటి నిజం సంపాదకులు బైసదేవదాసు, సారస్వత పరిషత్ కార్యదర్శి డా॥ జె. చెన్నయ్యలకు ప్రదానం చేస్తున్న రఘుశ్రీ, డా॥ కె.బి. గోపాలం, కళా వి.యస్. జనార్ధన మూర్తి, రవీంద్రనాథ్ సింగ్ చౌహాన్.




## కొండరెడ్డి గిరిజనుల జీవనం - భాషా సాహిత్యాంశాలు

**డా॥ కపిల భారతి**
సరూర్ నగర్, హైదరాబాద్
సెల్: 9989101689
వెల: 150/-




## గల్పికా తరువు

**జ్వలిత**
జెడి పబ్లికేషన్స్, హైదరాబాద్
సెల్ : 9989198943
వెల: 200/-




## సర్పంచ్

**లక్ష్మణ్ బూరుగు**
ఆదిలాబాద్
సెల్: 9949456940
వెల: 50/-




## నివేదనగా కవిత్వం

**డా॥ వెన్నం ఉపేందర్**
అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలు
సెల్: 9441268861
వెల: 75/-




## షార్ట్ స్టోరీస్ ఆఫ్ కాళోజీ నారాయణరావు

**అనువాదం : ఎలనాగ**
కాళోజీ ఫౌండేషన్, వరంగల్
హైదరాబాద్ & వరంగల్
వెల : రూ. 60/-




## కోటి శతకం

**గజ్జి కోటేష్**
నల్గొండ
సెల్ : 9951213860
వెల : రూ. 99/-




## సామాన్యుడి ఉత్తరం

**అలాజ్‌పూర్ లక్ష్మినారాయణ**
సిద్దిపేట
సెల్ : 9912388114




## రాగ మోహనం

**కె. హరనాథ్**
ప్రజాశక్తి బుక్ హౌస్, నవోదయ బుక్ హౌస్,
నవచేతన బుక్ హౌస్
వెల : రూ. 110/-




## మహాభారతం సమకాలీనత

**డా॥ వైరాగ్యం ప్రభాకర్**
భవాని ప్రచురణలు, కరీంనగర్
వెల : రూ. 500/-




## చుక్కాని చిరు దీపం

**స్వాతి శ్రీపాద**
స్మిత ప్రచురణలు, హైదరాబాద్
సెల్ : 8297248988
వెల : రూ. 100/-

